నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

సూర్య 19 వ వసంతంలోకి ...

visit us @ https://www.suryaepaper.com

శుక్రవారం | 6 మార్చి 2026 | విజయవాడ

సంపుటి 19 | సంచిక 136

| పేజీలు 10+8 | వెల: రూ. 6.50

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi





'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.


అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం : ఉత్తరాయణం - శిశిర రుతువు, ఫాల్గుణ మాసం బహుళ పక్షం, తదియ సా.5.33, హస్త ఉ.9.23, వర్జ్యం సా.5.55 నుంచి 7.37 వరకు
రాహుకాలం ఉ.10.30 నుంచి 12.00 వరకు దుర్ముహూర్తం ఉ.8.40 నుంచి 9.27 వరకు తిరిగి మ.12.34 నుంచి 1.21 వరకు



## అవినీతి అంతం నా పంతం


- పేద విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్య, ● ఐదు ఎకరాలలోపు రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ ● ప్రజాకర్షక హామీలతోనే ఎన్నికల మేనిఫెస్టో విడుదల

తమిళనాడులో మరి కొద్ది వారాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు అన్ని పార్టీలూ చేస్తున్నాయి. తాజాగా, నటుడు విజయ్ పార్టీ టీవీకే కూడా వెళ్తోంది. ఈ మేరకు తంజావూరులో జరిగిన బహిరంగ ర్యాలీలో ఆయన ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలపై ఆయన విమర్శలు చేశారు.

6 లో

## ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే..
# ముగ్గురు ముద్దు

- పాపులేషన్ మేనేజ్‌మెంట్‌పై ప్రభుత్వం ఫోకస్
- కుటుంబ నియంత్రణ నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ వైపు ఏపీ అడుగులు ● సంతానోత్పత్తి రేటు 2.1 శాతం ఉంటే సుస్థిర ప్రగతి ● పిల్లలు కనేవారికి ప్రభుత్వం ప్రోత్సాహకం ● పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ద్వారా ప్రభుత్వమే సాయం
- ముసాయిదా పాలసీపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ ● అసెంబ్లీలో సీఎం బాబు



ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్‌కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు.

2 లో

## యుద్ధాలు సమస్యల్ని
# పరిష్కరించవు

- సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారం ● ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు మోడీ ఫోన్ ● మధ్యప్రాచ్యం సంక్షోభంపై సంభాషణ ● దౌత్యానికి రావాలని మోడీ పిలుపు

మధ్యప్రాచ్యం సంక్షోభం వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేశారు. యుద్ధం విషయంలో దౌత్యానికి మోడీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో మోడీ పేర్కొన్నారు. గత ఐదు రోజులుగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హతమయ్యాడు.



6 లో



5 లో

## లాభాల్లో స్టాక్ మార్కెట్‌లు

- పశ్చిమాసియా పరిణామాలపై సానుకూల సంకేతాలు ● భారీగా పుంజుకున్న స్టాక్ మార్కెట్ ● ఒక్కరోజే దాదాపు 900 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

## ఏప్రిల్ 2 నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు?

- ముందుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల యోచన ● కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం తరువాతనే ఈ ఎన్నికలు ● వ్యూహాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం

2 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం
# సాధ్యం కాదు

- వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై స్పీకర్ అసహనం ● గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదు ● జగన్ జీతం తీసుకోవడం లేదు ● స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టీకరణ



3 లో

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటం పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు.

## తిరుమల లడ్డూ అంశంపై
## మండలిలో గందర గోళం

- శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై చర్చలో గందరగోళం
- జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగింది



3 లో

## ఉద్యోగుల సంక్షేమమే మా లక్ష్యం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



3 లో

## కొత్త జిల్లాల ఆధారంగా
# జెడ్పీ ఎన్నికలు


- స్థానిక సంస్థల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం ● విభజించిన జిల్లాల ప్రాతిపదికన జెడ్పీ ఎన్నికలకు సన్నాహాలు ● అభివృద్ధి పనుల్లో చెట్ల తొలగింపుకు ప్రత్యామ్నాయాలపై ఆలోచన ● పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలకు రూ. 27,415 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలు ● డిప్యూటీ సీఎం పవన్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా విభజించిన కొత్త జిల్లాల ప్రాతిపదికన జెడ్పీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు ప్రక్రియ కొనసాగుతోందని, పంచాయతీల పునర్విభజనకు కూడా ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేవని తెలిపారు.



3 లో


## అంతా ఇంతే!




నెక్ట్స్ చంద్రబాబును ఆహ్వానిద్దాం సార్ !

## రూ.6 వేల కోట్లతో 200
# సబ్ స్టేషన్ల నిర్మాణం

- విద్యుత్ సరఫరా ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం ●కూటమిలో పరిశ్రమల రాకతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం ●అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, పవర్ స్టేషన్ల నిర్మాణం
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి



2 లో

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడు వివాహానికి హాజరైన సూర్య
## చైర్మన్ నూకారపు సూర్యప్రకాశరావు



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుమారుడు చిరంజీవి మల్లు విక్రమాదిత్య సాక్షిల వివాహం శంషాబాద్ లో జరిగింది. వివాహానికి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సీఎం రేవంత్ రెడ్డి, ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సూర్య దినపత్రిక చైర్మన్ నూకారపు సూర్య సూర్య ప్రకాశరావు, సినీ నటులు చిరంజీవి, ప్రకాష్ రాజ్ తదితరులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు




## టీటీడీలో కొనుగోలు
## విధానం కట్టుదిట్టం!



2 లో

- రూ.43 కోట్ల వస్త్రాలు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థల నుంచే
- ఆప్కో, కోఆప్టెక్స్‌ల నుంచి వస్త్రాలు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్
- రూ.43 కోట్ల విలువైన వస్త్రాలను 50:50 నిష్పత్తిలో సేకరణ ● సరఫరాలో అంతరాయం లేకుండా మల్టీ వెండార్ విధానం అమలు
- కొనుగోళ్లలో పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట వేసిన టీటీడీ

## బీహార్‌లో ముగిసిన
# నితీష్ శకం



6 లో

- ఇక పెద్దల సభ వైపు అడుగులు,
- సీఎం పదవి బీజేపీ నేతకు అవకాశం
- కొత్త ప్రభుత్వానికి ఫుల్ సపోర్ట్ చేస్తానని ప్రకటన ● జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని నిర్ణయం

బీహార్ రాజకీయాల్లో నితీష్ కుమార్ శకం ముగిసిందా? ఉన్నట్లుండి ఎందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారా? జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావిస్తున్నారా? రానున్న రోజుల్లో రాజకీయ ఎత్తుగడలు ముందే నితీష్ పసిగట్టారా?







# ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు ముద్దు !


● పాపులేషన్ మేనేజ్ మెంట్‌పై ప్రభుత్వం ఫోకస్ ● కుటుంబ నియంత్రణ నుంచి పాపులేషన్ మేనేజ్ మెంట్ వైపు ఏపీ అడుగులు ● సంతానోత్పత్తి రేటు 2.1 శాతం ఉంటే సుస్థిర ప్రగతి ● పిల్లలు కనేవారికి ప్రభుత్వం ప్రోత్సాహకం.. ● పిల్లలు లేని వారికి ఐవీఎఫ్ ద్వారా ప్రభుత్వమే సాయం ● ముసాయిదా పాలసీపై నెల రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ ● అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ఏపీ శాసనసభలో పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ పై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఏపీకి అత్యంత కీలకమైన పాలసీని శాసనసభలో ప్రకటించారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ప్లానింగ్కు ప్రాధాన్యం ఇచ్చామని.. ఇకపై పాపులేషన్ కేర్ వైపు దృష్టి సారించాల్సి ఉందన్నారు. ప్రస్తుతం డ్రాఫ్ట్ పాలసీని శాసనసభలో ప్రవేశపెట్టి ప్రజల ముందు ఉంచుతున్నామని వివరించారు. దీని పై నెలరోజుల పాటు విస్తృత చర్చ జరగాలని కోరుతున్నామని సీఎం తెలిపారు. జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ లాంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేట్ తగ్గుతోందని.. భారత్తో పాటు ఏపీ లాంటి రాష్ట్రాల్లోనూ ఈ తరహా పరిస్థితే నెలకొందని వెల్లడించారు.

ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ ( టీఎఫ్ఆర్) 1.5గా ఉందని.. 1993లో ఇది 3.0గా నమోదైందని సీఎం వివరించారు. టీఎఫ్ఆర్ వేగంగా తగ్గితే పని చేసే వయస్సులో ఉన్నవారి సంఖ్య గణనీయంగా తగ్గి, ఆర్థిక వృద్ధి మందగిస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆర్థిక వ్యవస్థకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని చెప్పారు. 2023 లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏటా 6.70 లక్షల జననాలు నమోదవుతున్నాయని తెలిపారు. ఇలాగే కొనసాగితే 2047 నాటికి జనాభాలో 23 శాతం మంది వృద్ధులు ఉంటారని అన్నారు. మహిళల లేబర్ ఫోర్సు పార్టిసిపేషన్ రేట్ ప్రస్తుతం 31 శాతంగానే ఉంటుందని.. ఇది 59 శాతానికి చేరితే రాష్ట్ర జీఎస్డీపీ 15 శాతం పెరుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు.

పాపులేషన్ మేనేజ్మెంట్ కోసం ఐదు అంచెల లైఫ్ సైకిల్ విధానాన్ని అమలు చేయాల్సి ఉందన్నారు సీఎం. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని లాంటివి ఐదు పిల్లర్లుగా పనిచేస్తాయన్నారు. మహిళల గర్భధారణ నుంచి వృద్ధాప్యం వరకు ప్రతి దశలో ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. పిల్లలు లేక ఫెర్టిలిటీ సమస్యలతో బాధపడేవారిని ప్రభుత్వం ఆదుకుంటుందని.. మాతృత్వ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఏర్పాటు చేసి, సబ్సిడీపై పీపీపీ మోడల్లో ఐవీఎఫ్ సేవలు అందించాలని యోచిస్తున్నామని అన్నారు. సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించడం ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. ప్రస్తుతం 8.8 శాతంగా ఉన్న టీనేజి గర్భధారణలను 3 శాతం కంటే తక్కువకు తగ్గించే చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు.

50 మంది చిన్నారులు ఉన్న చోట చైల్డ్ కేర్ సెంటర్లు, పింక్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్లు సీఎం తెలిపారు. మహిళల రక్షణ కోసం షీ క్యాబ్స్ అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో రూ.172 కోట్లతో వర్కింగ్ ఉమెన్ హాస్టల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. మహిళా ఉద్యోగులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాల్లో కొత్త వర్కింగ్ ఉమెన్ హాస్టళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. మూడో సంతానం, ఆపై జననాలకు తల్లులకు 12 నెలల పేరెంటల్ లీవ్, తండ్రులకు 2 నెలల పెటర్నల్ లీవ్ ఇవ్వాలని ఆలోచిస్తున్నామని అన్నారు. త్వరలో 'తల్లిదండ్రుల సమాన బాధ్యత' పేరుతో కుటుంబ బాధ్యతలు పంచుకోవడంపై అవగాహన క్యాంపెయిన్ నిర్వహిస్తామని సీఎం తెలిపారు. 2047 నాటికి ఏపీలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా వేస్తూ, ప్రతి జిల్లాలో వృద్ధుల సంరక్షణకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు సీఎం. 175 సీహెచ్సీలలో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తామని తెలిపారు. సిల్వర్ స్కిల్స్ రిజిస్ట్రీ ద్వారా 50,000 రిటైర్డ్ ప్రొఫెషనల్స్ను మెంటరింగ్లో భాగం చేస్తామన్నారు. రిటైర్మెంట్కు



ముందే ఉద్యోగులకు 15 రోజుల వెల్నెస్ లీవ్, రూ.50,000 ఆరోగ్య నిధి అందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ ముసాయిదా పాలసీని ప్రజల ముందు ఉంచుతున్నామని, దీనిపై రాబోయే నెల రోజుల పాటు విస్తృత చర్చ జరగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. అందరి అభిప్రాయాలు స్వీకరించిన తర్వాతే దీనికి తుది రూపం ఇస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు వద్దు !

ఇక నుంచి ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు ముద్దు అని మాట్లాడాలన్నారు. శాసన సభలో చర్చ జరిగితే విభిన్న అభిప్రాయాలు వచ్చాయి. లేదంటే ఆ అభిప్రాయాలు ఎలా తెలుస్తాయి..? ఇప్పటికీ పేద వర్గాల వారే ఎక్కువ మంది పిల్లల్ని కంటున్నారు. అందుకే తల్లికి వందనం పథకం అందరికీ ఇచ్చామన్నారు. డబ్బులు ఉన్న వారు ఎందుకు తక్కువ మంది పిల్లల్ని కంటున్నారు. అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు ఉండేలా చూస్తాం.. ఒక జంటకు కనీసం ఇద్దరు పిల్లలుండాలి. ముగ్గురు పిల్లల్ని కంటే ఇంకా మంచిది. రెండో బిడ్డను కన్నా తండ్రికి ఒక నెల, మూడో బిడ్డను కన్నా తండ్రికి 2 నెలలు సెలవు మంజూరు చేస్తామని సీఎం చంద్రబాబు అన్నారు.

# ఏప్రిల్ 2 నుంచి పంచాయతీలకు ప్రత్యేక అధికారులు?

● ముందుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల యోచన ●కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం తరువాతనే ఈ ఎన్నికలు ● వ్యూహాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఆంధ్ర ప్రదేశ్ లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు సమాచారం. ముందుగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను నిర్వహించి, అనంతరం గ్రామ పంచాయతీ ఎన్నికలు చేపట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీలకు ఏప్రిల్ 2 నుంచి ప్రత్యేక అధికారులను నియమించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం 26 జిల్లా పరిషత్లు ఉన్నాయి. ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్ ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సంబంధించిన ప్రధాన ప్రణాళికలు, నిధుల వినియోగం, అభివృద్ధి పనుల పర్యవేక్షణలో జిల్లా పరిషత్లకు కీలక పాత్ర ఉంది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 679 మండల పరిషత్లు పనిచేస్తున్నాయి. ప్రతి మండలానికి మండల పరిషత్ ఉంటుంది. గ్రామ పంచాయతీల నుంచి వచ్చే అభివృద్ధి అవసరాలను సమన్వయం చేసి, మండల స్థాయిలో పథకాలు అమలు చేయడం మండల పరిషత్ల ప్రధాన బాధ్యతగా ఉంటుంది. జిల్లా పరిషత్లలో జెడ్పీటీసీ సభ్యులు ప్రజల ద్వారా నేరుగా ఎన్నికవుతారు. వీరిలో నుంచి జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నిక చేస్తారు. అదే విధంగా మండల పరిషత్లలో ఎంపీటీసీ సభ్యులు ఎన్నికవుతారు. వీరిలో నుంచి మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఎన్నికవుతారు. గ్రామ పంచాయతీల నుంచి జిల్లా స్థాయి వరకు గ్రామీణ పరిపాలనను బలపరచడంలో ఈ వ్యవస్థ కీలకంగా ఉంటుంది. రాష్ట్రంలో చివరిసారిగా జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలు 2021లో నిర్వహించబడ్డాయి. అప్పటి ప్రభుత్వం రెండు దశల్లో ఎన్నికల ప్రక్రియను చేపట్టింది. 2021 ఏప్రిల్ 8న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించబడింది. అనంతరం లెక్కింపు ప్రక్రియ నిర్వహించి ఫలితాలను ప్రకటించారు. ఈ ఎన్నికల్లో భారీ రాజకీయ పోటీ నెలకొంది. పలు జిల్లాల్లో తీవ్రమైన ప్రచారం, రాజకీయ విమర్శలు చోటుచేసుకున్నాయి. గ్రామ పంచాయతీ ఎన్నికలు కూడా అదే సంవత్సరం నాలుగు దశల్లో నిర్వహించబడ్డాయి. రాష్ట్రవ్యాప్తంగా 13 వేలకుపైగా గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటికి సర్పంచ్లు, వార్డ్ సభ్యులను ప్రజలు నేరుగా ఎన్నుకుంటారు. గ్రామీణ అభివృద్ధి పనులు, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణలో పంచాయతీలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుతం గ్రామ పంచాయతీ ఎన్నికలను ముందుగా నిర్వహిస్తే గ్రామాల్లో రాజకీయ విభజనలు తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి. అలా జరిగితే తరువాత జరిగే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లో పార్టీలు ఎదుర్కొనే పరిస్థితులు మారే అవకాశం ఉందని విశ్లేషణ జరుగుతోంది. దీని ప్రభావం తరువాత జరిగే మున్సిపల్, నగరపాలక సంస్థల ఎన్నికలపై కూడా పడే అవకాశముందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గ్రామ పంచాయతీ ఎన్నికలను తాత్కాలికంగా వాయిదా వేసి, ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో పంచాయతీల పరిపాలన కొనసాగించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న పరిపాలనా మరియు రాజకీయ పరిస్థితులను పరిశీలించిన ప్రభుత్వం తక్షణమే ఎన్నికలు నిర్వహించడం కష్టమని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ముఖ్యమంత్రి తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేసినట్లు సమాచారం. కొంతకాలం పాటు ప్రత్యేక అధికారులతో పంచాయతీల పరిపాలన కొనసాగిస్తూ, ఈలోగా ఎన్నికల ప్రక్రియకు అవసరమైన పరిపాలనా ఏర్పాట్లు పూర్తి చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక రాష్ట్ర ఎన్నికల వ్యవస్థ కూడా ప్రస్తుతం కీలక దశలో ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని పదవీకాలం ముగియడంతో కొత్త కమిషనర్ను నియమించాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా పంచాయతీలకు సంబంధించిన రిజర్వేషన్ల ఖరారు, ఓటర్ల జాబితా సవరణ, వార్డుల పునర్విభజన వంటి అంశాలు కూడా పూర్తికావాల్సి ఉంది. ఈ పరిపాలనా ప్రక్రియలు పూర్తయిన తరువాతే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. అప్పటి వరకు గ్రామ పంచాయతీల పరిపాలనను ప్రత్యేక అధికారుల ద్వారా కొనసాగించే అవకాశమే ఎక్కువగా కనిపిస్తున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# రఘురామ కస్టడీ టార్చర్ కేసులో

● విచారణకు హాజరైన ఐపీఎస్ సునీల్ నాయక్
● అవసరమైతే మరికొంత మంది అధికారుల విచారణకు అవకాశం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి ఏపీ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసిన డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై జరిగినట్లు ఆరోపణలు ఉన్న కస్టడీ టార్చర్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఏడో నిందితుడిగా పేర్కొన్న బీహార్ కేడర్ ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ ఎట్టకేలకు పోలీసుల విచారణకు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశాల మేరకు గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్లో ఆయన దర్యాప్తు అధికారుల ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో ఈ విచారణ కొనసాగుతోంది. ఈ నెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఆయనను పోలీసులు ప్రశ్నించనున్నారు. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ కాలంలో 2021 మే నెలలో నరసాపురం ఎంపీగా ఉన్న రఘురామకృష్ణరాజును సీఐడీ అధికారులు దేశద్రోహం సహా పలు ఆరోపణల కేసులో అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేసిన అధికారులు అనంతరం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి తరలించారు. ఆ రోజు రాత్రి మొత్తం ఆయనను అక్కడే ఉంచి విచారణ జరిపినట్లు వెల్లడైంది. అనంతరం ఆయనను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అయితే తనను కస్టడీలో తీవ్రంగా హింసించారని, పోలీసులు టార్చర్ చేశారని రఘురామకృష్ణరాజు ఆరోపించారు. ఈ మేరకు కోర్టులో ఫిర్యాదు చేశారు. ఆయన కాళ్లకు గాయాలు అయ్యాయని, తనపై తీవ్రంగా దాడి జరిగిందని కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలు అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనంగా మారాయి. దీనిపై కోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించగా కొన్ని గాయాల గుర్తులు ఉన్నట్లు నివేదికల్లో వెల్లడైంది. ఈ పరిణామాల నేపథ్యంలో కస్టడీ టార్చర్ ఆరోపణలపై ప్రత్యేకంగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అప్పట్లో సీఐడీ విభాగంలో పనిచేసిన పలువురు అధికారులను ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ఆ సమయంలో సీఐడీ డీఐజీగా పనిచేసిన సునీల్ నాయక్ కూడా ఈ కేసులో ఏడో నిందితుడిగా గుర్తించబడ్డారు. రఘురామకృష్ణరాజు కస్టడీలో ఉన్న రాత్రి ఆయన పలుమార్లు సీఐడీ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో ఆధారాలు లభించాయని అధికారులు పేర్కొన్నారు. విచారణకు హాజరుకావాలని పలుమార్లు నోటీసులు ఇచ్చినా సునీల్ నాయక్ హాజరుకాలేదు. దీంతో ఆయనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు బీహార్ రాష్ట్రంలోని పాట్నా వరకు వెళ్లారు. అయితే కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆయనను అక్కడి నుంచి తీసుకురావడం సాధ్యపడలేదు. అనంతరం ముందస్తు బెయిల్ కోసం ఆయన ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే కోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయకుండా, విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సునీల్ నాయక్ గుంటూరుకు వచ్చి విచారణకు హాజరయ్యారు. సాయంత్రం వరకు సాగిన విచారణలో 2021 మే నెలలో జరిగిన సంఘటనలు, రఘురామకృష్ణరాజును గుంటూరు సీఐడీ కార్యాలయానికి తీసుకువచ్చిన తర్వాత జరిగిన పరిణామాలు, ఆ రాత్రి కార్యాలయంలో ఉన్న అధికారులు, విచారణ



ప్రక్రియ వంటి అంశాలపై దర్యాప్తు అధికారులు ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే ఆ సమయంలో ఆయన పాత్ర ఏమిటి, విచారణలో ఇచ్చిన ఆదేశాలు ఏవైనా ఉన్నాయా, రఘురామకృష్ణరాజు గాయాలకు కారణమైన పరిణామాలు ఏవైనా తెలుసా అనే విషయాలపై కూడా అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అవసరమైతే మరి కొంత మంది అధికారులను కూడా విచారణకు పిలిచే అవకాశముందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఈ కేసు రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది. రఘురామకృష్ణరాజు అప్పట్లో వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన నేపథ్యంలో ఆయన అరెస్టు, అనంతరం చేసిన కస్టడీ టార్చర్ ఆరోపణలు పెద్ద వివాదానికి దారితీశాయి. ప్రస్తుతం ఈ కేసులో జరుగుతున్న విచారణ రాజకీయ వర్గాల్లో కూడా ఆసక్తి రేకెత్తిస్తోంది. పోలీసులు సేకరిస్తున్న ఆధారాలు, సాక్ష్యాల ఆధారంగా ఈ కేసులో మరిన్ని కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశముందని అధికారులు సూచిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు సునీల్ నాయక్ను విచారించనున్నట్లు సమాచారం.

# టీటీడీలో కొనుగోలు విధానం కట్టుదిట్టం !

● రూ.43 కోట్ల వస్త్రాలు ఇకపై ప్రభుత్వ రంగ సంస్థల నుంచే ● ఆప్కో, కోఆప్టెక్స్‌ల నుంచి వస్త్రాలు కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ● రూ.43 కోట్ల విలువైన వస్త్రాలను 50:50 నిష్పత్తిలో సేకరణ ● సరఫరాలో అంతరాయం లేకుండా మల్టీ వెండార్ విధానం అమలు ● కొనుగోళ్లలో పారదర్శకత, నాణ్యతకు పెద్దపీట వేసిన టీటీడీ



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వస్త్రాల కొనుగోలు వ్యవస్థలో కీలక మార్పులు చేసింది. గతేడాది వెలుగులోకి వచ్చిన పట్టు శాలువాల కుంభకోణం నేపథ్యంలో ఇకపై పూర్తిస్థాయి పారదర్శకతతో కొనుగోళ్లు జరపాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా ప్రభుత్వ రంగ సంస్థలైన ఆప్కో, (ఆంధ్రప్రదేశ్), కోఆప్టెక్స్ (తమిళనాడు) నుంచి వస్త్రాలను 50:50 నిష్పత్తిలో సేకరించనుంది. మొత్తం రూ.43 కోట్ల విలువైన చీరలు, శాలువాలు, ఇతర వస్త్ర సామగ్రిని ఈ రెండు సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని టీటీడీ నిర్ణయించింది.

మల్టీ వెండార్ విధానానికి మార్పు : సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ఉండేందుకు మల్టీ వెండార్ విధానాన్ని ఎంచుకున్నట్లు టీటీడీ వర్గాలు తెలిపాయి. టీటీడీ ఏఈవో వెంకయ్య చౌదరి ఇటీవల ఆప్కో, కోఆప్టెక్స్ ప్రతినిధులతో సమావేశమై నాణ్యతా ప్రమాణాలపై చర్చలు జరిపారు. టీటీడీ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వస్త్రాలను సరఫరా చేయడానికి రెండు సంస్థలు అంగీకరించాయి. ఈ నిర్ణయంతో స్వామివారికి, అమ్మవార్లకు అవసరమైన వస్త్రాలు ఇకపై ప్రభుత్వ ఆధ్వర్యంలోని చేనేత సహకార సంఘాల నుంచే రానున్నాయి.

కుంభకోణం తర్వాత సంస్కరణలు : గతేడాది పట్టు శాలువాల కుంభకోణం తీవ్ర చర్చనీయాంశమైంది. మల్బరీ పట్టు శాలువాల బదులుగా నాసిరకం పాలిస్టర్ శాలువాలు సరఫరా చేసినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. రూ.350, 400 విలువ చేసే శాలువాను రూ.1,389 చొప్పున 2015 నుంచి కొనుగోలు చేసినట్లు సమాచారం బయటపడింది. ఈ వ్యవహారంపై టీటీడీ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు ప్రారంభమైంది. ఈ పరిణామాల నేపథ్యంలో భవిష్యత్తులో ఇలాంటి లోపాలకు తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని దేవస్థానం నిర్ణయించింది.

భారీ వార్షిక అవసరాలు : టీటీడీకి ఏటా భారీ స్థాయిలో వస్త్రాలు అవసరమవుతాయి. తిరుమల శ్రీవారి ఆలయానికి సంవత్సరానికి సుమారు 65 స్వచ్ఛమైన జరీ మేల్‌చాట్, ఉత్తరీయం సెట్లు, 1,080 పట్టు చీరలు అవసరం. ఇతర ఆలయాలకు 320 మేల్‌చాట్ సెట్లు, వందల సంఖ్యలో పట్టు చీరలు అవసరమవుతాయి. అదనంగా ఏటా 36 వేల పట్టు శాలువాలు, 60 వేల పాలిస్టర్ శాలువాలు, 10.8 లక్షల కాటన్ వస్త్రాలు, 9 లక్షల కాటన్ బ్లౌజ్ పీసులు టీటీడీ సేకరిస్తుంది. ఈ అవసరాలన్నింటినీ ఇకపై ఆప్కో, కోఆప్టెక్స్‌లు సంయుక్తంగా తీర్చనున్నాయి. పారదర్శకత, నాణ్యత, ప్రభుత్వ రంగ భాగస్వామ్యంతో టీటీడీ తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో ఆదర్శంగా నిలుస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## రూ.6 వేల కోట్లతో..

# 200 సబ్ స్టేషన్ల నిర్మాణం

● విద్యుత్ సరఫరా ఇబ్బందులు లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యం ●కూటమిలో పరిశ్రమల రాకతో పెరుగుతోన్న విద్యుత్ వినియోగం ●అధిక లోడ్ ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ లైన్లు, పవర్ స్టేషన్ల నిర్మాణం ● ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి

రాష్ట్రంలో విద్యుత్ లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కొత్త సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.6 వేల కోట్లతో పనులు చేపట్టినట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, కోళ్ల లలిత కుమారి, ముత్తుముల అశోక్ రెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 200 కు పైగా 33/11 కేవీ సబ్ స్టేషన్ల అవసరం ఉందని గుర్తించి, వాటి నిర్మాణానికి చర్యలు చేపట్టామని మంత్రి వెల్లడించారు. విజయనగరం జిల్లా వేణుగోపాలపురం సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రస్తుతం రీటెండరింగ్ దశలో ఉన్నాయని, 2027 మార్చి నాటికి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే విజయనగరం జిల్లాలో రూ.46 కోట్ల వ్యయంతో 220 కేవీ, 132 కేవీ లైన్ల పనులు పూర్తి అయ్యాయని, వాటిని త్వరలో చార్జ్ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అదేవిధంగా వేణుగోపాలపురంలో రూ.77 కోట్లతో సబ్ స్టేషన్ పనులు కొనసాగుతున్నాయని మంత్రి గొట్టిపాటి సభకు వివరించారు. విజయనగరంలో కూడా విశాఖపట్నం తరహాలో అండర్ గ్రౌండ్ కేబులింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు కోరగా, ఆ వ్యవస్థ ఖర్చుతో కూడుకున్నదని మంత్రి గొట్టిపాటి తెలిపారు. నిధుల లభ్యత, అవసరాన్ని బట్టి ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో 220 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కోరగా, విద్యుత్ శాఖ ఫీజిబిలిటీ రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకుంటామని మంత్రి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన పెరిగిందని, దీంతో రోజువారీ విద్యుత్ వినియోగం 263 మిలియన్ యూనిట్ల నుంచి 280 మిలియన్ యూనిట్లకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి పెంపుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 400 కేవీ, 220 కేవీ, 132 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. అలాగే రైతులకు పెద్దఎత్తున వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, వ్యాపార, పారిశ్రామిక, గృహ అవసరాల కారణంగా విద్యుత్ వినియోగం పెరిగిందని చెప్పారు. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ కొరత లేకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలు, పెరుగుతున్న డిమాండ్ను దృష్టిలో పెట్టుకుని లోడ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో 33/11 కేవీ సబ్ స్టేషన్లు, విద్యుత్ లైన్ల నిర్మాణాన్ని రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి వేగవంతం

మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సమగ్ర వివరణ



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, సామర్థ్య విస్తరణ, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మండలిలో ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, బీటీ నాయుడు, బీద రవిచంద్రలు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలోని ఏకైక ప్రధాన (మేజర్) పోర్ట్ అయిన విశాఖపట్నం పోర్టు అథారిటీ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 141.6 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తోందని మంత్రి వెల్లడించారు.

రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టులు ప్రజా-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో నిర్వహించబడుతున్నాయని చెప్పారు. వాటిలో గంగవరం పోర్టు 64 మిలియన్ మెట్రిక్ టన్నులు, కృష్ణపట్నం పోర్టు 98 మిలియన్ మెట్రిక్ టన్నులు, కాకినాడ డీప్ వాటర్ పోర్టు 26 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యాలతో పనిచేస్తున్నాయని వివరించారు. అదనంగా, ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు నిర్వహణలో ఉన్న కాకినాడ యాంకరేజ్ పోర్టు 5 మిలియన్ మెట్రిక్ టన్నులు,రవ్వా పోర్టు 2 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కొనసాగుతున్నాయని తెలిపారు.


రాష్ట్రంలో ఈపీసీ విధానంలో మూడు గ్రీన్ ఫీల్డ్ పోర్టులు నిర్మాణంలో ఉన్నాయని మంత్రి చెప్పారు. రామయపట్నం పోర్టు 24 ఏప్రిల్ 2026 నాటికి, మచిలీపట్నం పోర్టు 28 డిసెంబర్ 2026 నాటికి,మూలపేట పోర్టు 30 నవంబర్ 2026 నాటికి పూర్తి కానున్నాయని తెలిపారు. ఈ పోర్టులు పూర్తైన తరువాత ఆరు నుండి తొమ్మిది నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించే అవకాశం ఉందన్నారు. తూర్పు గోదావరి జిల్లా కోన గ్రామంలో ప్రజా-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ వాణిజ్య పోర్టు 20 జూలై 2026 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ల్యాండ్ లార్డ్ విధానంలో నిర్మిస్తున్న రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టులకు రైలు మరియు రోడ్డు అనుసంధానానికి అవసరమైన భూమి, నిర్మాణ వ్యయాలను ఆంధ్రప్రదేశ్ మారిటైమ్ బోర్డు భరిస్తోందని మంత్రి వివరించారు. ప్రజా-ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో నిర్మిస్తున్న కాకినాడ ఎస్ఈజెడ్ పోర్టుకు జాతీయ రహదారి-16తో రోడ్డు అనుసంధానాన్ని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ ( ఎన్హెచ్ఏఐ)కల్పిస్తోందని తెలిపారు. రైల్వే అనుసంధానానికి అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు, సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. పోర్టుల అభివృద్ధి ద్వారా రాష్ట్రంలో పరిశ్రమల ప్రోత్సాహం, ఎగుమతులు,దిగుమతుల పెరుగుదల, ఉపాధి అవకాశాల విస్తరణ సాధ్యమవుతుందని మంత్రి స్పష్టం చేశారు.

# వైసీపీకి ప్రతిపక్ష హోదా ఇవ్వడం సాధ్యం కాదు

● వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరు కాకపోవడంపై స్పీకర్ అసహనం ● గవర్నర్ ప్రసంగం రోజున సభలో కాసేపు ఉన్నంత మాత్రాన అది పూర్తి హాజరు కాదు ● జగన్ జీతం తీసుకోవడం లేదు స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టీకరణ



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటం పై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు. సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు. కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు.







వెలిగొండకు ప్రాజెక్టు శంకుస్థాపన

## చేసింది నేనే.. పూర్తి చేసేది నేనే


- వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి 30 ఏళ్లు పూర్తి
- నాడు ప్రకాశం ప్రజల కష్టాలు చూడలేకే ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాను
- ఈ ఏడాది జులై నాటికి తొలి దశ పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు అందిస్తాం
- 2027-28 నాటికి వెలిగొండ ఫేజ్-2 పనులు కూడా పూర్తి చేస్తాం
- గత ప్రభుత్వం ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసిందని విమర్శ
- ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు




ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : వెలిగొండ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన జరిగి 30 ఏళ్లు పూర్తైన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. వెలిగొండకు శంకుస్థాపన చేసింది తానే అని.. పూర్తి చేసేది కూడా తానే అని సీఎం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతాంగం చిరకాల వాంఛ అయిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతిని, భవిష్యత్ కార్యాచరణను ఆయన ప్రజలతో పంచుకున్నారు.
1996 మార్చి 5వ తేదీ తనకు ఇంకా స్పష్టంగా గుర్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఆనాడు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతం తీవ్ర కరవు కాటకాలతో, కనీసం తాగడానికి నీళ్లు లేక అల్లాడుతున్న పరిస్థితి ఉందన్నారు. ఆ ప్రజల కష్టాలు తీర్చేందుకు 30 ఏళ్ల క్రితం ముఖ్యమంత్రిగా తానే ఈ ప్రాజెక్టుకు తొలి అడుగు వేశానని గుర్తుచేసుకున్నారు. శ్రీశైలం జలాశయం ఫోర్‌షోర్ నుంచి 43.50 టీఎంసీల నీటిని మళ్లించి... ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించాలనే బృహత్తర లక్ష్యంతో నాడు వెలిగొండకు భూమిపూజ చేశామని తెలిపారు.అయితే, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగాయని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తిరిగి 2014-19 మధ్య తమ ప్రభుత్వ హయాంలో రూ.1,414 కోట్లు ఖర్చు చేసి పనులను వేగవంతం చేశామన్నారు. కానీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం అరకొర పనులతో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని, ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలంటూ ప్రజలను మోసం చేసి నవ్వులపాలైందని విమర్శించారు.2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెలిగొండ ప్రాజెక్టుకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చామని చంద్రబాబు తెలిపారు. గతంలో పెండింగ్ ఉన్న రూ.140 కోట్ల బిల్లులను వెంటనే క్లియర్ చేశామని, ప్రాజెక్టు నిర్మాణంపై ఇప్పటివరకు రూ.585 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రస్తుతం పనులు శరవేగంగా జరుగుతున్నాయని, హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించి 2,200 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. అలాగే రూ.456 కోట్లతో ఫీడర్ కెనాల్ లైనింగ్, రిటైనింగ్ వాల్ పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు.రైతుల కలను సాకారం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని, ఈ ఏడాది (2026) జులై నాటికి వెలిగొండ తొలి దశ (ఫేజ్-1) పనులు పూర్తి చేసి కృష్ణా జలాలను తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. అలాగే 2027-28 నాటికి ఫేజ్-2 నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు. కరవు ప్రాంతంలో ప్రతి ఎకరానికి నీళ్లిచ్చి, హార్టికల్చర్ సాగును ప్రోత్సహించి రైతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతామని చంద్రబాబు స్పష్టం చేశారు. దశాబ్దాల కలను నిజం చేసి, కరువు ప్రాంతంలో ప్రతీ ఎకరానికి నీళ్లిచ్చి రైతన్న జీవితాలు మారుస్తామని.. హార్టికల్చర్ సాగుతో జీవన ప్రమాణాలు పెంచుతామని చెప్పారు. 'వెలిగొండకు శంకుస్థాపన చేసింది నేనే... పూర్తి చేసి నీళ్లు ఇచ్చేది నేనే' అని సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

## అర్జున్ టెండూల్కర్ వివాహానికి లోకేశ్ హాజరు

- ముంబైలో అర్జున్ టెండూల్కర్ వివాహ రిసెప్షన్
- భార్య బ్రహ్మణితో కలిసి హాజరైన మంత్రి నారా లోకేశ్
- నూతన వధూవరులు అర్జున్, సానియాలను ఆశీర్వదించిన లోకేశ్
- ముఖేశ్ అంబానీ, జై షాలను కలిసిన లోకేశ్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఏపీ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, తన సతీమణి నారా బ్రహ్మణితో కలిసి ముంబైలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్, సానియా చందోక్ వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వేడుకకు హాజరవడం పై లోకేశ్ సోషల్ మీడియా వేదికగా తన ఆనందాన్ని పంచుకున్నారు. "లెజెండరీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ వివాహ రిసెప్షన్ కోసం ముంబైలో ఉండటం చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుకల్లో బ్రహ్మణితో కలిసి పాల్గొని, ముఖేశ్ అంబానీ, ఐసీసీ ఛైర్మన్ జై షా, ఇతర మిత్రులను కలవడం సంతోషాన్నిచ్చింది" అని లోకేశ్ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అర్జున్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. "అర్జున్‌కు జీవితాంతం సంతోషం, విజయం చేకూరాలని, క్రికెట్‌లో మరెన్నో చిరస్మరణీయ విజయాలు సాధించాలని కోరుకుంటున్నాను," అంటూ ఆయన ఆకాంక్షించారు.



## నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజేంటేటివ్‌గా కోమటి జయరాం

- బాధ్యతలు స్వీకరించిన జయరాం
- హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎన్నారైలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కోమటి జయరాం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజేంటేటివ్ గా.. బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తాడేపల్లి ఏపీఎన్నార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నేడు వివిధ దేశాలకు చెందిన ఎన్నారైల సమక్షంలో, వేద ఆశీర్వచనాల నడుమ నేడు ప్రమాణ స్వీకార కార్యక్రమం పూర్తి అయింది. ఈ కార్యక్రమలో ఎన్నారై శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఏపీ ఎన్నార్టీ అధ్యక్షులు వేమూరి రవి, సైన్స్ అండ్ టెక్నాలజీ ఛైర్మన్ రవి మండలపు, ప్రముఖ ఎన్నారై డాక్టర్ రాజా పిల్లి సహా తదితర ఎన్నారైలు పెద్ద ఎత్తున హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఆయన సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని, ఇదే సమయంలో అమెరికాలో చదువుకుంటున్న విద్యార్థులు, అక్కడ పని చేస్తున్న ఉద్యోగులకు ఏవైనా సమస్యలు వారి పరిష్కారాలకు కృషి చేయడమే కాకుండా, రాష్ట్రానికి పెట్టుబడులు ఆహ్వానించే విషయంలో, తన వంతు కృషి చేయడంలో సమర్థవంతంగా పని చేస్తారని ఆశాభావం వ్యక్తం చేసారు.

# కొత్త జిల్లాల ఆధారంగా జెడ్పీ ఎన్నికలు

- స్థానిక సంస్థల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం
- విభజించిన జిల్లాల ప్రాతిపదికన జెడ్పీ ఎన్నికలకు సన్నాహాలు
- అభివృద్ధి పనుల్లో చెట్ల తొలగింపుకు ప్రత్యామ్నాయాలపై ఆలోచన
- నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ వ్యవస్థ అమలు దిశగా చర్యలు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖలకు రూ. 27,415 కోట్ల బడ్జెట్ ప్రతిపాదనలు
- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్



ఏపీ స్టేట్ బ్యూరో,అమరావతి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా విభజించిన కొత్త జిల్లాల ప్రాతిపదికన జెడ్పీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారు. ఈ మేరకు ప్రక్రియ కొనసాగుతోందని, పంచాయతీల పునర్విభజనకు కూడా ఎలాంటి చట్టపరమైన అడ్డంకులు లేవని తెలిపారు. గురువారం శాసనసభలో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి, "కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఆత్మనిర్భరతకు కట్టుబడి ఉంది. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి బలోపేతానికి చర్యలు ప్రారంభించాం" అని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాల సమయంలో చెట్ల తొలగింపుకు బదులుగా అనుకూల ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నామని చెప్పారు. పర్యావరణ ప్రేమికుడిగా అన్ని కోణాల్లో ఆలోచించి పచ్చదనాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో చెట్ల సంరక్షణకు కఠినమైన చట్టాలను తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నామని వెల్లడించారు.రాష్ట్రంలో 3 వేల గ్రామాల్లో తాగునీటి సమస్య ఉన్నట్లు గుర్తించడంతో పాటు దాని పరిష్కారానికి చర్యలు చేపట్టామని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీరాజ్ శాఖకు రూ.15,485 కోట్లు, గ్రామీణాభివృద్ధిశాఖ రూ.11,217 కోట్లు, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలకు రూ.713 కోట్లు బడ్జెట్ గ్రాంట్ల కోసం అసెంబ్లీలో పవన్ కల్యాణ్ ప్రతిపాదించారు. స్థానిక సంస్థలను మరింత బలోపేతం చేస్తూ, పచ్చదన పరిరక్షణతో అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేశ్ మాట్లాడారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, అటవీశాఖల్లో పవన్ కళ్యాణ్ తీసుకొచ్చిన మార్పులు, జరుగుతున్న అభివృద్ధి గురించి వారి వివరించారు. కొన్ని సూచనలు చేశారు.

**రీ లొకేషన్ కోసం ప్రత్యేక పాలసీ**

ఆ తర్వాత రోడ్ల విస్తరణ సమయంలో అడ్డంగా ఉన్నాయంటూ వందేళ్లకు పైబడిన చెట్లను కొట్టేయడం ఆవేదన కలిగిస్తోందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసెంబ్లీలో చర్చ సందర్భంగా ప్రస్తావించారు. వృక్షాలను కొట్టేయకుండా వేరే దగ్గర వాటిని మళ్లీ నాటితే చిగురిస్తాయని ఈ విధంగా తన నియోజకవర్గంలో చేశామని తన అనుభవాన్ని పంచుకున్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ రహదారుల విస్తరణ కోసం వందేళ్లకు పైగా వయసున్న వృక్షాలు తొలగించాల్సి రావటం తనను బాధిస్తుందన్నారు. అందుకే వాటిని సురక్షితంగా వేరే ప్రాంతానికి తరలించేందుకు ప్రత్యేక పాలసీ తీసుకు రానున్నట్లు వెల్లడించారు.

**ప్రతి మొక్కకు జియో ట్యాగ్**

అటవీ శాఖ ఆధ్వర్యంలో నాటుతున్న మొక్కల సంరక్షణపై సభ్యులు సూచించిన విషయాలను స్వాగతిస్తున్నామని చెప్పారు. నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగ్ ఏర్పాటు చేసే విధానాన్ని అమలు చేయాలని యోచిస్తున్నామని తెలిపారు. నర్సరీల దశ నుంచే ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని భావిస్తున్నామని, బెంగళూరు నర్సరీల్లో అమలవుతున్న ఆధునిక పద్ధతులను పరిశీలిస్తున్నామని చెప్పారు.ఎర్రచందనం విక్రయాల్లో మెరుగైన ధరలు సాధించేందుకు ప్రత్యేక బృందాన్ని నియమించామని, అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా వేలం ప్రక్రియ నిర్వహించి ప్రభుత్వ ఖజానాకు ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా ప్రజలకు అందుతున్న సౌకర్యాలు, అటవీ శాఖ చేపడుతున్న కార్యక్రమాలపై అవగాహన కల్పించిన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్ బాబు, బండారు సత్యనారాయణమూర్తికి ధన్యవాదాలు తెలిపారు.



# రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- ప్రకృతి విపత్తుల్లో రైతులకు అండగా కూటమి ప్రభుత్వం
- ప్రకృతి వైపరీత్యాల అనంతరం వారం రోజుల్లోనే పంట నష్టం అంచనా
- హెక్టారుకు రూ.25 వేల ఇన్‌పుట్ సబ్సిడీ
- బుడమేరు వరదల్లో రూ.370 కోట్ల చెల్లింపు
- నష్టపోయిన ప్రతి రైతుకు తక్షణ సాయం
- పంటల భీమా పథకం పునరుద్ధరణ...
- కేంద్రంతో కలిసి అమలు చేస్తున్న ప్రభుత్వం
- అరకు కాఫీ తోటల్లో వ్యాధి నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- 81 మంది రైతులకు సబ్సిడీ
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇటీవల సంభవించిన ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించడం,అరకులో కాఫీ తోటల నష్టంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను మంత్రి శాసన మండలిలో వివరించారు. నష్టపోయిన ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ఫీల్డ్ స్థాయిలో పంట నష్టాన్ని వారం రోజుల్లో అంచనా వేసి నివేదికలు సిద్ధం చేశారని, ఆ నివేదికల ఆధారంగా అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందచేశామని మంత్రి పేర్కొన్నారు. రైతులకు అవసరమైన సహాయాన్ని త్వరితగతిన అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

**ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రభుత్వం చర్యలు**

రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో సహాయం అందిస్తున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గతంలో 2014 వరకు పత్తి, వేరుశెనగ, వరి, చెరుకు పంటలకు హెక్టారుకు రూ.12,000 ఇన్‌పుట్ సబ్సిడీని అందించేసేవారని, 2014 లో తెదేపా ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎం చంద్రబాబు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ మొత్తాన్ని హెక్టారుకు రూ.17,000కు పెంచినట్లు వివరించారు. అయితే గత వైసీపీ పాలనలో ఆ మొత్తాన్ని తిరిగి రూ.12,000కు తగ్గించారని మంత్రి పేర్కొన్నారు. 2024 లో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక బుడమేరు వరదల సమయంలో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఆలోచించి హెక్టారుకు రూ.25,000 వరకు నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. బుడమేరు వరదల అనంతరం కేవలం వారం రోజుల్లోనే సర్వే పూర్తి చేసి సుమారు రూ.370 కోట్ల నష్టపరిహారాన్ని రైతులకు అందించామని చెప్పారు. రాష్ట్ర చరిత్రలో రైతులతో పాటు కౌలు రైతులకు కూడా నష్టపరిహారం అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల సంభవించిన తుఫాన్లకు సంబంధించి కూడా ప్రభుత్వం వెంటనే స్పందించి ఇప్పటికే రూ.25 కోట్లు, రూ.34 కోట్లు, రూ.310 కోట్ల వరకు రైతులకు నష్టపరిహారం చెల్లించిందని తెలిపారు. ఇటీవల వచ్చిన మొందా తుఫాన్‌కు సంబంధించిన నష్టాల సర్వే పూర్తయిందని, కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కూడా నష్టపరిహారం అందజేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

**పంటల భీమా వ్యవస్థపై వివరణ**

పంటల భీమా విషయంలో గత ప్రభుత్వ విధానం వల్ల రైతులకు ఇబ్బందులు తలెత్తాయని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి పసల్ భీమా యోజనలో దేశంలోని అనేక రాష్ట్రాలు భాగస్వామ్యం అయినప్పటికీ, గత ప్రభుత్వం ఉచిత భీమా పేరుతో వేరే విధానాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం స్వయంగా ఇన్సూరెన్స్ కంపెనీ ఏర్పాటు చేయాలని ప్రయత్నించిందని, కేంద్ర ప్రభుత్వం ఆ విధానం సాధ్యం కాదని సూచించిందని చెప్పారు. ఐదేళ్ల కాలంలో ఒక ఏడాది మాత్రమే రైతులకు భీమా అందించబడిందని, అనంతరం కేంద్రంతో కలిసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం తన వాటాగా చెల్లించాల్సిన సుమారు రూ.2000 కోట్లను మూడు సంవత్సరాల పాటు చెల్లించకపోవడంతో పోర్టల్ కూడా తెరవలేకపోయిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పౌరసరఫరాలు, వ్యవసాయ, ఆర్థిక శాఖల మంత్రులతో సబ్ కమిటీ ఏర్పాటు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించామని చెప్పారు. ప్రస్తుతం కేంద్రం,రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి మళ్లీ పంటల భీమా పథకాన్ని అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వివరించారు.

**అరకు కాఫీ తోటలపై వ్యాధి నియంత్రణ చర్యలు**

అరకు కాఫీ దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేశారని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. అరకు ప్రాంతంలోని కాఫీ తోటల్లో కాఫీ బెర్రీ బోరర్ వ్యాధి పరిమిత స్థాయిలో మాత్రమే గుర్తించబడిందని చెప్పారు. ఏజెన్సీ ప్రాంతంలో మొత్తం సుమారు 1.03 లక్షల హెక్టార్లలో కాఫీ సాగు జరుగుతుండగా, కేవలం 60.8 హెక్టార్లలో మాత్రమే ఈ వ్యాధి ప్రభావం కనిపించిందని తెలిపారు. సమస్య గుర్తించిన వెంటనే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి శాస్త్రవేత్తలు, అధికారులు, కాఫీ బోర్డు ప్రతినిధులతో కలిసి పర్యవేక్షణ ప్రారంభించిందని చెప్పారు. వ్యాధికి గురైన 152 ఎకరాల్లోని 20,617 కిలోల కాఫీ కాయలను గుంతలు తవ్వి పాతిపెట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సుమారు 530 మంది కూలీలు, ఉద్యాన, వ్యవసాయ శాఖ విద్యార్థులు మరియు ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. నష్టపోయిన 81 మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.7,23,825 ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. అరకు కాఫీ బ్రాండ్‌కు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం అప్రమత్తంగా చర్యలు తీసుకుంటుందని, ఎక్కడైనా వ్యాధి కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సభ్యులకు విజ్ఞప్తి చేశారు.

# అంగన్వాడీ డిమాండ్లలో 9 పరిష్కారం

- 10 డిమాండ్లల్లో 9 పరిష్కారం
- మృతి చెందిన సిబ్బందికి రూ.15 వేల సహాయం
- అసంపూర్తి భవనాల పూర్తి కోసం రూ.193.92 కోట్లు ప్రతిపాదన
- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : అంగన్వాడీలు ప్రతిపాదించిన పది డిమాండ్లలో 9 ఇప్పటికే పరిష్కరించామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మరణించిన సిబ్బందికి మట్టి ఖర్చులకోసం రూ. 15 వేల రూపాయలు సహాయం అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. బడ్జెట్‌లో ఏళ్ళ తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి రూ.20కోట్లు కేటాయించామని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 257 ఐసిడిఎస్ ప్రాజెక్టులు పరిధిలో 55746 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని వీటిలో 21,756 అంగన్వాడి కేంద్రాలు సొంత భవనాల్లో పదివేల566 కేంద్రాలు ఇతర ప్రభుత్వ భవనాల్లో మరియు 23,424 అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వెల్లడించారు. అసెంబ్లీలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేశ్ బాబు, మహమ్మద్ నజీర్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. వీటిలో 292 అంగన్వాడీ భవనాలు అసంపూర్తి దశలో ఉన్నాయని వీటిలో 948 అంగన్వాడి భవనాలు ముగింపు దశలో ఉండగా 873 స్లాబ్ స్థాయిలో 351 పైకప్పు స్థాయిలో 269 లింటెల్ స్థాయిలో 429 బేస్మెంట్ స్థాయిలో మరియు 52 పునాది దశలో ఉన్నాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 2,922 భవనాలను పూర్తి చేసేందుకు 193.92 కోట్ల రూపాయలు మంజూరుకు ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని వీటిలో ముగింపు దశలో ఉన్న 948 భవనాల కోసం 48.52 కోట్లు ఉన్నాయని మంత్రి తెలిపారు. ముగింపు దశలో ఉన్న భవనాలను పూర్తి చేయడం కోసం ప్రభుత్వం 2025-26 సంవత్సరానికి గాను నాలుగు కోట్ల రూపాయలు విడుదల చేయడం జరిగింది అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.

**అంగన్వాడీలకు 5 జీ స్మార్ట్ ఫోన్లు ఇచ్చాం**

2025 సంవత్సరంలో ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ ( పీఎం-జన్మన్) పథకం కింద 78 అంగన్వాడీ భవనాలు నిర్మాణం కోసం మూడు జిల్లాలో అంటే శ్రీకాకుళం, పార్వతీపురం మరియు అల్లూరి సీతారామరాజు జిల్లాలకు రూ.9.36 కోట్లు విడుదల చేయబడిందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అదనపుగా ఉన్న అంగన్వాడీ భవనాలను పూర్తి చేసేందుకు రూ. 4 కోట్లు విడుదల చేయబడిందని మంత్రి పేర్కొన్నారు. పూర్తయిన అంగన్వాడి భవనాల కోసం 1 కోటి 94 లక్షల రూపాయలు విడుదల చేయడం జరిగిందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. ఆరేళ్ల లోపు పిల్లలు, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం ప్రీ-స్కూల్ విద్యా మరియు ఆరోగ్య తనిఖీలను అందించడం జరుగుతుందని మంత్రి తెలిపారు. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు సూపర్వైజర్లు బ్లాక్ కోఆర్డినేటర్లకు 75 కోట్లతో 5జీ స్మార్ట్ ఫోన్‌లు అందించామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

**అంగన్వాడీ కేంద్రాల హాజరు 96శాతం**

అంగన్వాడి కేంద్రాల హాజరు 70 శాతం నుండి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు ప్రత్యక్ష ఫలితం అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 5000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తిస్థాయి అంగన్వాడి కేంద్రాలుగా మార్చామని మంత్రి సంధ్యారాణి తెలిపారు. నాడు నేడు పేరుతో వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పిన జగన్ అంగన్వాడీ కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడంలో ఘోరంగా విఫలమయ్యాడు. 17,984 కొత్త అంగన్వాడీ కేంద్రాలు నిర్మిస్తానన్న జగన్ ప్రకటనలు కాగితాలికే పరిమితం అయ్యాయని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు.
15 రకాల ప్రత్యేక పౌష్టికఆహార పదార్థాలు అందజేత వైసీపీ ఇచ్చిన 4జీ ఫోన్లు పాతబడి పని చేయకపోవడంతో 2025 ఆగస్టులో అంగన్వాడీలు వాటిని ప్రభుత్వానికే సరెండర్ చేశారని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. లక్షల కోట్లు ఖర్చు చేసినప్పుడు వృధా అనలేదు ప్రభుత్వం అవసరానికి రూ. 75 కోట్లు ఖర్చు చేస్తే మాత్రం విమర్శించడం వైసీపీ డబల్ స్టాండర్డ్ అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెల సుమారు 30 లక్షల చిన్నారులపై గ్రోత్ మానిటరింగ్ నిర్వహిస్తూ మొబైల్ యాప్ ఆధారిత 100 శాతం డేటా ఎంట్రీ వ్యవస్థ ద్వారా సరఫరా వినియోగంపై రియల్ టైం పర్యవేక్షణ చేస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. బాలామృతం గుడ్లు, పాలు పౌష్టిక మిశ్రమాలు తదితరంగా మొత్తం 15 రకాల ప్రత్యేక పౌష్టికఆహార పదార్థాలను క్రమబద్ధంగా పంపిణీ చేస్తున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.
కూటమి పాలనలో అంగన్వాడీలు బలపడుతున్నారు 'ప్రతి ఇంట్లో 15 నుండి 20 అవసరమైన శిశు సంరక్షణ వస్తువులు ఉండటం వల్ల నవజాత శిశువుల ఆరోగ్య రక్షణ మెరుగుపడుతుంది అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. 2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం నెలకు 4,200గా ఉన్న అంగన్వాడీ జీతాలను ముందుగా 7000కు అనంతరం 2018 లో 10,500 పెంచింది. 5 ఏళ్లలో రెండు సార్లు వేతనాల పెంపు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనని మంత్రి తెలిపారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన పది డిమాండ్లలో 9 ఇప్పటికే పరిష్కరించబడ్డాయి మరణించిన సిబ్బందికి మట్టి ఖర్చులకోసం 15 వేల రూపాయలు సహాయం అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. 2025 బడ్జెట్‌లో ఏళ్ళ తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యల పరిష్కారానికి రూ.20కోట్లు కేటాయించామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో హక్కులు కోసం సమ్మె చేసిన అంగన్వాడీలపై ఎస్మాప్రయోగించి, పోలీసు చర్యలు చేపట్టడం జరిగింది కొన్ని చోట్ల అరెస్టులు కేసులు నమోదు చేయడం జరిగింది. గత వైసీపీ పాలనలో అంగన్వాడీలు అవమానాలు, నిర్లక్ష్యం, మోసాలకు గురయ్యారు. వైసీపీకి పేరు ముఖ్యం కూటమి ప్రభుత్వానికి పని ముఖ్యం.వైసీపీ పాలనలో అంగన్వాడీలు బాధపడ్డారు. కూటమి పాలనలో అంగన్వాడీలు బలపడుతున్నారు అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చెప్పుకొచ్చారు.

## 8న ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

- మంత్రులు సవిత, సంధ్యారాణి
- హాజరుకానున్న సీఎం చంద్రబాబు
- మహిళల ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 ఎంవోయూలు
- నాలుగు ఎన్ఆర్ఎల్ఎం క్లస్టర్ల ప్రారంభం
- డ్వాక్రా సంఘాలకు చెక్‌ల పంపిణీ
- మహిళా లబ్ధిదారులకు వాహనాలు అందజేత : మంత్ర సవిత



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఈ నెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రులు ఎస్.సవిత, గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని పేరెడ్స్ గ్రౌండ్ లో జరగనున్న ఈ వేడుకల సందర్భంగా మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 36 ఎంవోయూలు చేసుకోనున్నట్లు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సెర్ప్, చేనేత, జౌళి శాఖ, సీఆర్డీయే, గుంటూరు జిల్లా అధికారులతో మంత్రులు సవిత, సంధ్యారాణి సమావేశం నిర్వహించారు. అమరావతిలోని పేరెడ్స్ గ్రౌండ్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ వేడుకలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబునాయుడు హాజరు కానున్నారన్నారు. ఈ సందర్భంగా మహిళలకు మేలు కలిగేలా పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టనున్నారన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలు తీర్చిదిద్దే క్రమంలో పలు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు మంత్రి సవిత తెలిపారు. సీఎం సమక్షంలో 36 ఒప్పందాలు చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. డ్వాక్రా మహిళలతో ల్యాప్ టాప్ బ్యాగులు, క్యారీ బ్యాగులు, రెడీ మేడ్ దుస్తుల తయారీకి శిక్షణివ్వడదానికి సెర్ప్ తో ఆప్కో ఒప్పందం చేసుకోనున్నట్లు తెలిపారు. సీఎం చేతుల మీదుగా నాలుగు ఎన్ఆర్ఎల్ఎం క్లస్టర్లను ప్రారంభించనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. ఎమ్మిగనూరు(కర్నూలు), చీరాల(బాపట్ల), రాజాం(విజయనగరం), పొందూరు(శ్రీకాకుళం)లో ఈ క్లస్టర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు. మహిళా దినోత్స వేడుకల సందర్భంగా 23 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు చేతుల మీదుగా డ్వాకా మహిళా సంఘాలకు రుణాల అందజేయనున్నామన్నారు. మిల్లెట్ కార్ట్ లు 2, ఎగ్ కార్ట్ లు 5, రైతు బజారు వ్యాన్ 1, బొలెరో వాహనాలు రెండు, ఆటోలు 5, ట్రాక్టర్లు 5, ర్యాపిడో ద్విచక్ర వాహనాలు 5 మహిళ లబ్ధిదారులకు సీఎం చంద్రబాబునాయుడు అందజేయనున్నట్లు మంత్రి సవిత తెలిపారు. మహిళల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు, ఫ్రీ బస్, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు అమలు చేశామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రధాన ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా, కమిషనర్ రేఖా రాణి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సూర్య కుమారి, సీఆర్డీయే అడిషనల్ కమిషనర్ భార్గవ్ తేజ, గుంటూరు జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## మధ్యలో మసౌతున్న మిడిల్ ఈస్ట్

ఇరాన్, ఇజ్రాయెల్ దేశాల మధ్య చెలరేగిన తాజా యుద్ధం మధ్యప్రాచ్య ప్రాంతాన్ని నెత్తుటి సరస్సుగా మారుస్తోంది. ఈ రెండు బలమైన దేశాల మధ్య సాగుతున్న సుదీర్ఘ పోరాటం కేవలం ఆ రెండు దేశాలకే పరిమితం కాకుండా చుట్టుపక్కల ఉన్న అనేక చిన్న దేశాల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పుడు బహిరంగ దాడులుగా రూపాంతరం చెందడం వల్ల ఈ ప్రాంతంలోని సాధారణ ప్రజల జీవితాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ఆధునిక క్షిపణులు, డ్రోన్ దాడులతో ఆకాశం నిప్పుల కొలిమిలా మారుతుంటే, నేల మీద అమాయక ప్రజలు తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. రాజకీయ ఆధిపత్యం కోసం, మతపరమైన పట్టు కోసం సాగుతున్న ఈ పోరాటంలో అసలైన బాధితులు మాత్రం ఏ పాపం ఎరుగని సామాన్యులే కావడం అత్యంత విషాదకరం.ఈ యుద్ధ జ్వాలల వల్ల లెబనాన్, సిరియా, యెమెన్ వంటి దేశాలు బలిపశువులుగా మారుతున్నాయి. ఇరాన్ మద్దతు ఉన్న సాయుధ గ్రూపులు ఒకవైపు, వారిని అణచివేయాలనే నెపంతో ఇజ్రాయెల్ జరుపుతున్న భీకర దాడులు మరోవైపు ఈ దేశాలను శ్మశానాలుగా మారుస్తున్నాయి. లెబనాన్ వంటి దేశాలు ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతుండగా, ఈ యుద్ధం ఆ దేశ మౌలిక సదుపాయాలను పూర్తిగా ధ్వంసం చేస్తోంది. ఆసుపత్రులు, పాఠశాలలు, నివాస గృహాలు బాంబుల దాటికి నేలమట్టం అవుతుంటే, వేలాది మంది ప్రజలు శరణార్థులుగా మారుతున్నారు. ఈ దేశాల అంతర్గత రాజకీయాల్లో ఇరాన్, ఇజ్రాయెల్ జోక్యం చేసుకోవడం వల్ల అక్కడ శాంతి అనేది మృగ్యమైపోయింది. బలమైన దేశాల వ్యూహాలకు తలవంచి, తమ సొంత భూమిపైనే పరాయి దేశాల యుద్ధాలను చూడాల్సిన దుస్థితి ఈ చిన్న దేశాలకు పట్టింది. మధ్యప్రాచ్యంలోని ఈ అస్థిరత ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది. చమురు సరఫరాకు నిలయమైన ఈ ప్రాంతంలో యుద్ధం వల్ల ఇంధన ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి, ఇది ప్రపంచవ్యాప్తంగా సామాన్యుడి నడ్డి విరుస్తోంది. కానీ అన్నింటికంటే భయంకరమైన విషయం ఏమిటంటే, మానవతా సంక్షోభం రోజురోజుకూ ముదురుతోంది. చిన్నారులు తమ బాల్యాన్ని కోల్పోతున్నారు, తల్లులు తమ బిడ్డలను కాపాడుకోలేక విలపిస్తున్నారు. అగ్రరాజ్యాలు తమ ప్రయోజనాల కోసం ఆయుధాలను సరఫరా చేస్తూ మంటల్లో నెయ్యి పోస్తున్నాయే తప్ప, శాంతి స్థాపన దిశగా గట్టి ప్రయత్నాలు చేయడం లేదు. ఈ విధ్వంసం ఇలాగే కొనసాగితే మధ్యప్రాచ్యం కోలుకోలేని విధంగా దెబ్బతింటుంది, రాబోయే తరాలకు కేవలం శిథిలాలను మాత్రమే మిగిల్చే ప్రమాదం ఉంది. యుద్ధం ఏదైనా విజేతలుగా నిలిచేది కేవలం ఆయుధ వ్యాపారులే, పరాజితులుగా మిగిలేది మాత్రం మానవత్వం, సామాన్య ప్రజానీకమే.మధ్యప్రాచ్యంలోని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి అత్యంత సంపన్న దేశాలు ప్రస్తుతం ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధం వల్ల పెను ప్రమాదంలో పడ్డాయి. ఈ దేశాలు గత కొన్ని దశాబ్దాలుగా కేవలం చమురుపైనే ఆధారపడకుండా, తమ దేశాలను ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రాలుగా, వ్యాపార వేదికలుగా తీర్చిదిద్దుకున్నాయి. దుబాయ్, రియాద్ వంటి నగరాలు విలాసవంతమైన జీవనానికి, ఆకాశహర్మ్యాలకు, అంతర్జాతీయ పెట్టుబడులకు నిలయంగా మారాయి. అయితే ఈ దేశాలకు యుద్ధ రంగంలో సుదీర్ఘమైన అనుభవం లేదు, వీరి ప్రజలు దశాబ్దాలుగా ఎంతో సుఖవంతమైన, సంపన్నమైన జీవితాన్ని గడుపుతున్నారు. ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న దాడులు ఈ దేశాల భద్రతను సవాలు చేస్తున్నాయి, ఒకవైపు అమెరికాతో ఉన్న రక్షణ ఒప్పందాలు, మరోవైపు పక్కనే ఉన్న ఇరాన్ నుంచి ఎదురవుతున్న ముప్పును తట్టుకోవడం వీరికి కత్తిమీద సాములా మారింది.సౌదీ అరేబియా వంటి దేశాలు తమ విజన్ 2030 వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా ప్రపంచాన్ని ఆకర్షించాలని చూస్తున్నాయి, కానీ యుద్ధం సంభవిస్తే ఈ కలలన్నీ కల్లలయ్యే ప్రమాదం ఉంది. ఒక పర్యాటక దేశంగా లేదా వ్యాపార కేంద్రంగా నిలదొక్కుకోవాలంటే శాంతి అత్యంత అవసరం, కానీ క్షిపణులు తమ గగనతలంపై తిరుగుతుంటే విదేశీయులు రావడానికి భయపడతారు. యుద్ధ అనుభవం లేని ఈ సంపన్న దేశాలు కేవలం ఆధునిక ఆయుధాలను కొనుగోలు చేయగలవు తప్ప, క్షేత్రస్థాయిలో జరిగే సుదీర్ఘ విధ్వంసాన్ని తట్టుకునే శక్తి వారి ఆర్థిక వ్యవస్థలకు ఉండదు. పర్యాటక రంగం ద్వారా నిర్మించుకున్న బ్రాండింగ్ ఒక్కసారి దెబ్బతింటే, మళ్లీ ఆ నమ్మకాన్ని సంపాదించడానికి దశాబ్దాలు పడుతుంది. ఇరాన్ తన సైనిక బలంతో, అమెరికా తన వ్యూహాలతో ఈ ప్రాంతాన్ని వాడుకుంటుంటే, మధ్యలో ఉన్న ఈ ధనిక దేశాలు కేవలం బలిపశువులుగా మారుతున్నాయి.ఒకవైపు అమెరికా రక్షణ కవచంపై ఆధారపడుతూనే, మరోవైపు ఇరాన్ ఆగ్రహానికి గురికాకుండా ఉండటం ఈ దేశాలకు అసాధ్యంగా మారుతోంది. పర్యాటకం, విలాసవంతమైన జీవనం అనేవి శాంతి ఉన్నప్పుడే వర్ధిల్లుతాయి, యుద్ధం మొదలైతే ఇన్వెస్ట్మెంట్లు ఆగిపోతాయి, షేర్ మార్కెట్లు కుప్పకూలుతాయి. ఎంతో కష్టపడి నిర్మించుకున్న తమ దేశాల ప్రతిష్టను కాపాడుకోవడానికి ఈ దేశాలు ఇప్పుడు తలమునకలవుతున్నాయి. యుద్ధం అనేది కేవలం పేద దేశాలకే కాదు, ఇలాంటి అతి సంపన్న దేశాల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేస్తుంది. తమ వద్ద ఉన్న అపారమైన సంపద యుద్ధ జ్వాలల్లో కాలిపోకుండా చూసుకోవడం ఇప్పుడు వీరికి అతిపెద్ద సవాలుగా మారింది.సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి దేశాలు గత దశాబ్ద కాలంగా తమ చమురు నిల్వలపై ఆధారపడటం తగ్గించి, ప్రపంచ పర్యాటకానికి మకుటాయమానంగా నిలిచాయి. దుబాయ్ వంటి నగరాలు కేవలం ఎడారి ప్రాంతాలుగా కాకుండా, ఆధునిక ప్రపంచపు అద్భుతాలుగా రూపాంతరం చెందాయి. కానీ ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతలు ఈ దేశాల ఆర్థిక పునాదులను కదిలిస్తున్నాయి. ఒకవైపు అమెరికాతో రక్షణ ఒప్పందాలు ఉండి, ఆ దేశ ఆయుధ సంపత్తిపై ఆధారపడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో యుద్ధం సంభవిస్తే ఆ ఆధునిక ఆయుధాలు ఎంతవరకు రక్షణ ఇస్తాయనేది సందేహంగా మారింది. ఇరాన్ తన క్షిపణి శక్తితో ఈ సంపన్న నగరాల వైపు గురిపెడితే, సంవత్సరాల తరబడి నిర్మించుకున్న ఆకాశహర్మ్యాలు, విలాసవంతమైన రిసార్టులు క్షణాల్లో నేలమట్టమయ్యే ప్రమాదం ఉంది.ఈ దేశాల ప్రజలు దశాబ్దాలుగా అత్యంత సంపన్నమైన, సుఖవంతమైన జీవనానికి అలవాటు పడ్డారు. వారికి యుద్ధం అంటే కేవలం వార్తల్లో చూసే అంశం మాత్రమే తప్ప, కళ్లముందు జరిగే విధ్వంసం కాదు. క్షేత్రస్థాయిలో యుద్ధ అనుభవం లేని ఈ దేశాలు, ఒక్కసారిగా బాంబుల మోతను వింటే ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతాయి. పర్యాటక రంగమే ఊపిరిగా బతుకుతున్న ఈ ఆర్థిక వ్యవస్థల్లో, విదేశీయులు ప్రాణ భయంతో తమ పర్యటనలను రద్దు చేసుకుంటే ఆ నష్టం వేల కోట్ల డాలర్లలో ఉంటుంది. సేఫ్ అండ్ లగ్జరీ అనే బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసుకున్న ఈ దేశాలకు, ఇప్పుడు తమ ఆకాశంలో క్షిపణులు ఎగరడం అనేది ఒక తీరని అవమానం, ఆర్థిక దెబ్బ.

యుద్ధం అనేది కేవలం సైనిక బలంతో గెలిచేది కాదు, అది దేశంపై ఉన్న నమ్మకాన్ని కూడా దెబ్బతీస్తుంది. ఒకవైపు అమెరికా తన ప్రయోజనాల కోసం ఈ దేశాలను వాడుకుంటుంటే, మరోవైపు ఇరాన్ తన ప్రాంతీయ ఆధిపత్యం కోసం వీరిని భయపెడుతోంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మధ్యప్రాచ్య సంపన్న దేశాలు తమ ఉనికిని కాపాడుకోవడానికి పడుతున్న ఆరాటం అంతా ఇంతా కాదు. తాము ఎంతో శ్రమించి నిర్మించుకున్న పర్యాటక వైభవం, వ్యాపార సామ్రాజ్యాలు ఈ యుద్ధ జ్వాలల్లో కాలిపోతే, మళ్ళీ ఆ పూర్వ వైభవాన్ని సాధించడం సాధ్యం కాకపోవచ్చు. అందుకే ఈ దేశాలు నేడు ఆయుధాల కంటే శాంతి మంత్రాన్నే నమ్ముకుంటున్నాయి, కానీ బలమైన శక్తుల మధ్య ఇరుక్కుపో యి కేవలం నిస్సహాయ బాధితులుగా మిగిలిపోతున్నాయి.మధ్యప్రాచ్యంలోని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వంటి సంపన్న దేశాలు నేడు ఒక క్లిష్టమైన చౌరస్తాలో నిలబడ్డాయి. దశాబ్దాల కష్టం, అపారమైన పెట్టుబడులతో నిర్మించుకున్న పర్యాటక సామ్రాజ్యాలు, విలాసవంతమైన నగరాల ప్రతిష్ట ఇప్పుడు ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధ జ్వాలల మధ్య చిక్కుకుని ఉన్నాయి. యుద్ధ అనుభవం లేని ఈ దేశాల ప్రజలు సుఖవంతమైన జీవనానికి అలవాటు పడటం వల్ల, ఒక్కసారిగా తలెత్తే అస్థిరతను తట్టుకోవడం వారి ఆర్థిక వ్యవస్థలకు పెద్ద సవాలుగా మారుతుంది. అమెరికా వంటి అగ్రరాజ్యాల వ్యూహాలకు, ఇరాన్ వంటి ప్రాంతీయ శక్తుల పోరాటాలకు మధ్య ఈ దేశాలు కేవలం బలహీనమైన బలిపశువులుగా మారడం విచారకరం. ప్రపంచ పటంలో తమకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను సృష్టించుకున్న ఈ దేశాలు, ఆ వైభవాన్ని కాపాడుకోవాలంటే యుద్ధం కంటే శాంతి మార్గమే ఏకైక పరిష్కారమని గుర్తించాలి, లేదంటే ఆధునిక అద్భుతాలుగా వెలుగుతున్న ఈ నగరాలు కేవలం గతకాలపు స్మృతులుగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

# బిజెపి తారకమంత్రం!

- అత్యంత కీలకంగా మారుతున్న అధిష్ఠానం అనుసరిస్తున్న వ్యూహాలు
- కేంద్రంలోనే కాకుండా రాష్ట్రాల స్థాయిలోనూ పట్టు సాధించేందుకు ఎత్తుగడలు
- ఇప్పుడు బీహార్ రాష్ట్ర ముఖ్యమంత్రి పీఠం కోసం వినూత్న ప్రయోగాలు
- ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించినా పొత్తు ధర్మం కోసం నితీష్ కుమార్ కు పగ్గాలు
- తాజాగా సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిగా చేసుకునే దిశగా అడుగులు



తేజస్విని
హైదరాబాద్

భారతీయ రాజకీయ ముఖచిత్రంలో నిరంతరం మార్పులు చోటుచేసుకుంటూ ఉంటాయి. ఇందులో జాతీయ పార్టీగా భారతీయ జనతా పార్టీ అనుసరిస్తున్న వ్యూహాలు అత్యంత కీలకంగా మారాయి. కేవలం కేంద్రంలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోనూ తన పట్టును సాధించేందుకు ఆ పార్టీ రాజకీయ చదరంగంలో పావులను అత్యంత చాకచక్యంగా కదుపుతోంది. తొలుత ప్రాంతీయ పార్టీలతో పొత్తులు పెట్టుకుని క్రమంగా ఆయా రాష్ట్రాల్లో బలపడటం, సరైన సమయం చూసి తమ సొంత నాయకుడికి ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకోవడం అనేది ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలు చేసిన వ్యూహాలనే ఇప్పుడు బీహార్ రాష్ట్రంలోనూ ప్రయోగిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ రాజీనామా చేయబోతున్నారనే తాజా వార్తలు ఈ రాజకీయ ఎత్తుగడలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. అసలు ఒక రాష్ట్రంలో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి, తమ సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిగా చేయడానికి ఆ పార్టీ ఎలాంటి అడుగులు వేస్తోంది అనే విషయాన్ని ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తుంది.గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జరిగిన ఆసక్తికర రాజకీయ పరిణామాలను అన్వయించుకుని చూస్తే, బీహార్‌లో ప్రస్తుతం జరుగుతున్న సంఘటనల వెనుక ఉన్న అసలు వ్యూహం సులభంగా అర్థమవుతుంది.

**బీహార్ రాజకీయాల్లో బీజేపీ సొంత సీఎం వ్యూహం:**

బీహార్ లో సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన నితీష్ కుమార్ ఈ క్రమంవలోనే జేడీయూ అధ్యక్షుడు, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రాజ్యసభకు పంపాలని బిజెపి నిర్ణయించడం, ఆతని పేరు ఖరారు చేయటం .ఈ విషయాన్ని స్వయంగా తన ఎక్స్ పోస్టులో నితీష్ కుమార్ ధ్రువీకరించడం చకచకా జరిగి పోయాయి. దీంతో సీఎం పదవికి ఆయన రాజీనామా చేయనున్నారని స్పష్టమవుతోంది ఈ పరిణామాన్ని బీజేపీ తనకు అనుకూలంగా మలచుకుంటూ, బీహార్ లో తొలిసారిగా తమ పార్టీకి చెందిన నాయకుడిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని చూస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, అప్పట్లో పొత్తు ధర్మం కోసం నితీష్ కుమార్ కు పగ్గాలు అప్పగించింది. కానీ, ఇప్పుడు సక్సెషన్ ప్లాన్ లో భాగంగా ముఖ్యమంత్రి పదవిని బీజేపీ దక్కించుకోనుంది.

జేడీయూ నాయకత్వంలో చీలికలు రాకుండా నితీష్ కుమారుడు నిషాంత్ కుమార్ కు ఉపముఖ్యమంత్రి పదవిని ఇచ్చే ప్రతిపాదన కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని ద్వారా అటు జేడీయూ ని సంతృప్తి పరుస్తూనే, ఇటు బీహార్ పాలనను తమ చేతుల్లోకి తీసుకోవడం బీజేపీ లక్ష్యం. నితీష్ కుమార్ వెళ్ళిపోతే జేడీయూ బలహీనపడే అవకాశం ఉందని, ఆ ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవడానికి ఇదే సరైన సమయమని బీజేపీ అగ్రనాయకత్వం భావిస్తోంది. పార్టీ కేడర్‌లో కూడా తమ సొంత నాయకుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రంలో పూర్తి స్థాయిలో పట్టు సాధించగలమనే అభిప్రాయం బలం గా ఉంది. గత కొన్నేళ్లుగా నితీష్ కుమార్ అస్థిరమైన రాజకీయ నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రజల్లో ఆయన పట్ల కొంత అసంతృప్తి నెలకొందని బీజేపీ అంచనా వేస్తోంది. ఈ తరుణంలో ఒక బలమైన ఓబీసీ నాయకుడిని లేదా కొత్త ముఖాన్ని ముఖ్యమంత్రిగా తెరపైకి తీసుకురావడం ద్వారా 2029 సార్వత్రిక ఎన్నికల నాటికి బీహార్ లో తిరుగులేని శక్తిగా ఎదగాలని బీజేపీ యోచిస్తోంది. ఢిల్లీలోని పెద్దలు ఇప్పటికే ఈ మార్పు కోసం క్షేత్రస్థాయిలో నివేదికలను సిద్ధం చేసుకున్నారు, త్వరలోనే బీహార్ రాజ్‌భవన్ వేదికగా కీలక పరిణామాలు చోటుచేసుకోనున్నాయి.

**మధ్యప్రదేశ్: ఆపరేషన్ లోటస్**

సొంత అభ్యర్థిని ముఖ్యమంత్రిగా చేయడానికి బీజేపీ అమలు చేసే వ్యూహానికి మధ్యప్రదేశ్ ఒక అత్యుత్తమ ఉదాహరణ. 2018 ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ, ఆ పార్టీలోని అసంతృప్తిని బీజేపీ సమర్థవంతంగా వాడుకుంది. సీనియర్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాను తన వైపునకు తిప్పు కోవడమే కాకుండా, ఆయన వర్గానికి చెందిన 22 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించింది. దీనితో కమల్ నాథ్ ప్రభుత్వం మైనారిటీలో పడి కూలిపోయింది. వెనువెంటనే శివరాజ్ సింగ్ చౌహాన్ ను ముఖ్యమంత్రిగా నియమించి, బీజేపీ మళ్ళీ అధికారంలోకి వచ్చింది. ప్రత్యర్థి పార్టీలోని చీలికలను ఆసరాగా చేసుకుని అధికారాన్ని కైవసం చేసుకోవడంలో ఈ వ్యూహం కీలకంగా పనిచేసింది.

ఈ ఆపరేషన్ లోటస్ వెనుక బీజేపీ కేవలం ఒకరిద్దరు నాయకులపై ఆధార పడలేదు. కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలను నిరంతరం గమనిస్తూ, కీలక సమయంలో సింధియాకు కేంద్ర మంత్రి పదవి ఆఫర్ చేసి ఆ పార్టీని దెబ్బకొట్టింది. ఇది కేవలం అధికారం కోసం చేసిన ప్రయత్నం మాత్రమే కాదు, ఒక రాష్ట్రంలో ప్రతిపక్షాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే వ్యూహం. ఎమ్మెల్యేల రాజీనామాలు, ఆపై ఉపఎన్నికల నిర్వహణ వంటి అంశాలను బీజేపీ ఎంతో వ్యూహాత్మకంగా డీల్ చేసింది. దీనివల్ల మధ్యప్రదేశ్ లో బీజేపీ నాయకత్వం మరింత బలోపేతం అయింది. మధ్యప్రదేశ్ ఉదాహరణను చూస్తే బీజేపీ తన లక్ష్యం కోసం ఎంతటి సాహసోపేతమైన నిర్ణయాలైనా తీసుకుంటుందని అర్థమవుతుంది. పాత తరం నాయకుల కంటే కొత్త సమీకరణాలకు ప్రాధాన్యతనిస్తూ, పార్టీకి ఉపయోగపడే ఇతర పార్టీల నాయకులను కూడా చేర్చుకోవడానికి వెనుకాడదు. ఈ వ్యూహం వల్ల మధ్యప్రదేశ్ ఈ రోజు బీజేపీకి ఒక కంచు కోటలా మారింది. బీహార్‌లో కూడా ఇదే తరహాలో జేడీయూ ఎమ్మెల్యేలను తమ వైపు తిప్పుకోవడం లేదా ఆ పార్టీని బీజేపీలో విలీనం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నట్లు రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**మహారాష్ట్ర: మిత్రపక్షాల చీలికతో పీఠం కైవసం**

మహారాష్ట్రలో బీజేపీ వ్యూహం మరింత ఆసక్తికరంగా సాగింది. శివసేన, ఎన్సీపీ, కాంగ్రెస్ కలిసి మహా వికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, బీజేపీ వేచి చూసే ధోరణిని అవలంబించింది. శివసేనలోని ఏకనాథ్ షిండే వర్గాన్ని ప్రోత్సహించడం ద్వారా ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వాన్ని పడగొట్టింది. అయితే ఇక్కడ నేరుగా ముఖ్యమంత్రి పదవి తీసుకోకుండా, వ్యూహాత్మకంగా షిండేకు ఆ పదవిని ఇచ్చి, తాము ప్రభుత్వంలో కీలక భూమిక పోషించారు. ఆ తర్వాత అజిత్ పవార్ వర్గాన్ని కూడా కలుపుకుని ప్రభుత్వాన్ని మరింత పటిష్టం చేశారు. క్రమంగా పార్టీని బలోపేతం చేసుకుని, తదుపరి ఎన్నికల నాటికి తమ సొంత ముఖ్యమంత్రిని తెచ్చుకునేందుకు పునాదులు వేసుకున్నారు.

మహారాష్ట్రలో రాజకీయ శత్రువులను దెబ్బకొట్టడానికి బీజేపీ చీలిక వ్యూహాన్ని అద్భుతంగా అమలు చేసింది. శివసేనను రెండుగా చీల్చడం ద్వారా ఆ పార్టీకి ఉన్న ప్రాంతీయ సెంటిమెంట్‌ను బలహీనపరిచింది. అదే సమయంలో ఎన్సీపీ నుంచి అజిత్ పవార్‌ను తీసుకురావడం ద్వారా మరాఠా ఓటు బ్యాంకులో కూడా తన వాటాను పెంచుకుంది. ఈ పరిణామాలన్నీ దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలో తెరవెనుక నడిచినా, అంతిమంగా అధికారం మాత్రం బీజేపీ ఆధిపత్యంలోనే ఉండేలా జాగ్రత్త పడింది. ఇది ఒక రకమైన అద్దె ముఖ్యమంత్రి వ్యూహం అని చెప్పవచ్చు, అంటే బయట పార్టీ నాయకుడు ముఖ్యమంత్రిగా ఉన్నా రిమోట్ కంట్రోల్ మాత్రం బీజేపీ చేతిలోనే ఉంటుంది.

ఇప్పుడు మహారాష్ట్రలో బీజేపీ తన సొంత సీఎం అభ్యర్థిని ఖరారు చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఏకనాథ్ షిండే వర్గాన్ని మిత్రపక్షంగా కొనసాగిస్తూనే, ఆ పార్టీ గుర్తును, ఉనికిని బీజేపీకి అనుబంధంగా మార్చడంలో కృతకృత్యు రాలైంది. భవిష్యత్తులో మహారాష్ట్రలో మళ్లీ బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఈ ఎత్తుగడలు సాగాయి. ఇదే తరహాలో బీహార్ లో కూడా జేడీయూని పూర్తిగా బీజేపీలో విలీనం చేయడం లేదా ఆ పార్టీని కేవలం నామమాత్రపు మిత్రపక్షంగా మార్చి, అధికారాన్ని తమ అభ్యర్థికి కట్టబెట్టడం బీజేపీ అసలు ప్లాన్.

బీహార్ లో ప్రస్తుతం జరుగుతున్న నాయకత్వ మార్పు వెనుక సామాజిక సమీకరణాలు కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. బీహార్ లోని వెనుకబడిన తరగతుల ఓటు బ్యాంకును ఆకట్టుకోవడానికి, ఆ వర్గాల నుంచే కొత్త ముఖ్యమంత్రిని ఎంపిక చేసే అవకాశం ఉందని అమిత్ షా పర్యటనలు, చర్చలు సూచిస్తున్నాయి. ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడం లేదా వాటిని తమలో విలీనం చేసుకునేలా ఒత్తిడి తీసుకురావడం ద్వారా దేశవ్యాప్తంగా తమ ముద్రను వేయాలని బీజేపీ భావిస్తోంది. కేవలం అధికారం కోసమే కాకుండా, రాష్ట్రాల్లో తమ సిద్ధాంతాలను అమలు చేయడానికి వీలుగా సొంత నాయకత్వాన్ని సిద్ధం చేసుకుంటోంది.బీజేపీ వేస్తున్న ప్రతి అడుగు వెనుక దీర్ఘకాలిక లక్ష్యాలు ఉంటాయి. బీహార్ వంటి రాష్ట్రంలో లవ్-కుశ్ (కుర్మీ-కోయిరి) ఓటు బ్యాంకు ఎంతో కీలకం. నితీష్ కుమార్ రాజీనామా తర్వాత ఈ వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి ఒక బలమైన ఓబీసీ నాయకుడిని లేదా ఒక దళిత నాయకుడిని సీఎం పీఠంపై కూర్చోబెట్టడం ద్వారా ఆర్జేడీ బలమైన యాదవ ఓటు బ్యాంకును ఎదుర్కో వాలని బీజేపీ చూస్తోంది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ మరియు అతి వెనుకబడిన వర్గాల మద్దతు ఉంటే తప్ప ఒంటరిగా అధికారం సాధ్యం కాదని ఆ పార్టీకి తెలుసు. అందుకే సామాజిక న్యాయం పేరుతో కొత్త నాయకత్వాన్ని తీసుకు రావడానికి రంగం సిద్ధమైంది.

బీజేపీ తన కాంగ్రెస్ ముక్త్ భారత్ లక్ష్యం నుంచి ఇప్పుడు ప్రాంతీయ పార్టీల ముక్త్ భారత్ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. బలమైన ప్రాంతీయ నాయకులు ఉన్న రాష్ట్రాల్లో వారిని బలహీనపరిచి, తమ పార్టీ జెండాను ఎగురవేయడమే అమిత్ షా, మోదీ ద్వయం వ్యూహం. బీహార్ పరిణామాలు గనుక సక్సెస్ అయితే, దక్షిణాది రాష్ట్రాలపై కూడా బీజేపీ ఇదే తరహాలో దృష్టి సారించే అవకాశం ఉంది. జాతీయ స్థాయిలో ఒకే పార్టీ ఆధిపత్యం ఉండేలా చూడటం ద్వారా రాజకీయ స్థిరత్వాన్ని సాధించాలని ఆ పార్టీ నమ్ముతోంది.

బీహార్ రాజకీయాలను సమూలంగా మార్చే దిశగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తున్నారు. నితీష్ కుమార్ రాజ్యసభకు వెళ్లడం అనేది కేవలం ఒక వ్యక్తిగత నిర్ణయం కాదు, అది బీజేపీ రాష్ట్రంలో తన ఆధిపత్యాన్ని చాటుకోవడానికి సిద్ధం చేసిన ఒక గౌరవప్రదమైన నిష్క్రమణ మార్గం. నితీష్ కుమార్ వంటి సీనియర్ నాయకుడిని ఒప్పించి, పదవి నుంచి తప్పుకునేలా చేయడం వెనుక బీజేపీ జాతీయ నాయకత్వం ఎంతో కసరత్తు చేసింది. ముఖ్యంగా జేడీయూ ఎమ్మెల్యేలు చెల్లాచెదురు కాకుండా, వారు బీజేపీతో కలిసి నడిచేలా క్షేత్రస్థాయిలో చర్చలు జరిపారు.

ఈ క్రమంలోనే నితీష్ కుమార్ కుమారుడు నిషాంత్ కుమార్‌ను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకురావడం ద్వారా ఒక వారసత్వ ఒప్పందాన్ని కూడా బీజేపీ ముందుకు తెచ్చింది. నిషాంత్‌ను ఉపముఖ్యమంత్రిగా లేదా కేంద్రంలో కీలక పదవిలో నియమించడం ద్వారా నితీష్ కుమార్‌కు రాజకీయ భద్రత కల్పించడం ఈ వ్యూహంలో భాగం. దీనివల్ల జేడీయూలోని నితీష్ అనుకూల వర్గం బీజేపీకి వ్యతిరేకం కాకుండా చూసుకోవచ్చు. ఒక రకంగా చెప్పాలంటే, ప్రాంతీయ పార్టీ నాయకత్వాన్ని పరోక్షంగా తమ నియంత్రణలోకి తెచ్చుకుని, ముఖ్యమంత్రి పీఠాన్ని తమ పార్టీకి చెందిన నాయకుడికి అప్పగించడం అమిత్ షా మార్కు రాజకీయం.

రాష్ట్రంలో బీజేపీ బలమైన క్యాడర్‌ను కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటివరకు ఒక సొంత ముఖ్యమంత్రి లేకపోవడం ఆ పార్టీకి ఒక లోటుగా ఉండేది. ఇప్పుడు ఆ లోటును భర్తీ చేస్తూ, 2026 నాటికి బీహార్‌ను బీజేపీ కోటగా మార్చాలని అగ్రనాయకత్వం భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే నితిన్ నబిన్ వంటి యువ నాయకులను ప్రోత్సహిస్తూ, సామాజిక సమీకరణాలను తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. అమిత్ షా పాట్నా పర్యటన ఈ మార్పును అధికారికం చేయడమే కాకుండా, విపక్షాలకు ఒక బలమైన హెచ్చరికను పంపనుంది.

బీహార్ రాజకీయాలు ఎప్పుడూ కుల సమీకరణాల చుట్టూనే తిరుగుతాయి. ఈ విషయాన్ని బాగా తెలిసిన బీజేపీ, ఈసారి ముఖ్యమంత్రి ఎంపికలో సరికొత్త ప్రయోగానికి సిద్ధమైంది. ప్రస్తుతం ఉపముఖ్యమంత్రులుగా ఉన్న సామ్రాట్ చౌదరి (కోయిరి వర్గం) మరియు విజయ్ కుమార్ సిన్హా (భూమిహార్ వర్గం) పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ అధిష్ఠానం ఒక బీసీ (వెనుకబడిన తరగతి) లేదా ఈబీసీ (అతి వెనుకబడిన తరగతి) నాయకుడిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేయాలని యోచిస్తోంది. దీనివల్ల ఆర్జేడీకి ఉన్న యాదవ ఓటు బ్యాంకును తట్టుకోవడమే కాకుండా, నితీష్ కుమార్ మద్దతుదారులుగా ఉన్న ఇతర వెనుకబడిన వర్గాలను శాశ్వతంగా బీజేపీ వైపు తిప్పుకోవచ్చు.

సామ్రాట్ చౌదరి ఇప్పటికే ఓబీసీ ముఖచిత్రంగా పార్టీలో గుర్తింపు పొందారు. ఆయనను ముఖ్యమంత్రిగా చేస్తే రాష్ట్రంలోని కుష్వాహ మరియు ఇతర ఓబీసీ వర్గాలు బీజేపీకి పూర్తి స్థాయిలో అండగా ఉంటాయని పార్టీ భావిస్తోంది. మరోవైపు, విజయ్ కుమార్ సిన్హా వంటి నాయకులు అగ్రవర్ణాల ఓట్లను సంఘటితం చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. ఈ ఇద్దరి మధ్య సమతుల్యత పాటిస్తూనే, అందరికీ ఆమోదయోగ్యమైన ఒక కొత్త నాయకత్వాన్ని తీసుకురావడం ద్వారా బీహార్‌లో మోదీ మ్యాజిక్ పనిచేస్తుందని బీజేపీ నమ్ముతోంది.కేవలం కులమే కాకుండా, అభివృద్ధి మరియు స్వచ్ఛమైన పాలన అనే నినాదాన్ని కూడా బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్తోంది. నితీష్ కుమార్ హయాంలో జరిగిన అభివృద్ధి కంటే, తమ సొంత ముఖ్యమంత్రి ఉంటే కేంద్ర నిధులతో బీహార్‌ను మరింత ముందుకు తీసుకెళ్లవచ్చని ప్రచారం చేస్తోంది. ఈ సామాజిక మరియు అభివృద్ధి ఎత్తుగడల వల్ల రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఎదురులేకుండా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యమంత్రి పీఠంపై బీజేపీ నాయకుడు కూర్చోవడం అనేది బీహార్ చరిత్రలో ఒక పెద్ద మలుపుగా మారబోతోంది.

# నిర్వహణ సిద్ధంతంగా మారిన నియంత్రణ నినాదం

పట్ట. హరిప్రసాద్
8790 84 3009

మోహన్ భగవత్... హిందూ మూలాలతో పరోక్షంగా దేశాన్ని నడిపిస్తున్న కీలక వ్యక్తి. ఆర్ఎస్ఎస్ చీఫ్ కూడా... ఆయన ఏ వ్యాఖ్యలు చేసినా వెనుక అంతర్యార్థాలు ఎన్నో కనబడతాయి..ఇటీవల శాతాబ్ధి వేడుకల్లో మోహన్ భగవత్ మరో కొత్త నినాదాన్ని అందించిండ్రు. అదే ప్రతొక్కరూ ముగ్గురు పిల్లలు కనాల్సిందేనని... దేశంలో కొన్ని నివేదికలు కూడా జనాభా విషయంలో ఇద్దరి కంటే ఎక్కువ మంది అవసరమని స్పష్టం చేశాయి. దీని ఆధారంగా దేశాన్ని దృష్టిలో ఉంచుకొని చెబుతున్నట్లు తెలిపిండ్రు.. ప్రస్తుతం దేశంలో సరిపడే జనాభా ఉండాలి, లేకుంటే దేశంలోని కాలానుగుణంగా సమస్యలను ఎదుర్కోలేం, అందుకే ప్రతొక్కరూ ముగ్గురు మాత్రమే.. ఎక్కువ ఉండకూడదనేది అందరూ అంగీకరించాల్సిందేనని తెలిపిండ్రు.. హిందూ సమాజాన్ని ఐక్యం చేసి సాధికారత కల్పించాలని పిలుపునిచ్చిండ్రు. హిందూ కుటుంబాలు ముగ్గురు పిల్లలను కనాలి.. అలాగే చొరబాటు దారులు, మతం మారినోళ్లను గుర్తించాలి, ఉద్యోగాల్లో ఉంటే వారిని బహిష్కరించాలి. ఇదే హిందూ సమాజానికి కీలక మందు. తగ్గుతున్న హిందూ జనాభాను చూస్తే ఆందోళనకరంగా ఉందని మోహన్ భగవత్ అన్నారు. ఇప్పటికే హిందూ కుటుంబాలు సగటు కంటే తక్కువగా సంతానోత్పత్తి ఉన్న సమాజాలు భవిష్యత్తులో నిర్వీర్యమవుతాయని చెప్పిండ్రు. ప్రస్తుతం ముందున్న పరిష్కారం కొత్త జనరేషన్ కు ముగ్గురు పిల్లల అవగాహన కల్పించాల్సిందే, సృష్టిని ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యం. పౌర సమాజమంతా ఒకే దేశం, ఒకే జన్మభూమిపై పట్టుబిగించాలి. కాలానుగుణంగా సనాతన ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని దేశానికి పిలుపునిచ్చారు... మన దేశ సాంప్రదాయం మహిళలకు గౌరవప్రదమైన స్థానం ఇస్తుంది, యావత్తు ప్రపంచంలోని సమస్యలకు పరిష్కార మార్గాలు మన దేశ నాగరికతలో ఉన్నాయి.. అందుకోసం బలహీన వర్గాలకు మద్దుతుగా నిలిచి సమాజిక సామరస్యాన్ని పెంపొందించాలని మోహన్ భగవత్ అన్నారు... పరోక్షంగా అమెరికా, చైనాలో కొన్ని శక్తులు దేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని విమర్శించారు. కెరీర్ అంటే కేవలం ఎక్కువ సంపాదించడం లేదా వినియోగించడం కాదు.. ఇతరులను పంచుకోవడం, సేవ చేయడమనేది పిల్లలకు నేర్పించాలి. ముఖ్యంగా దేశానికి అన్నిటికంటే ఉన్నత విలువలు ఉన్న కుటుంబాలను అందించాలి. సమాజానికి వ్యక్తి కాదు, కుటుంబమే ప్రాథమిక యూనిట్ అని, సామాజిక ప్రవర్తన దానిలోనే రూపుదిద్దుకుంటుందని భగవత్ అన్నారు.

**కాలంతో కరిగిపోయిన నినాదం:**

1990లో దేశ జనాభా విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో యావత్ దేశం ఆందోళనలో పడింది. అప్పట్లో జనాభా నియంత్రణ కోసం అందు బాటులో ఉన్న అవకాశాలన్నీ ఉపయోగించేశారు. “ముగ్గురు వద్దు...ఇద్దరు ముద్దు” అనే నినాదాన్ని ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఉద్యమంలా ప్రచారాలు చేశాయి. ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే పథకాలు రావని, అనర్హతగా పరిగణించి కట్టడి చర్యలు తీసుకున్నారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు కూడా ఇద్దరు పిల్లల నిబంధన గ్రామ, పట్టణ అమలు చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నిబంధనలతో చట్టాలు చేసి అమలు చేస్తున్నారు. జనాభా పెరగడం వల్ల వచ్చే అనర్థాలను కళ్లకు గట్టినట్లు చెప్తూ ప్రచారం చేసేవారు. అయితే కాలం మారే కొద్ది ఇద్దరు బిడ్డల నినాదం మరింత బలంగా మారి ఆర్థిక అవకాశాలకు తలొగ్గి ఒక్కరికే పరిమితమైన కుటుంబాలు పెరిగాయి. అధిక సంతానం వల్ల వారి పోషించడంలో భారం, చదువు వ్యయం భరించలేమన్న భయం బాగా ఫలించింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. సరికొత్త నినాదం అమల్లోకి వచ్చింది. పిల్లలను ఎక్కువ మందిని పిల్లలు ఉంటేనే జాతి నిర్వీర్యాన్ని అడ్డుకోగలమని ముందున్న లక్ష్యంగా మారింది. ఒకప్పుడు స్థానిక సంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లోనూ ముగ్గురు పిల్లలు ఉంటే పోటీకి అనర్హులుగా ప్రకటించారు. సమాజంలో ఇద్దరు పిల్లలు నినాదాన్ని బలేపేతం చేసేందుకే ఆ నిబంధనను అనుచరించిండ్రు.. తాజాగా మరిన పరిస్థితుల దృష్ట్యా నిబంధను కూడా ఎత్తివేసే పరిస్థితి వచ్చింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ నిబంధన ఎత్తివేయడం పై చర్చనీయంగా మారింది. మొన్నటి వరకు పాత నిబంధననే అమలులో ఉంచిండ్రు.. కొత్త చట్టాన్ని రూపొందించినప్పుడు ప్రభుత్వాలు మార్చుకోలేదు. పలు రాజకీయ పక్షాలతో పాటు ప్రముఖులు నిబంధన ఎత్తివేయాలని కోరడంతో ఇద్దరు పిల్లల నిబంధనకు చెక్ పడింది. తెలంగాణలో ఆమోదానికి రాలేదు కానీ ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం చంద్రబాబు పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించి ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉన్నా పోటీ చేసుకునేలా వెసులుబాటు కల్పించింది.

**ముగ్గురు పిల్లల వెనుక అంతర్భావం:**

మోహన్ భగవంత్ సంఘ్ సభలో ప్రకటించిన నినాదంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇది ఇప్పుడిప్పుడే చెబుతున్నది కాదు.. ఎంతో కాలం నుంచి జనాభా విషయంలో అప్రమత్తంగా ఉండాలని జనాభా పెరగాలని చెప్పుకుంటూ వస్తున్నారు అయితే అది ఒక వర్గానికి అనుసరించినదే. ఎన్నికల సమయంలో చంద్రబాబు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పిండ్రు. అయితే ఒక బ్రహ్మచారి.. కుటుంబ విలువలు, భావనల కోసం చెప్పడం హాస్యాస్పదంగా ఉందనేది పలువురి ప్రముఖుల మాట. అన్ని మతాలను విమర్శించకుండా పిల్లలను కనాలని చెప్పడం వెనుక స్వార్థపూరితమైన లక్ష్యం కనబడుతోంది. ఎక్కువ మంది పిల్లలతో జిందగీని సాగించేవాళ్లకు తెలుస్తుంది నొప్పేంటోనని, సనాతన ధర్మాన్ని అడ్డుపెట్టుకొని స్వార్థ భావనలు ప్రచారం చేసిన సన్నాసులకు, కుటుంబ బతులకులంటే తెలియని బ్రహ్మచారులు, సాధువులు, మునులకు ఎలా తెలుస్తుంది?. ముందుగా ముగ్గురు పిల్లలను వర్గంలో ఎంతమంది కంటున్నారు, వాళ్లకు బతుకు భరోసా ఎలా ఉందో, జనాభా పెరగాలన్నే లక్ష్యానికి ఎంతమంది కట్టుబడి ఉన్నారో అనేది ఆచరణలో చూపించాలి. జనాభా రేటు తగ్గడమనేది నిరంతరంగా



జరుగుతున్న ప్రక్రియనే... అయితే హిందూ సమాజం తగ్గుతోందనడం సరైనదికాదు.. ఓట్ల కోసమే బలం మాటున భావనను ప్రదర్శిస్తున్నారనేది కనబడుతోంది. దేశంలో ముస్లిం, ఇతర మతాలు రాకముందు ఉన్న మతమేంటి..? దానితో మనకు ఒరిగిందేమిటి ? జనాభా పేరుతో హిందువులు తగ్గుతున్నారనేదే ముఖ్యమైన అంశం. ప్రస్తుతం హిందువుల మనుగడ పుట్టే పిల్లలపై ఆధారపడి ఉందనేది తెలుస్తుంది.. మరో వర్గం ముస్లింలను అడ్డుకొనే శక్తి కోసమే పిల్లలు కనాలనేది కనబడుతోంది. హిందూ సమాజం నిర్వీర్యం అయితే ఏం జరుగుతుంది.. ఇతర దేశాల్లోనూ మన దేశ సంతతివాళ్లు ఉన్నారు.. మరి అక్కడ దేశ సంస్కృతులు పాటించకుండా ఉండలేరెమో కాదా...? మన దేశంలో హిందు మాటున ఉన్న హింసాత్మక వ్యక్తుల మనుగడ కోసం నినాదాలను తీసుకొస్తున్నారు.


**ఎవరిది తప్పు:**

దేశ ఆర్థిక బలం కోసం, మానవాభివృద్ధి పేరుతో సంతానోత్పత్తిని తగ్గించే చర్యలు కొనసాగుతున్నప్పుడూ జనాభాలో తగ్గుముఖం పడుతూనే వస్తోంది. అప్పటికి ఆర్థిక బలమే నిజమైన నినాదం... మూలాలు అంటూ హిందు సమాజానికి పిలుపునిచ్చి ముందుకు తీసుకెళ్లారు... మరో పక్క ముస్లిం వర్గంలో మాత్రం పిల్లలు భవిష్యత్తు దేవుళ్లగా పరిగణించి ముందుకెళ్తున్నా వాళ్లనూ జనాభా సమతూకంలో ఉండాలని కట్టడి చర్యలకు గురి చేశారు.. అయినా వాళ్లు పరోక్షంగా పిల్లల భవిష్యత్తేనే కొనసాగించారు. ఇప్పుడు జనాభా నియంత్రణ నుంచి జనాభా నినాదానికి మార్చుకుంటున్నారు. పిల్లలను కనాలి.. ఎంత మంది కనాలని చెప్తే అంతే కనాలి... ఇదే ఆర్ఎస్-ఎస్ కు ఉన్న స్వార్థపూరితమైన లక్ష్యం.. మతానికి బలం చేకూర్చేందుకు పిల్లలు అవసరమైతే కనాలనే చెబుతున్నారు.. మరి ఆర్థిక బలం సంగతేంటి..? జనాభా తగ్గితే అభివృద్ధికి మూలం అన్నారు.. ఇప్పుడేమో జనాభా పెరగాలంటున్నారు. ఇప్పటి వరకు ఆర్థిక బలమూ లేదు, అభివృద్ధి లేదు.. కేవలం మతోన్మాద బలమే సాధించినట్లా... ఇతర ముస్లిం, క్రైస్తవ దేశాల్లో సంతానోత్పత్తితో సమానంగా అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే చర్యలు పాటించినాయి..ఎంత పెద్ద కుటుంబమైనా, ఎంతమంది పిల్లలు ఉన్నా ఆర్థిక భరోసాను బాధ్యతగా తీసుకున్నాయే తప్ప ఎలాంటి కట్టడి చర్యలు తీసుకోలేదు..మరి మనదేశంలో జరుగుతున్నదేంటి..? పిల్లలను కనాలని చెబుతున్న ఆర్ఎస్ఎస్.. కేంద్ర ప్రభుత్వం ఆర్థిక బాగోగుల కోసం ఏం చేస్తుంది.. మద్దతు ప్రభుత్వాలకు ఏం భరోసా ఇస్తుందో స్పష్టం చేయాల్సిందే.

## డీఆర్డీఓ బీఎం-04 మిసైల్: భారత్ రక్షణలో కొత్త అధ్యాయం:

భారత్ కు ఇంతవరకు హైపర్ సానిక్ మిస్సైల్ లేదు. భారత్ హైపర్ సానిక్ మిసైల్స్ తయారుచేస్తోంది. దీనికి సంభదించి, ఈ సంవత్సరం చివరిలో తయారీ పూర్తి అయిన తరువాత మొదటి హైపర్ సానిక్ మిస్సైల్ పరీక్ష ఉండొచ్చు. భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) తాజాగా అభివృద్ధి చేస్తున్న బీఎం-04 షార్ట్ రేంజ్ బాలిస్టిక్ మిసైల్‌కు అనుమతి లభించింది. ఇది దేశ రక్షణ సామర్థ్యాన్ని మరింత పటిష్ఠం చేసే దిశగా ముందడుగు. గత ఏడాది మార్చిలో హైదరాబాద్‌లో జరిగిన విజ్ఞాన్ వైభవ్ 2025 ప్రదర్శనలో ఈ మిసైల్ ఫుల్ స్కేల్ మోడల్‌ను డీఆర్డీఓ ప్రదర్శించింది. ఇప్పుడు అభివృద్ధి ప్రక్రియ వేగవంతమైంది, త్వరలోనే పరీక్షలు ప్రారంభమవుతాయని అంచనా. ఈ మిసైల్ డిజైన్‌లో ప్రత్యేకతలు ఎన్నో. ఇది హైపర్‌సానిక్ సామర్థ్యం కలిగిన బూస్ట్-గ్లైడ్ వెహికల్‌గా రూపొందించబడింది. మాచ్ 5కు మించిన వేగంతో ప్రయాణించి, శత్రు రాడార్‌లు, యాంటీ-మిసైల్ సిస్టమ్‌లను దాటుకుని లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. రోడ్డు మొబైల్, క్యానిస్టర్ లాంచ్ సిస్టమ్‌తో రూపొందించబడిన ఈ మిసైల్, శత్రు ముందస్తు దాడుల నుంచి సురక్షితంగా ఉంటుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో తయారీ, అప్‌గ్రేడ్‌లు సాధ్యమవుతాయి. కొత్త వార్‌హెడ్‌లు, సెన్సర్‌లు, ప్రొపల్షన్ సిస్టమ్‌లను సులభంగా జతచేయవచ్చు. స్పెసిఫికేషన్‌ల విషయానికి వస్తే, బీఎం-04 మిసైల్ బరువు సుమారు 11,500 కిలోలు, పొడవు 10.2 మీటర్లు, వ్యాసం 1.2 మీటర్లు. ఇది టూ-స్టేజ్ సాలిడ్ ఫ్యూయల్ ప్రొపల్షన్ సిస్టమ్‌తో పనిచేస్తుంది. రేంజ్ 400 నుంచి 1,500 కిలోమీటర్ల వరకు, 500 కిలోల కన్వెన్షనల్ వార్‌హెడ్‌ను మోసుకెళ్తుంది. సర్క్యులర్ ఎర్రర్ ప్రాబబుల్ (సీఈపీ) 30 మీటర్ల కంటే తక్కువ, అంటే అత్యంత ఖచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదిస్తుంది. గైడెన్స్ సిస్టమ్‌లో ఇనర్షియల్ నావిగేషన్‌తో పాటు జీపీఎస్, భారత్ ఐఆర్ఎన్ఎస్ఎస్ సాటిలైట్ ఇన్‌పుట్‌లు ఉన్నాయి. సిక్స్-వీల్ ట్రాన్స్‌పోర్ట్ ఎరెక్టర్ లాంచర్ (టీఈఎల్)పై నిలువుగా లాంచ్ చేయబడుతుంది.ఈ మిసైల్ అగ్ని-పీ లాంటి న్యూక్లియర్ మిసైల్‌లకు సమానమైన డిజైన్ కలిగి ఉంది, కానీ కన్వెన్షనల్ స్ట్రైక్‌లకు అనువుగా మార్చబడింది. ప్రలయ్ మిసైల్ (500 కి.మీ. రేంజ్) కంటే ఎక్కువ దూరం చేరుకుని, శత్రు భూభాగంలో లోతైన లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. పాకిస్థాన్ లాంటి పొరుగు దేశాలతో సరిహద్దు వివాదాల్లో ఇది కీలక పాత్ర పోషిస్తుంది

ఈ. శ్రీనివాసరావు 9912121319




# బీహార్‌లో ముగిసిన నితీష్ శకం

● ఇక పెద్దల సభ వైపు అడుగులు ● సిఎం పదవిపై బిజేపీ నేత కు అవకాశం
● కొత్త ప్రభుత్వానికి ఫుల్ సపోర్ట్ చేస్తానని ప్రకటన ● జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని నిర్ణయం



పట్నా : బీహార్ రాజకీయాల్లో నితీష్ కుమార్ శకం ముగిసిందా? ఉన్నట్లుండి ఎందుకు ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారా? జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని భావిస్తున్నారా? రానున్న రోజుల్లో రాజకీయ ఎత్తుగడలు ముందే నితీష్ పసిగట్టారా? అందుకు ఇప్పటి నుంచి అడుగులు వేస్తున్నారా? ఈ క్రమంలో సీఎం పదవికి రాజీనామా చేసి రాజ్యసభలో అడుగుపెట్టనున్నారా? అవుననే అంటున్నారు రాజకీయ పరిశీలకులు.

**బీహార్‌లో ముగిసిన నితీష్ శకం.. సీఎంగా బీజేపీకి ఛాన్స్**

బీహార్ అంటే ఒకప్పుడు లాలూ ప్రసాద్ యాదవ్. ఇప్పుడు నితీష్‌కుమార్ పేరు ముందుగా గుర్తుకు వస్తుంది. దాదాపు రెండు దశాబ్దాలపాటు ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశారు. గతేడాది బీజేపీతో కలిసి అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగి విజయఢంకా మోగించారు. బీజేపీ-జేడీయూ మధ్య ఎలాంటి ఒప్పందం జరిగిందో తెలీదుగానీ రేపో మాపో ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. ఎక్స్ వేదికగా ప్రకటన చేశారు. ఇప్పుడు ఆయన రాజ్యసభకు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు దశాబ్దాలకు పైగా మీరు, మీ నమ్మకాన్ని, మద్దతును నిరంతరం నిలబెట్టుకున్నానని రాసుకొచ్చారు. మీరిచ్చిన బలం ద్వారానే మేము బీహార్‌కు సేవ చేస్తామన్నారు. మీ విశ్వాసం, మద్దతు కారణంగానే బీహార్ ఇవాళ అభివృద్ధి, గౌరవం అనే కొత్త కోణాన్ని స్వీకరిస్తోందన్నారు.

**ఇకపై పెద్దల సభకు, కొత్త ప్రభుత్వానికి ఫుల్ సపోర్ట్**

తాను గతంలో చాలాసార్లు మీకు నా కృతజ్ఞతలు తెలియజేశానని ప్రస్తావించారు. తన పార్లమెంటరీ జీవితం ప్రారంభం నుండి, బీహార్ శాసనసభ, పార్లమెంటు ఉభయ సభలలో సభ్యుడిని కావాలని కోరిక బలంగా కోరుకున్నట్లు ప్రస్తావించారు. రాజ్యసభ సభ్యుడిని కావాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. మీతో ఈ సంబంధం భవిష్యత్తులో కూడా కొనసాగుతుందన్నారు. బీహార్‌లో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వానికి తన పూర్తి మద్దతు, మార్గదర్శకత్వం ఉంటుందన్నారు. అభివృద్ధి చెందిన బీహార్‌ను నిర్మించడానికి కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉంటానని, ఈ విషయంలో నేను మీకు హృదయపూర్వకంగా హామీ ఇస్తున్నాను.

త్వరలో నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. నితీష్ తప్పుకోవడంతో బీహార్‌కు బీజేపీకి చెందిన వ్యక్తి కొత్త ముఖ్యమంత్రి రాబోతున్నారు. ముఖ్యమంత్రి రేసులో సామ్రాట్ చౌదరి, నిత్యానంద రాయ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరిలో ఎవరో ఒకరు బాధ్యతలు చేపట్టనున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. డిప్యూటీ సీఎంగా ఉన్న సామ్రాట్ చౌదరి, వివిధ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

మరో వెర్షన్‌కు వద్దాం.. రాజ్యసభకు వెళ్లిన తర్వాత కేంద్రమంత్రిగా నితీష్‌కుమార్ బాధ్యతలు చేపట్టే అవకాశముందని ప్రచారం లేకపోలేదు. ప్రస్తుతం నితీష్ కొడుకు నిషాంత్ కుమార్‌ను బీహార్ రాజకీయాల్లో యాక్టివ్ చేయాలని భావించి ఈ స్కెచ్ వేసినట్టు వెనుక చర్చ జరుగుతోంది. నిషాంత్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదని అంటున్నారు.

మొత్తానికి జాతీయ స్థాయిలో మునుపటి మాదిరిగా జేడీయూ చక్ర తిప్పాలన్నది నితీష్ ఆలోచనగా చెబుతున్నారు. దీనివెనుక పెద్ద స్కెచ్ ఉందని అంటున్నారు. గతంలో ఆర్జేడీ కలిసి కలిసి బీహార్ ఎన్నికల్లో నితీష్ పోటీ చేశారని, ఆ తర్వాత ఇండియా కూటమిలోకి వెళ్లారని అంటున్నారు. బీహార్ ఎన్నికలకు ముందు బీజేపీతో జత కట్టారని గుర్తు చేస్తున్నారు. నితీష్ రాజకీయాల వెనుక ఏదో జరుగుతోందన్న చర్చ బలంగా కొనసాగుతోంది.

# నితీష్ వారసుడెవరు?

● అధికార పీఠం దక్కించుకోనున్న కమలనాధుడి కోసం సర్వత్రా చర్చ ● ఇది బీహార్ రాజకీయాలలో నవ శకం
ఆరంభమైనట్టేనంటున్న విశ్లేషకులు ●బిజేపీ నుంచి సిఎం కుర్చీ కోసం రేసులో ముగ్గురు




పాట్నా: బీహార్ రాజకీయాల్లో కొత్త శకం మొదలైంది. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోనున్నట్లు .సుదీర్ఘ కాలం పాటు బీహార్ సీఎంగా తన సేవలందించిన నితీష్ కుమార్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ముఖ్యమంత్రి నితీష్ కుమార్ (75) గురువారం తన రాజీనామాను ప్రకటించారు. ఈసారి రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసి పార్లమెంటుకు వెళ్లాలనే తన చిరకాల కోరిక మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. "బీహార్ అభివృద్ధి కోసం నా సహకారం ఎప్పుడూ ఉంటుంది. కొత్తగా ఏర్పడే ప్రభుత్వానికి నా మార్గదర్శకత్వం అందిస్తాను" అని ఆయన పేర్కొన్నారు.

నితీష్ కుమార్ అసెంబ్లీ, శాసన మండలి, లోక్‌సభ సభ్యుడు, కానీ రాజ్యసభ సభ్యుడు కాదు. తాజాగా రాజ్యసభకు ఎన్నికానుండటంతో లాలూ ప్రసాద్ యాదవ్, సుశీల్ మోదీల అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకోనున్నారు. ఇదిలా ఉండగా, బిహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరు అనేది చర్చనీయాంశమవుతోంది. నితీష్ కుమార్ తనయుడు నిషాంత్ కుమార్ రాజకీయ అరంగేట్రం ఖాయమని, ఆయన డిప్యూటీ సీఎం పదవి ఇస్తారని తెలుస్తోంది.

ఈ నేపథ్యంలో తదుపరి బీహార్ ముఖ్యమంత్రి ఎవరు? అనే చర్చ మొదలైంది. అయితే, బీహార్‌లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉన్న కారణంగా బీజేపీ నుంచి ముఖ్యమంత్రి స్థానం దక్కించుకునే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు జాతీయ మీడియాలో ముగ్గురు పేర్లు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సారి సీఎం పదవి బీజేపీకి దక్కబోతుంది. డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధురి, కేంద్ర మంత్రి నిత్యానంద్ రాయ్, మంత్రి దిలీప్ కుమార్ జైస్వాల్ పేర్లు వినిపిస్తున్నాయి. బీహార్ కొత్త సీఎంగా సామ్రాట్ చౌదరి బాధ్యతలు చేపట్టవచ్చని తెలుస్తోంది. అలాగే, నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. కాగా, అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది.

**1. సామ్రాట్ చౌదరి :** ప్రస్తుతం బీహార్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి ముఖ్యమంత్రి రేసులో అందరికంటే ముందున్నారు. బీజేపీలో కీలక నేతగా ఎదిగిన ఆయనకు పాలనపై మంచి పట్టుంది. గతంలో పంచాయతీ రాజ్ మంత్రిగా, ప్రస్తుతం హోం శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఉండటంతో పాటు పార్టీ అధిష్ఠానం వద్ద కూడా ఆయనకు మంచి గుర్తింపు ఉంది.

**2. నిత్యానంద్‌రాయ్ :** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా ఉన్న నిత్యానంద్ రాయ్ పేరు కూడా బలంగా వినిపిస్తోంది. బీహార్ బీజేపీ అధ్యక్షుడిగా పనిచేసి పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసిన నేత కావడం గమనార్హం. హాజీపూర్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఉజియార్‌పూర్ నుంచి ఎంపీగా గెలిచిన రికార్డు ఆయనకుంది. జాతీయ స్థాయిలో అమిత్ షాకు సన్నిహితుడిగా పేరున్న నిత్యానంద్ రాయ్.. రాష్ట్ర రాజకీయాల్లోకి తిరిగి వస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

**3. నిశాంత్ కుమార్ :** అందరినీ ఆశ్చర్యపరుస్తూ నితీష్ కుమార్ కుమారుడు నిశాంత్ కుమార్ పేరు కూడా తెరపైకి వచ్చింది. నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని జేడీయూ శ్రేణులు, యువత నుంచి భారీగా ఒత్తిడి వస్తోంది. ఆయనకు ఃడిప్యూటీ సీఎంః పదవి ఇచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీనిపై ఒకటి రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రవణ్ కుమార్ సూచనప్రాయంగా తెలిపారు.

# భారత నౌకల రాక పోకలకు ఇరాన్ ఓకే

● హర్ముజ్ జలసంధి ద్వారా నౌకా రవాణాకు మార్గం సుగమం ● అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ వాటికి మద్దతు దేశాల నౌకలను అనుమతించం
● తాజాగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అధికారిక ప్రకటన



హర్ముజ్ : ఇరాన్ – ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం భారత్ పై తీవ్ర ఒత్తిడిని పెంచిన సంగతి తెలిసిందే. భారత్ కు చమురు సరఫరా చేసేందుకు కీలక మార్గంగా ఉన్న హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిందన్న వార్తలు.. తీవ్ర ఆందోళనకు దారి తీశాయి. అదే నిజమైతే భారత్ కు వచ్చే చమురు నిలిచిపోయి.. దేశంలోని ఇంధన నిల్వలు అడుగంటుతాయన్న భయాందోళనలు చెలరేగాయి. ఫలితంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరుగుతాయన్న అభిప్రాయాలను నిపుణులు వ్యక్తం చేశారు. అయితే ఈ భయాలను ఇరాన్ ఒక్క ప్రకటనతో పటాపంచలు చేసింది. యుద్ధ సమయంలో భారత్ కు తీపికబురు అందించింది.

ఇరాన్ కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ తాజాగా ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రకారం హర్మూజ్ జలసంధి గుండా రాకపోకలను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు తెలిపింది. అయితే యుద్ధానికి కారణమైన అమెరికా, ఇజ్రాయెల్ తో పాటు యూరప్ దేశాల ఓడలకు ఈ మార్గం గుండా రాకపోకలపై ఆంక్షలు విధిస్తున్నట్లు స్పష్టం చేసింది. ఈ మేరకు రివల్యూషనరీ గార్డ్స్ వెల్లడించినట్లుగా ఇరాన్ రాష్ట్ర ప్రసార సంస్థ పేర్కొంది. దీంతో భారత్ కు చమురును మోసుకొచ్చే ఓడలు.. ఎలాంటి అడ్డంకులు లేకుండానే హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించనున్నాయి.

**ఃమాకు ఆ హక్కు ఉందిః** మరోవైపు తాజా ప్రకటనలోనే హర్మూజ్ జలసంధిపై తమకున్న నియంత్రణ గురించి ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ చాటుకున్నాయి. ఆ జలసంధి గుండా ఏ ఏ దేశాల ఓడలు వెళ్లాలో నిర్ణయించే హక్కు తమకు ఉందని పేర్కొన్నాయి. ఈ విషయాన్ని తాము గతంలోనే నొక్కి చెప్పామని తెలిపాయి. అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ వాటికి మద్దతుదారులకు చెందిన ఏ నౌకలైన జలమార్గంలో కనిపిస్తే కచ్చితంగా అడ్డుకుంటామని ఐఆర్ జిసి చెప్పినట్లుగా ఐఆర్ ఐబి పేర్కొంది.

**చమురు ధరలపై ప్రభావం :** ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సైనిక చర్యలు మొదలు కాగా.. అప్పటి నుంచి హర్మూజ్ జలసంధిలో రాకపోకలు స్తంభించిపోయాయి. దీంతో అంతర్జాతీయ చమురు ధరలపై దీని ప్రభావం స్పష్టం కనిపించింది. అయితే చైనాకు చెందిన నౌకలను మాత్రమే హర్మూజ్ జలసంధి గుండా అనుమతి ఇస్తామని ఇరాన్ ప్రకటించింది. తాజాగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ మినహా అన్ని దేశాల ఓడలను అనుమతిస్తామని చెప్పడం భారత్ కు ఊరటను కలిగించింది.

# అవినీతి అంతం నా పంతం

● పేద విద్యార్థులకు ఉచిత ఉన్నత విద్య ● ఐదు ఎకరాలలోపు రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ
ప్రజాకర్షక హామీలతోనే విజయ్ పార్టీ టీవీకే ఎన్నికల మేనిఫెస్టో విడుదల

చెన్నై తమిళనాడులో మరి కొద్ది వారాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ తరుణంలో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు అన్ని పార్టీలూ చేస్తున్నాయి. తాజాగా, నటుడు విజయ్ పార్టీ టీవీకే కూడా వెళ్తోంది. ఈ మేరకు తంజావురులో జరిగిన బహిరంగ ర్యాలీలో ఆయన ఎన్నికల మేనిఫెస్టోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేలపై ఆయన విమర్శలు చేశారు. అలాగే, ఈ ఎన్నికల తనకు ఓ భావోద్వేగమని విజయ్ పేర్కొన్నారు. చెన్నై తమిళనాడు శాసనసభ ఎన్నికలకు మరో వారం పది రోజుల్లో షెడ్యూల్ వెలువడనుండగా.. డీఎంకే, అన్నాడీఎం, బీజేపీ సహా రాజకీయ పార్టీలుఇప్పటికే ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. తొలిసారి బరిలోకి దిగుతున్న ఇళయ దళపతి, టీవీకే అదినేత విజయ్ తన ఎన్నికల మేనిఫెస్టోలోని కీలక హామీలను వెల్లడిం చారు. తాము అధికారంలోకి వస్తే పేద కుటుంబాలు, చిన్న, సన్నకారు రైతుల పిల్లలకు ఉచితంగా ఉన్నత విద్య, ఐదు ఎక రాలలోపు రైతులకు వ్యవసాయ రుణాల మాఫీ, అవినీతి అం తానికి కఠిన చర్యలు తీసుకుంటానమి హామీ ఇచ్చారు. తం జావుర్‌లో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన తమిళ వెట్రి కళగం (టీవీకే) అధినేత.. రాబోయే ఎన్నికలు తనకు, తన మద్దతుదారులకు తీవ్ర భావోద్వేగంతో కూడుకున్నవని, ప్రభుత్వ ఏర్పాటుకు తమకు అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. రెండు ఎకరాలలోపు భూమి ఉండే రైతు కుటుంబా లకు చెందిన పిల్లల ఉన్నత విద్యకు అయ్యే ఖర్చును పూర్తిగా భరిస్తామని అన్నారు. పెరుగుతున్న విద్యా ఖర్చులతో ఇబ్బంది పడుతున్న ఆర్థికంగా బలహీనమైన గ్రామీణ కుటుంబాలకు మద్దతు ఇవ్వడం ఈ హామీ లక్ష్యం.

అవినీతికి పాల్పడిన వారి పై చర్యలు తీసుకుంటామనే విజయ్ హామీ తమిళ రాజకీయాల్లో తన పార్టీని స్వచ్ఛతకు ప్రత్యామ్నాయంగా చెప్పు కునే ప్రయత్నంగా భావించవచ్చు. రాబోయేది తమ ప్రభుత్వ మేనని, మత్స్యకారులకు రక్షణ కల్పిస్తానని విజయ్ హామీ ఇచ్చారు. ఐదు ఎకరాలలోపు భూమి ఉన్న రైతులకు సహకార పంట రుణాలను మాఫీ చేస్తామని విజయ్ హామీ ఇచ్చారు. రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు, భూమిలేని కార్మికుల పిల్లల విద్యా ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని హామీ ఇచ్చారు.

ఇదే సమయంలో అధికార డీఎంకేను దుష్ట శక్తితో పోల్చుతూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. డీఎంకే, అన్నాడీఎంకేలు తనను అధికారంలోకి రాకుండా అడ్డుకోడానికి కుట్రలు చేస్తున్నాయని విజయ్ ఆరోపించారు. ఆ రెండు పార్టీల మధ్య రహస్య ఒప్పందం ఉందని దుయ్యబట్టిన టీవీకే చీఫ్.. అధికారం తమ చేతుల్లోనే ఉండాలని ఐదేళ్లకు ఒకసారి పంచుకుంటారని తీవ్ర విమర్శలు చేశారు. విజయ్ తన ఎన్నికల మేనిఫెస్టో ప్రకటనకు తంజావూర్‌ను ఎంచుకోడానికి కారణం ఉన్నత విద్యా శాఖ మంత్రి గోవి చెంజియన్ ఈ జిల్లాకు చెందినవారే కావడం. ఈ జిల్లాలో మొత్తం 8 అసెంబ్లీ స్థానాలకు గానూ.. 2021లో డీఎంకే ఏడు చోట్ల విజయం



సాధించింది. అన్నాడీఎంకే ఒక్క సీటుకే పరిమితమైంది.

భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేసిన కొద్ది రోజుల్లోనే విజయ్ ఎన్నికల మెనిఫెస్టోను విడుదల చేయడం గమనార్హం. విజయ్, సంగీతలకు 1999లో వివాహం కాగా.. వీరికి ఇద్దరు పిల్లలు. తన భర్తకు వేరే నటితో వివాహేతర సంబంధం ఉందని, తనకు విడాకులు కావాలని కోరుతూ ఆమె కోర్టుకు వెళ్లారు. ఇక, ఇదే సమయంలో తన జననాయగన్ సినిమా విడుదల వివాదంపై కూడా విజయ్ మాట్లాడారు.

# యుద్ధాలు సమస్యల్ని పరిష్కరించవు

● సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారం ● ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు మోడీ ఫోన్
● మధ్యప్రాచ్యం సంక్షోభంపై సంభాషణ ● దౌత్యానికి రావాలని మోడీ పిలుపు



మధ్యప్రాచ్యం సంక్షోభం వేళ ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌కు ప్రధాని మోడీ ఫోన్ చేశారు. యుద్ధం విషయంలో దౌత్యానికి మోడీ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్‌లో మోడీ పేర్కొన్నారు.గత ఐదు రోజులుగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయు క్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ హత మయ్యాడు. అనంతరం ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్, అమెరికా మద్దతు గల గల్ఫ్ దేశాలపై విరుచుకుపడింది. గల్ఫ్ దేశాల్లో భారీగా ఆస్తులు ధ్వంసమయ్యాయి. దీంతో గల్ఫ్ దేశాధినేతలకు మోడీ ఫోన్ చేసి ఖండించారు.

తాజాగా ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్‌కు ఫోన్ చేసి యుద్ధం ముగింపునకు దౌత్యం నిర్వహించాలని కోరారు. "ఈ రోజు నా స్నేహితుడు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌తో మాట్లాడాను. పశ్చిమాసియా పరిస్థితి, చర్చలు, దౌత్యానికి సంబంధించి మా ఉమ్మడి ఆందోళనలను చర్చించాం. శాంతి, స్థిరత్వాన్ని త్వరగా పునరు ద్ధరించడానికి మేము దగ్గరగా పాల్గొనడం, ప్రయత్నాలను సమన్వయం చేయడం కొనసాగిస్తాం." అని రాసుకొచ్చారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ఈ సంభాషణ జరిగిందని.. ప్రపంచ నాయకులు సంయమనం, దౌత్యప రమైన చర్చలకు మోడీ పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యు ద్ధాలు, భద్రతా ఉద్రిక్తతల నేపథ్యంలో శాంతి, సంభాషణల ద్వారానే సమస్యలకు పరిష్కారం సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయని, సైనిక చర్యలకన్నా చర్చలు, రాజనీతే శాశ్వత పరిష్కారమని అన్నారు.

దిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో గురువారం ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. "ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి దశలో ఉంది. ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. చట్టపరమైన వ్యవస్థ, సంభాషణ, రాజనీతిపై భారత్, ఫిన్లాండ్ నమ్మకం ఉంచుతున్నాయి" అని తెలిపారు.

**పరస్పర గౌరవం ద్వారా సమస్యలను!**

ఏ సమస్యకూ సైనిక ఘర్షణలతో పరిష్కారం రాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.



ఉక్రెయిన్ యుద్ధమైనా, పశ్చిమాసియా సంక్షోభమైనా వీలైనంత త్వరగా ముగియాలని, శాంతి నెలకొల్పే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, పరస్పర గౌరవం, శాంతియుత జీవనం ఆధారంగా పరిష్కారాలు కనుగొనాలని సూచించారు ప్రధాని.

**సాంకేతిక, ఆర్థిక సహకారానికి కొత్త ఉత్సాహాన్ని!**

అదే సమయంలో భారత్- ఫిన్లాండ్ ద్వైపాక్షిక సంబంధాలను కొత్త దశకు తీసుకెళ్తున్నట్టు వెల్లడించారు మోదీ. డిజిటలైజేషన్, సస్టైనబిలిటీ రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని లబలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 6జీ టెలికాం, క్లీన్ ఎనర్జీ, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అత్యాధునిక రంగాల్లో కలిసి పనిచేయనున్నట్టు తెలిపారు. ఆ భాగస్వామ్యం రెండు దేశాల మధ్య సాంకేతిక, ఆర్థిక సహకారానికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందన్నారు.

**గ్రీన్ టెక్నాలజీ రంగంలో సహకారానికి నిదర్శనాలంటూ!**

వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక మార్పిడి పెరగడానికి తాజా ఒప్పందాలు దోహదపడతాయని ప్రధాని పేర్కొన్నారు. ఫిన్లాండ్ కంపెనీలు భారత అభివృద్ధిలో ఇప్పటికే కీలక పాత్ర పోషించాయని గుర్తుచేశారు. ముఖ్యంగా నోకియా మొబైల్ ఫోన్లు, టెలికాం నెట్‌వర్క్‌లు కోట్లాది భారతీయులను అనుసంధానించాయని చెప్పారు. అదేవిధంగా ఫిన్లాండ్ ఆర్కిటెక్ట్‌ల సహకారంతో చెనాబ్ నది పై ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెన నిర్మించామని వివరించారు. అసోంలోని నుమాలిగఢ్‌లో బాంబూ నుంచి బయోఎథనాల్ తయారు చేసే అతిపెద్ద రిఫైనరీని కూడా రెండు దేశాల భాగస్వామ్యంతో నిర్మించామని తెలిపారు. ఇవి గ్రీన్ టెక్నాలజీ రంగంలో సహకారానికి నిదర్శనాలని చెప్పారు.

**దేశాలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు**

పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఏడాది వరల్డ్ సర్క్యులర్ ఎకానమీ ఫోరమ్‌ను భారత్‌లో ఫిన్లాండ్‌తో కలిసి నిర్వహించనున్నట్టు ప్రకటించారు. దీని ద్వారా సస్టైనబిలిటీపై కొత్త ఆలోచనలు, పెట్టుబడులు ఆకర్షించవచ్చని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవాలంటే గ్లోబల్ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని కూడా ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లో నిర్మూలించేందుకు దేశాలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు.

**ఐరాసలో భారత్‌తు స్థానం అత్యంత అవసరం!**

ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ వ్యవస్థ మార్పు దశలో ఉందని, గ్లోబల్ సౌత్ దేశాలు భవిష్యత్ దిశను నిర్ణయిస్తాయని తెలిపారు. భారత్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలంటూ బహిరంగ మద్దతు ప్రకటించారు. ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో భారత్‌కు స్థానం అత్యంత అవసరమని అన్నారు.

**వాణిజ్యాన్ని రెట్టింపు చేయడం లక్ష్యంగా!**

ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం చాలా కాలంగా సాగుతోందని, శాశ్వత శాంతి ఐక్యరాజ్యసమితి సూత్రాలకు అనుగుణంగా ఉండాలని పేర్కొన్నారు. అలాగే భారత్ యూరోపియన్ యూనియన్ సంబంధాలు మరింత బలోపేతం కావాలని, వాణిజ్యాన్ని రెట్టింపు చేయడం లక్ష్యమని తెలిపారు. ఫిన్లాండ్‌లో భారతీయుల సంఖ్య పెరుగుతుండటం రెండు దేశాల మధ్య ప్రజల సంబంధాలను బలోపేతం చేస్తోందని స్టబ్ చెప్పారు. ముఖ్యంగా హెల్సింకి, ఎస్పో ప్రాంతాల్లో వేలాది భారతీయులు నివసిస్తున్నారని వెల్లడించారు. ఇక స్టబ్ ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్‌లో పాల్గొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ మోదీ సరదాగా స్పందించారు. "మీలా ఉత్సాహవంతుడైన నాయకుడితో కలిసి ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే ట్రయాథ్లాన్‌ను భారత్-ఫిన్లాండ్ సంబంధాల్లో సాధిస్తాం" అని అన్నారు. ఏదేమైనా ప్రపంచంలో పెరుగుతున్న యుద్ధ వాతావరణంలో శాంతి, సంభాషణ, రాజనీతిని ప్రాధాన్యం ఇస్తూ భారత్ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించింది.

# భారత అతిథి నౌకఃపై అమెరికా దాడి

## ఇరాన్ మంత్రి ప్రకటనపై స్పందించిన భారత్



న్యూఢిల్లీ భారత్ తూర్పు తీరంలో జరిగిన నౌక విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళుతున్న ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా ముంచివేసిన విషయం తెలిసిందే. విశాఖలో జరిగిన విన్యాసాల్లో పాల్గొన్న ఈ నౌక శ్రీలంక సమీపానికి చేరుకుంది. అప్పటికే అమెరికా, ఇజ్రాయెల్‌తో ఇరాన్ యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో... ఐరిస్ దేనా అనే ఈ యుద్ధ నౌకపై అమెరికా దాడి చేసింది. ఈ దాడిని భారత అతిథిపై జరిగిన దాడిగా ఇరాన్ మంత్రి అభివర్ణించగా, భారత ప్రభుత్వ వర్గాలు దీనిని కొట్టిపారేశాయి. ఐరిస్ దేనా మీద దాడిపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ స్పందిస్తూ, ఇరాన్ తీరానికి సుమారు రెండు వేల కిలోమీటర్ల దూరంలో సముద్రంలో అమెరికా దారుణానికి పాల్పడిందని అన్నారు. తమ దేశానికి చెందిన ఈ నౌకను అన్యాయంగా పేల్చివేశారని మండిపడ్డారు. 130 మంది సిబ్బందితో ఉన్న భారతీయ నౌకాదళ అతిథిని అంతర్జాతీయ జలాల్లో ఎలాంటి హెచ్చరికలు లేకుండా పేల్చివేశారని ఆరోపించారు. ఈ మేరకు ఆయన ఃఎక్స్ః వేదికగా ట్వీట్ చేశారు. ఇరాన్‌కు చెందిన ఈ నౌకను ఃభారత నావికాదళ అతిథిః అని ఇరాన్ మంత్రి పేర్కొనడం పట్ల భారత అధికార వర్గాలు స్పందించినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఇది దురదృష్టకర సంఘటన అయితే ఈ యుద్ధ నౌక ఆపద సమయంలో తమ సహాయం కోరలేదని వెల్లడించాయి. ఫిబ్రవరి 16 నుంచి 25 వరకు విశాఖలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా పాల్గొన్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత ఆ నౌక ఇక్కడి నుంచి బయలుదేరి వెళ్లిందని, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిందని గుర్తు చేశాయి. ఫిబ్రవరి 25న ఈ ఓడ తిరిగి బయలుదేరి భారత సముద్ర జలాలను దాటి అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించిందని అధికారిక వర్గాలు వెల్లడించినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వచ్చాయి. ఫిబ్రవరి 16 నుండి 25 వరకు మాత్రమే ఆ నౌక భారత అతిథి అని, అంతర్జాతీయ జలాల్లోకి ప్రవేశించిందని ఆ వర్గాలు తెలిపాయి. అదే సమయంలో ప్రమాదక సమయంలో ఆ నౌక ఎలాంటి సహాయాన్ని కోరలేదని వెల్లడించాయి.

# ఉగాది కానుకగా లక్ష టిడ్కో ఇళ్లు

## శాసనసభలో మంత్రి నారాయణ



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి టిడ్కో లబ్ధిదారులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. ఎప్పుడు ఇళ్లు అందజేస్తారా అని ఎదురుచూస్తున్న వారికి ఊరటనిచ్చేలా మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ కీలక ప్రకటన చేశారు. వచ్చే ఉగాది రోజున రాష్ట్రంలో లక్ష మంది లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అందజేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. జూన్ నాటికి టిడ్కో ఇళ్లను పూర్తి చేయడంతో పాటు 2028 కల్లా ప్రజలందరికీ సురక్షితమైన తాగునీరు అందించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని మంత్రి నారాయణ చెప్పుకొచ్చారు. ముఖ్యమంత్రి సలహాలు,సూచనలతో పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ ద్వారా ప్రజలకు విస్తృతంగా మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. శాసనసభలో సాధారణ బడ్జెట్ డిమాండ్స్‌పై చర్చ సందర్భంగా తన శాఖకు సంబంధించిన వివిధ అంశాలపై మంత్రి నారాయణ వివరణ ఇచ్చారు.


**పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభా :** పట్టణ ప్రాంతాల్లో జనాభా రోజురోజుకూ పెరుగుతుందని....2001 లో 24.2 శాతం జనాభా ఉంటే 2011 నాటికి ప్రస్తుతం 36 శాతం ఉన్నదని...2047 నాటికి ఇది 60 శాతానికి పెరిగే అవకాశం ఉందని పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. ఈ అంచనాలకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నామన్నారు. 2014-19 మధ్య కాలంలో మున్సిపాల్టీల నుంచి పన్నుల రూపంలో వచ్చే నిధులను గ్రీన్ ఛానల్ ద్వారా ఆయా మున్సిపాల్టీలకే ఖర్చు పెట్టామన్నారు. కానీ గత ప్రభుత్వం మున్సిపాల్టీల నిధులను కూడా సొంత అవసరాలక వినియోగించేసుకుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని తిరిగి సీఎఫ్ఎంఎస్ తో సంబంధం లేకుండా మున్సిపాల్టీల నిధులు అక్కడే ఖర్చు చేసుకునేలా మార్పులు చేసారని అన్నారు. సీఎం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రజల తరపున మంత్రి నారాయణకు ధన్యవాదాలు తెలిపారు.

**మున్సిపల్ శాఖకు రూ.14,538.68 కోట్లు :** ఈ బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు 14,538.68 కోట్లు కేటాయింపులు చేసారని..గత బడ్జెట్ కంటే ఇది 4.88 శాతం ఎక్కువ అని మంత్రి నారాయణ అన్నారు. ప్రజలు కోరుకునే తాగునీరు,ఘన,ద్రవ వ్యర్థాల నిర్వహణ,రోడ్లు,వీధి లైట్లతో పాటు ఇతర అవసరాలను ప్రాధాన్యతాక్రమంలో నారాయణ కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 54,98,000 కొళాయి కనెక్షన్లు ద్వారా 3083 ఎంఎల్డీ తాగునీరు అందించాల్సి ఉండగా.....ప్రస్తుతం 38.48 లక్షల కనెక్షన్ల ద్వారా 2100 ఎంఎల్టీ నీరు అందిస్తున్నామని అన్నారు. మరో 16.5 లక్షల కనెక్షన్ల ద్వారా 983 ఎంఎల్డీ తాగు నీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు...వీటిలో వివిధ పథకాల ద్వారా 941 ఎంఎల్డీల తాగు నీరు అందించేలా టెండర్లు పిలిచామని అన్నారు. అమృత్ పథకం ద్వారా 6,524 కోట్లతో ఏఐబీ ప్రాజెక్ట్ ద్వారా 2,461 కోట్లతో,యూఐడీఎఫ్ – 1 పథకం ద్వారా 1504 కోట్లతో పనులు ప్రారంభించేందుకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని మంత్రి నారాయణ చెప్పారు. మొత్తంగా 11,937 కోట్లతో ప్రాజెక్ట్ చేపట్టినట్లు మంత్రి నారాయణ చెప్పారు. గత ప్రభుత్వం వివిధ కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో తాగు నీటి ప్రాజెక్ట్ లు పూర్తి కాలేదని మంత్రి నారాయణ అన్నారు...ఏఐబీ ద్వారా 2019 లో 5350 కోట్ల నిధులు విడుదలయితే గత ప్రభుత్వం మ్యాచింగ్ ఫండ్స్ విడుదల చేయకపోవడంతో ఆ నిధులు విడుదల కాలేదన్నారు...అలాగే అమృత్ ద్వారా 8500 కోట్లకు రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయలేదన్నారు...తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్రంతో మాట్లాడి ఆయా పథకాల నిధులు విడుదల చేయించినట్లు మంత్రి నారాయణ చెప్పారు.

**చెత్త నుంచి విద్యుత్ :** గత ప్రభుత్వం చెత్త పన్ను వేసి చెత్తను మాత్రం తొలగించకుండా వెళ్లిపోయిందని మంత్రి నారాయణ ఆరోపించారు. భూమిపైన 85 లక్షల మెట్రిక్ టన్నులు,భూమి క్రింద 68 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త కలిపి మొత్తం 153 లక్షల టన్నుల చెత్త వదిలివెళ్లిపోయిందన్నారు. 2024 అక్టోబర్‌లో ముఖ్యమంత్రి నారాయణ ఆదేశాల ప్రకారం ఏడాదిలోగా 85 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను తొలగించామని వచ్చే జూన్ నాటికి మిగిలిన 68 ృలక్షల మెట్రిక్ టన్నుల చెత్తను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. 2014-19 మధ్యలో రాష్ట్రంలో 10 చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించగా...గత ప్రభుత్వం కేవలం విజయవాడ,విశాఖపట్నం మినహా మిగిలిన ప్రాజెక్ట్ లను పట్టించుకోలేదన్నారు...ప్రస్తుతం ఈ రెండు ప్లాంట్ల నుంచి 2800 టన్నుల చెత్తను విద్యుత్ గా మారుస్తున్నామని....కాకినాడ,నెల్లూరు,కడప,కర్నూలులో కొత్తగా ప్లాంట్ల నిర్మాణం జరుగుతుందన్నారు...వీటితో పాటు విజయవాడ,తిరుపతిలో ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్రంతో చర్చలు జరుపుతున్నామన్నారు...ఈ ప్రాజెక్ట్ లు పూర్తయితే రాష్ట్రంలో ప్రతిరోజూ ఉత్పత్తి అయ్యే 7000 టన్నుల ఘన వ్యర్థాలలో 6500 టన్నులు విద్యుత్ గా మారిపోతుందన్నారు. ఈ ప్లాంట్లు పూర్తయ్యే లోగా ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని మంత్రి నారాయణ చెప్పారు.

**46,900 కిలోమీటర్ల మేర డ్రెయిన్ల నిర్మాణం :** ఇక డ్రెయిన్ల విషయానికొస్తే రాష్ట్రం మొత్తం మీద 46,900 కిమీ మేర అవసరం ఉండగా....23,350 కిమీ మాత్రమే ఉన్నాయన్నారు..మరో 23,610 కి.మీ మేర డ్రెయిన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని మంత్రి నారాయణ అన్నారు...ఈ మొత్తంలో ప్రాధాన్యతా క్రమంలో ప్రస్తుతం 9000 కోట్ల మేర పనులు చేపటడుతున్నట్లు మంత్రి చెప్పారు..అండర్ గ్రౌండ్ డ్రైనేజి ప్రస్తుతం 3,245 కిమీ ఉందని,మరో 2,809 కిమీ మేర పనులు జరుగుతున్నాయన్నారు...మరో 17,556 కిమీ మేర అవసరం ఉన్నప్పటికీ ఆ పనులు చేపట్టడానికి 36 వేల కోట్లు అవసరం అవుతుందన్నారు...ద్రవ వ్యర్థాల నిర్వహణ కోసం సీవరేజ్ ట్రీట్ మెంట్ ప్లాంట్లు ఏర్పాటుచేస్తున్నట్లు మంత్రి నారాయణ చెప్పారు.: **విశాఖలో 99వేల వీధి ఎల్‌ఈడీలైట్లు**

రాష్ట్రంలోని మున్సిపాల్టీల్లో దేశంలోనే మొదటిసారిగా విశాఖపట్నంలో 99,000 వీధి లైట్ల ను ఎల్ ఈడీ లైట్లుగా మార్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. 2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు టిడ్కో ద్వారా 7 లక్షల ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకురాగా....3.8 లక్షల ఇళ్లు నిర్మాణం ప్రారంభమైంది...కానీ గత ప్రభుత్వం ఆ సంఖ్యను 2,61,000కు తగ్గించడమే కాకుండా వాటిని కూడా పూర్తి చేయకుండా మధ్యలో నిలిపివేసింది..ఇళ్లు నిర్మాణం ప్రారంభించిన కాంట్రాక్టర్లను ఇబ్బందిపెట్టింది..పాత కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని మంత్రి తెలిపారు..







# భగవద్గీత ప్రచారం పేరుతో అవినీతి

● టీటీడీ చరిత్రలోనే పెద్ద కుంభకోణం
● న్యాయ విచారణ చేయాలి ● జనసేన నేత రాయల్ కిరణ్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి :తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో భగవద్గీత ప్రచారం పేరుతో భారీ స్థాయిలో అవినీతి జరిగిందని జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ ఆరోపించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పై ఈ ఆరోపణలు చేస్తూ, ఇది టీటీడీ చరిత్రలోనే అతిపెద్ద అవినీతి ఘటనగా విమర్శించారు. టీటీడీ ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం కోసం చేపట్టిన పలు కార్యక్రమాలు, పుస్తకాల ముద్రణ, పంపిణీ, ప్రచార కార్యక్రమాల పేరిట కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసినట్లు రికార్డుల్లో చూపించారని ఆరోపించారు. అయితే ఆ ఖర్చులలో భారీగా అక్రమాలు జరిగాయని, అసలు కార్యక్రమాల కంటే ఎక్కువగా బిల్లులు చూపించి నిధులను దుర్వినియోగం చేశారని విమర్శించారు. భక్తుల నుంచి వచ్చే విరాళాలు, హుండీ ద్వారా వచ్చే ఆదాయం పవిత్రమైనదని, ఆ నిధులను పారదర్శకంగా వినియోగించాల్సిన బాధ్యత టీటీడీకి ఉందని జనసేన నేతలు అన్నారు. అయితే భగవద్గీత ప్రచారం పేరుతో పెద్ద మొత్తంలో నిధులు మళ్లించబడ్డాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి విచారణ జరిపితే భారీ అవినీతి బయటపడే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. జనసేన పార్టీ తరఫున మాట్లాడుతూ, భగవద్గీత వంటి పవిత్ర గ్రంథం పేరును ఉపయోగించి అవినీతి చేయడం అత్యంత బాధాకరమని విమర్శించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే న్యాయపరమైన దర్యాప్తు ఆదేశించాలని, టీటీడీ నిధుల వినియోగంపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ చైర్మన్ అయిన భూమన కరుణాకర్ రెడ్డి హయాంలో జరిగిన నిర్ణయాలు, టెండర్లు, ఖర్చుల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని కూడా జనసేన నేతలు కోరారు. భక్తుల విశ్వాసానికి భంగం కలిగించే విధంగా జరిగిన ఈ వ్యవహారంపై నిజాలు బయటకు రావాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. ఇక ఈ ఆరోపణలపై భూమన కరుణాకర్ రెడ్డి లేదా వైఎస్సార్‌సీపీ నేతల నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది. ఆరోపణలు రాజకీయ ప్రేరితమైనవని వారు చెప్పే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# డ్రైవర్ కమ్ గైడ్ !



● పర్యాటక రంగంలో దేశంలోనే తొలి ప్రయోగం ● ఏపీలో పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు 'డ్రైవర్ కమ్ గైడ్' విధానం
● రాష్ట్ర పర్యాటక శాఖ, ర్యాపిడో సంస్థల మధ్య కీలక ఒప్పందం ● మంచి రేటింగ్ ఉన్న ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ
● విజయవాడలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభం ● తర్వాత ఇతర నగరాలకు విస్తరణ
● ర్యాపిడో యాప్‌లోనే పర్యాటక ప్రాంతాల వివరాలు, గైడ్ సేవలు

ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఏపీలో పర్యాటక రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే తొలిసారిగా 'డ్రైవర్ కమ్ గైడ్' అనే సరికొత్త విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. ప్రముఖ రవాణా సేవల సంస్థ ర్యాపిడోతో కలిసి ఏపీ పర్యాటక శాఖ ఈ పథకాన్ని అమలు చేయనుంది. ఈ ఒప్పందం ప్రకారం ర్యాపిడోకు చెందిన ఆటో, క్యాబ్ డ్రైవర్లే పర్యాటకులకు గైడ్లుగా కూడా వ్యవహరిస్తారు.ఈ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా తొలుత విజయవాడలో ప్రారంభించనున్నారు. ఇందుకోసం ర్యాపిడో డ్రైవర్లలో అత్యుత్తమ ఫైవ్-స్టార్ రేటింగ్ ఉన్న 280 మందిని ఎంపిక చేశారు. వీరిలో 248 మంది ఆటో డ్రైవర్లు, 32 మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఎంపిక చేసిన డ్రైవర్లకు పర్యాటక ప్రాంతాల చరిత్ర, సాంస్కృతిక ప్రాధాన్యత, విశిష్టతలు వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. పర్యాటకులతో మర్యాదపూర్వకంగా ఎలా మెలగాలి, వారి భద్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అలాగే విదేశీయులతో మాట్లాడేందుకు గూగుల్ ట్రాన్స్‌లేట్ వంటి యాప్‌లను ఎలా ఉపయోగించాలనే దానిపైనా అవగాహన కల్పిస్తున్నారు.ఈ పథకం కోసం ర్యాపిడో తన యాప్‌లో ప్రత్యేకంగా 'టూరిస్ట్ గైడ్' అనే ఆప్షన్‌ను అందుబాటులోకి తేనుంది. పర్యాటకులు యాప్ ఓపెన్ చేయగానే, సమీపంలోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల జాబితా కనిపిస్తుంది. వారు కోరుకున్న ప్రాంతాన్ని ఎంచుకుంటే, శిక్షణ పొందిన డ్రైవర్ కమ్ గైడ్ వారిని తమ వాహనంలో అక్కడికి తీసుకెళ్లి, ఆ ప్రదేశం గురించి సమగ్రంగా వివరిస్తారు. విజయవాడ పరిసరాల్లోని భవానీ ద్వీపం, కొండపల్లి కోట, ఉండవల్లి గుహలు, అమరావతి స్థూపం, మంగినపూడి బీచ్ వంటి ప్రాంతాలకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయి.పర్యాటక ప్యాకేజీల ధరలను పర్యాటక శాఖ, ర్యాపిడో సంస్థలు సంయుక్తంగా నిర్ణయించి త్వరలోనే ప్రకటించనున్నాయి. విజయవాడలో పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైన తర్వాత విశాఖపట్నం, తిరుపతి వంటి ఇతర ప్రధాన నగరాలకు కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ వినూత్న ప్రయత్నం ద్వారా పర్యాటకులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు డ్రైవర్లకు అదనపు ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

**పర్యాటకులకు ఒకే వేదికపై ప్రయాణం-సమాచారం**

ఈ విధానంలో మంచి రేటింగ్ కలిగిన ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. వారు కేవలం డ్రైవింగ్ సేవలకే పరిమితం కాకుండా, స్థానిక పర్యాటక ప్రాంతాల చరిత్ర, ప్రాముఖ్యత, ప్రత్యేకతలను వివరించే గైడ్‌లుగా సేవలందిస్తారు.ర్యాపిడో యాప్‌లోనే పర్యాటక ప్రాంతాల వివరాలు, సమీప దర్శనీయ స్థలాలు, దర్శన సమయాలు, టికెట్ సమాచారం వంటి అంశాలు అందుబాటులో ఉంటాయి. యాప్ ద్వారా బుకింగ్ చేసిన ప్రయాణికులకు డ్రైవర్ కమ్ గైడ్ సేవలు లభిస్తాయి.

**ఉపాధి,ఆదాయం,ఆతిథ్య సంస్కృతి**

ఈ ప్రాజెక్ట్‌తో డ్రైవర్లకు అదనపు ఆదాయం లభించనుంది. పర్యాటకులకు సురక్షిత, విశ్వసనీయ సేవలు అందించడమే కాకుండా, రాష్ట్ర ఆతిథ్య సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పే అవకాశముంది.ప్రభుత్వం ఆధ్వర్యంలో భాషా నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాథమిక చరిత్ర, పర్యాటక మార్గదర్శక అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**విజయవాడలో ఎందుకు ప్రారంభం?**

కృష్ణా తీరం, కనకదుర్గమ్మ ఆలయం, ప్రకాశం బ్యారేజ్ వంటి ప్రసిద్ధ ప్రదేశాల వల్ల విజయవాడ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. ఈ నేపథ్యంలో పైలట్ ప్రాజెక్ట్‌కు ఈ నగరాన్ని ఎంపిక చేశారు.పైలట్ దశ విజయవంతమైతే, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి వంటి నగరాలకు విస్తరణ జరగనుంది.

**రాష్ట్ర పర్యాటక రంగానికి మైలురాయి**

'డ్రైవర్ కమ్ గైడ్' విధానం పర్యాటకులకు సౌలభ్యం, డ్రైవర్లకు ఉపాధి, ప్రభుత్వానికి ఆదాయ వృద్ధి,మూడు ప్రయోజనాలు కలిగించే ప్రణాళికగా భావిస్తున్నారు.

సాంకేతికతను వినియోగిస్తూ స్థానిక వనరులను ప్రోత్సహించే ఈ కార్యక్రమం అమలు దశలో ఎలా ఫలితాలు ఇస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. విజయవాడలో ప్రారంభమవుతున్న ఈ ప్రయోగం విజయవంతమైతే, ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఇది కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టే.

## తిరుమల లడ్డూ అంశం పై

# మండలిలో తీవ్ర గందరగోళం

● శాసనమండలిలో తిరుమల లడ్డూ అంశంపై చర్చలో గందరగోళం ● జగన్ హయాంలో నిజాలను తొక్కిపెట్టే ప్రయత్నం జరిగింది: ఆనం రామనారాయణరెడ్డి
● చైర్మన్ పోడియంను చుట్టుముట్టి వైసీపీ సభ్యుల నినాదాలు
● సభను వాయిదా వేసిన మండలి చైర్మన్



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో తిరుమల లడ్డూ కల్తీ అంశంపై జరిగిన చర్చ తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. సున్నితమైన తిరుమల లడ్డూ అంశం పై జరిగిన ఈ ఘటనతో శాసనమండలిలో మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అధికార-ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదిరింది. దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రభుత్వం తరఫున వివరణ ఇవ్వడానికి లేచిన వెంటనే ప్రతిపక్ష వైసీపీ సభ్యులు ఆందోళనకు దిగారు. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకుంటూ నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అయినా మంత్రి మాట్లాడుతూ.. మునుపటి పాలకులు అవినీతికి పాల్పడి, అత్యంత పవిత్రమైన తిరుమల క్షేత్రంలో శ్రీ వారి ప్రసాదం పవిత్రతను కలుషితం చేసి భక్తుల విశ్వాసాలను దెబ్బతీశారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసిన ఆ చర్యలను ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. అందుకే దేవుడే వారికి తగిన పాఠం నేర్పాడన్నారు.తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని దర్యాప్తు సంస్థల నివేదికల్లో స్పష్టమైందని మంత్రి ఆరోపించారు. గత ప్రభుత్వం నిబంధనలు విస్మరించి అనుకూల వ్యక్తులకు టెండర్లు కట్టబెట్టిందని, ఆ సమయంలో జరిగిన తప్పిదాల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన విమర్శించారు. జగన్ హయాంలో వాస్తవాలను దాచిపెట్టే ప్రయత్నం జరిగిందని కూడా మంత్రి పేర్కొన్నారు. నాటి టీటీడీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి కూడా కొన్ని విషయాలను అంగీకరించారని గుర్తు చేశారు.ఈ సందర్భంలో మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలపై కూడా సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. బుధవారం చైర్మన్ పై చేసిన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టుల గురించి ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైసీపీ సభ్యుడు అప్పిరెడ్డి డిమాండ్ చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని చైర్మన్ ఆదేశించగా, మంత్రి అచ్చెన్నాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను ఇప్పటికే వివరణ ఇచ్చానని, పోస్టులు పెట్టేది వాళ్లే, ప్రస్తావించేది వాళ్లేనని ఆయన వ్యాఖ్యానించారు.అయితే, వైసీపీ అధినేత జగన్‌పై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తూ చైర్మన్ పోడియంను చుట్టుముట్టి నిరసన తెలిపారు. నినాదాలతో సభను అస్తవ్యస్తం చేశారు. చైర్మన్ సభ్యులను శాంతింపజేయాలని పలుమార్లు కోరినా ఫలితం లేకపోవడంతో, సభను కొద్దిసేపు వాయిదా వేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో చివరికి సభను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు.

# ఉద్యోగుల సంక్షేమమే మా లక్ష్యం

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఉద్యోగులతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ,చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీని మంత్రి సవిత గురువారం రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్రాభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమన్నారు. ప్రభుత్వ పథకాల అర్హులకు చేరవేయడంలో ఉద్యోగులదే ప్రధాన పాత్ర అని అన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులను వేధిస్తే, కూటమి ప్రభుత్వం వారిని అక్కున చేర్చుకుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జీతాల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉద్యోగుల సమస్యలపై సీఎం చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందన్నారు. అనంతరం బీసీ ఎలక్ట్రిసిటీ ఉద్యోగ సంఘ నేతలు మంత్రి సవితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వి.అనురాధ, వి.గుణవంతుడు, సురేశ్, సతీష్ సహా పలువురు పాల్గొన్నారు.

# ఐఏఎస్ అంటూ నిరుద్యోగులకు టోకరా



రూ. లక్షల్లో వసూళ్లు చేసిన నకిలీ అధికారి అరెస్ట్

విజయవాడ, మేజరు న్యూస్ : ఐఏఎస్ అధికారినని నమ్మించి అమాయక నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయలు దోచుకున్న కేటుగాడిని విజయవాడ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉన్నత చదువులు పూర్తి చేసి సివిల్ సర్వీసెస్‌లో విఫలమైన అనంతరం మోసాల బాట పట్టిన ఈ నకిలీ అధికారి వ్యవహారం నగరంలో కలకలం రేపుతోంది. ఈ కుంభకోణానికి ప్రధాన సూత్రధారి పార్శ వెంకట మురళి. ఎంసీఏ వరకు చదివిన మురళి, ఐపీఎస్ అధికారి కావాలనే ఆశయంతో సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమయ్యాడు. అయితే లక్ష్యం సాధించలేకపోవడంతో నిరాశకు గురైన అతడు, ఐఏఎస్ అధికారి అంటూ నకిలీ గుర్తింపుతో మోసాలకు తెరలేపాడు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో తనకు ఉన్నత స్థాయి పరిచయాలు ఉన్నాయని చెప్పి ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను నమ్మించేవాడు.

**మహిళకు రూ.5.40 లక్షల టోకరా**

కృష్ణా జిల్లా కానూరుకు చెందిన కొండేటి నాగమణి అనే మహిళను లక్ష్యంగా చేసుకున్న మురళి, రైల్వే శాఖలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. ఈ క్రమంలో ఆమె నుంచి విడతల వారీగా రూ.5.40 లక్షలు వసూలు చేశాడు. డబ్బులు తీసుకున్న తర్వాత కాలయాపన చేయడంతో అనుమానం వచ్చిన బాధితురాలు, ఆమె భర్త మురళిని నిలదీశారు. సరైన సమాధానం ఇవ్వకపోవడంతో వారు పోలీసులను ఆశ్రయించారు.

**పోలీసుల దర్యాప్తులో అసలు రంగు**

బాధితురాలి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు మురళిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అతడు అసలు ఐఏఎస్ అధికారి కాదని, నకిలీగా వ్యవహరిస్తూ మోసాలకు పాల్పడుతున్నాడని తేలింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలువురు నిరుద్యోగులను ఇదే విధంగా మోసం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

**నిరుద్యోగులకు హెచ్చరిక**

ఉద్యోగాల పేరుతో ఎవరైనా డబ్బులు అడిగితే నమ్మవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం అర్హత, పరీక్షల ద్వారానే లభిస్తాయని గుర్తుంచుకోవాలని సూచించారు. అనుమానం వచ్చిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా సైబర్ క్రైమ్ విభాగానికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## పదో తరగతి పరీక్షలకు

# ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం

● హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు
● మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు అందుబాటులో ఉండనున్న సేవలు ● పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే అనుమతి ● విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి ఆదేశాలు



ఏపీ స్టేట్ బ్యూరో, అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా... పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్‌ఆర్టీసీ శుభవార్త చెప్పింది. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ ఉంచుకుంటే సరిపోతుంది. దానిని కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు.ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం కేవలం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. విద్యార్థులు తమ ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి, పరీక్ష పూర్తయ్యాక తిరిగి ఇంటికి రావడానికి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి 16 నుంచి ఏప్రిల్ 1 వరకు పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ ఏడాది సుమారు 6.42 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నారు.పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. బస్సుల్లో విద్యార్థులను అనుమతించే విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వారికి సహకరించాలని ఆర్టీసీ ఎండీ క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతో ఊరటనిస్తుంది. రవాణా ఖర్చుల భారం లేకుండా, సురక్షితంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు ఇది దోహదపడుతుంది. విద్యార్థులు తప్పనిసరిగా హాల్ టికెట్లను తమ వెంట తీసుకువెళ్లాలని అధికారులు సూచించారు.

## మార్చి 17న తిరుమలలో

# వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

● ఉగాదిని పురస్కరించుకుని 17న ఆలయ శుద్ధి కార్యక్రమం
● 17న బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవలు రద్దు



సూర్యప్రతినిధి, తిరుమల : తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో త్వరలో జరగబోయే 'ఉగాది ఆస్థానం' వేడుకలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 19న తెలుగు నూతన సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని నిర్వహించే ఈ ప్రత్యేక పర్వదినం కోసం ఆలయాన్ని శుద్ధి చేసేందుకు మార్చి 17న (మంగళవారం) 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు మరియు వైకుంఠ ఏకాదశి వంటి ప్రధాన పండుగలకు ముందు వచ్చే మంగళవారాల్లో ఈ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించడం టీటీడీలో అనాదిగా వస్తున్న ఆచారం.ఈ నేపథ్యంలో మార్చి 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవలను టీటీడీ రద్దు చేసింది. దీని కారణంగా మార్చి 16న ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా మిగిలిన వారికి వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఉగాది పర్వదినం సందర్భంగా కూడా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా సాధారణ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. కావున మార్చి 18న సిఫార్సు లేఖలు సమర్పించే అవకాశం ఉండదు.

# అమరావతి క్రికెట్ స్టేడియానికి మహర్దశ..

● మళ్లీ క్రికెట్ మ్యాచ్‌లు, ఏపీఎస్ 2026 ఇక్కడే ● సీఎస్ ఆర్ నిధులతో క్రీడలకు పెట్టుబడులు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ రాజధాని అమరావతిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియానికి మళ్లీ మంచి రోజులు రాబోతున్నాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న క్రికెట్ స్టేడియాన్ని ఏపీఎల్ (ఆంధ్రా ప్రీమియర్ లీగ్)కు ప్రధాన కేంద్రంగా మార్చాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌తో కలిసి మంగళగిరి స్టేడియాన్ని పరిశీలించారు. ఈ ఏడాది జరిగే ఏపీఎల్ సీజన్-5 మొదటి మ్యాచ్ మంగళగిరిలోని ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే విశాఖపట్నం, కడప ప్రాంతాల్లో ఈ ఏపీఎల్ మ్యాచ్‌లు నిర్వహిస్తామంటున్నారు. ఈ క్రికెట్ స్టేడియాన్ని అధునాతంగా తీర్చిదిద్దుతామని.. అభివృద్ధి పనులు పూర్తిచేసి రాబోయే రోజుల్లో దేశవాళీ సహా ఇతర మ్యాచ్‌లు నిర్వహించేలా సిద్ధం చేస్తామని తెలిపారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం రూపురేఖలు మరో రెండు నెలల్లో మారిపోతాయంటున్నారు. స్టేడియంలో ప్లేయర్స్ కోసం అవసరమైన గదులు నిర్మిస్తున్నామన్నారు. అలాగే డాక్టర్లు, ఫిజియోథెరపిస్టులు అందుబాటులో ఉండేలా ప్లాన్ చేస్తున్నామన్నారు కేశినేని శివనాథ్, సానా సతీష్. మంగళగిరి స్టేడియం ఆంధ్ర ప్రీమియర్ లీగ్ కు ప్రధాన కేంద్రంగా మారునుంది. 2026 ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్ - 5 త్వరలో రాష్ట్రంలో ప్రారంభం కానుంది... విశాఖపట్నం, మంగళగిరి, కడప స్టేడియాలలో మ్యాచులు జరగనున్నాయి. ఈరోజు మంగళగిరి స్టేడియాన్ని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ బాబు గారితో కలిసి పరిశీలించడం జరిగింది. మంగళగిరి క్రికెట్ స్టేడియాన్ని అధునాతన స్టేడియం గా తీర్చిదిద్దే పనులకు శ్రీకారం చుట్టాము. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-5 తొలి మ్యాచ్ ప్రారంభం నాటికి మంగళగిరి స్టేడియం ను ఆధునీకరించేందుకు ఈ రోజు పనులు ప్రారంభించడం జరిగింది. విశాఖపట్నం స్టేడియంలో 45 రోజుల్లో పూర్తిగా ఆధునికరించాం...అదేవిధంగా రానున్న రెండు నెలలలో, మే నెల నాటికి మంగళగిరి స్టేడియం ఆధునికరణ పనులు పూర్తి చేస్తాము. ఆధునీకరించిన స్టేడియంని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, ఉపముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ గారు, మంత్రివర్యులు, స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ గార్ల చేతుల మీదుగా ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాము' అంటూ కేశినేని శివనాథ్.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిజ క్రీడాకారులకు రిజర్వేషన్‌ను 2% నుంచి 3%కు పెంచామని.. డీఎస్సీ నియామకాలలో క్రీడాకోటా ద్వారా 420 పోస్టుల కేటాయించినట్లు అసెంబ్లీలో తెలిపారు. 2025--26 ఆర్థిక సంవత్సరంలో 800 మంది క్రీడాకారులకు ప్రయోజనం కలిగిందని.. క్రీడల అభివృద్ధికి రూ.24 కోట్లు కేటాయించామన్నారు. 9 క్రీడా వికాస కేంద్రాల నిర్మాణం కొనసాగిస్తున్నామని.. కొత్త కేవీకే నిర్మాణానికి రూ.29 కోట్లు కేటాయించాలని ప్రతిపాదనలు చేశామన్నారు. ఖేలో ఇండియా పథకం ద్వారా రూ.76 కోట్లు సమీకరించామన్నారు. సీఎస్ ఆర్ నిధుల ద్వారా అన్ని నియోజకవర్గాల్లో క్రీడలకు పెట్టుబడులు.. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. అమరావతిలో జాతీయ క్రీడల నిర్వహణకు కార్యాచరణ ప్రారంభించామని.. అమరావతిలో స్పోర్ట్స్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. తిరుపతి, అమరావతి, విశాఖపట్నంలో మూడు జోన్లుగా క్రీడాభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడాకారుల అభ్యున్నతికి చర్యలు తీసుకున్నామన్నారు.



# టీనేజర్లలో ఇన్‌స్టాగ్రామ్ 'వ్యసనం'

**పిల్లలకు ఫోన్లు, డిజిటల్ పరికరాలే ప్రపంచమవుతున్నాయి. దాంతో వాళ్లలో మానసిక సమస్యలు పెరుగుతున్నాయని నిపుణులు ఇప్పటికే హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఫోన్లు భద్రతదృష్ట్యా మంచివి కాదని చెబుతున్నారు. డిజిటల్ ప్రపంచంలో పిల్లలు ఏం చేస్తున్నారో గమనించాలని నిపుణులు చెబుతున్నాపెద్దలు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పెరుగుతున్న సాంకేతికత క్రమంలో సోషల్ మీడియా వినియోగం పిల్లల మానసిక ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశంపై అమెరికాలో జరుగుతున్న ఒక చారిత్రక విచారణకు ఇన్‌స్టాగ్రామ్ చీఫ్ ఆడమ్ మోస్సేరి హాజరయ్యారు. లాస్ ఏంజిల్స్ కోర్టులో జరిగిన విచారణలో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు ప్రజలు క్లినికల్‌గా బానిసలవుతారనే భావనతో తాను ఏకీభవించనని చెప్పగడం గమనార్హం. మరిన్ని వివరాలలోకి వెళితే....**

మార్క్ జుకర్‌బర్గ్ నేతృత్వంలోని మెటా కంపెనీకి చెందిన ఇన్స్టాగ్రామ్ ఇప్పుడు అమెరికాలో చారిత్రాత్మక న్యాయపోరాటాన్ని ఎదుర్కొంటోంది. లాస్ ఏంజిలస్ సుపీరియర్ కోర్టులో కొనసాగుతున్న ఈ సంచలన విచారణ బిగ్ టెక్ కంపెనీలకు కీలకంగా మారే అవకాశముంది.ఇన్‌స్టాగ్రామ్ టీనేజర్ల మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందని, అది వ్యసనం గా మారుతుందని మెటా కంపెనీకి ముందే తెలుసని పిటిషనర్లు ఆరోపిస్తు న్నారు. ఈ ఆరోపణలకు ఆధారంగా మెటా అంతర్గత పరిశోధనా నివేది కలు, ఈమెయిళ్లు, ప్రెజెంటేషన్లు న్యాయస్థానానికి సమర్పించారు. అయితే మెటా మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తూ, తమ పరిశోధనలు విని యోగదారుల అనుభవాన్ని మెరుగుపర చడానికేనని వాదిస్తోంది. ఈ విష యమై ది హైవైర్ వెబ్సైట్ విస్తృతమైన కథనాన్ని ప్రచురించింది. దాని ప్రకారం, ది ఆంక్షియస్ జనరేషన్ వెబ్సైట్ తన టెక్ అండ్ సొసైటీ ల్యాబ్ ఎట్ ఎన్వైయూ స్టెర్న్ శీర్షికలో వివిధ ప్రజావేగుల ద్వారా లీకైన మెటా అంతర్గత రహస్య పరిశోధనా నివేదికలను సంపాదించి, వాటిని క్రోడికరించి ప్రచురించింది.

**టీనేజర్లపై ప్రభావం: వ్యసనం, ఫోమో మానసిక ఒత్తిడి**

ముదురు పగుళ్లతో ముక్కలై, లోపల మెరుస్తున్న ఊదా రంగు ఇన్‌స్టాగ్రామ్ చిహ్నంతో పగిలిపోయిన, పగిలిపోయిన మానవ తల యొక్క సింబాలిక్ ఇలస్ట్రేషన్; సోషల్ మీడియా వ్యసనం నుండి మానసిక ఆరోగ్య విచ్ఛిన్నతను సూచిస్తూ, దాని చుట్టూ రంగురంగుల హృదయాలు, లైక్‌లు మరియు నోటిఫికేషన్‌లతో నిండిపోయింది.

**భయంకరం.. మెటా ట్రయల్ హెచ్చరిక!**

కోర్టులో సమర్పించిన అంతర్గత నివేదికల ప్రకారం, చాలామంది టీనేజ్ వినియోగదారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వదలలేకపోతున్నారని స్వయంగా పేర్కొన్నట్లు రికార్డులు సూచిస్తున్నాయి. "మంచైనా, చెడైనా వాడటం మాత్రం వదులుకోలేం. మేము నిస్సహాయస్థితిలో ఉన్నామ"నే అభిప్రాయాలు నమోదయ్యాయని పిటిషనర్లు చెబుతున్నారు. ఆన్లైన్ స్నేహితులకు దూరమౌతామేమోననే భయం) కారణంగా యాప్ (ఇన్‌స్టా గ్రామ్) వినియోగాన్ని తగ్గించుకోలేకపోతున్నారని కూడా అంతర్గత నివేది కలు వెల్లడిస్తున్నాయని ఆరోపణ. 2019లో తయారైన ఒక నివేదికలో "అడిక్టివ్ నరేటివ్ "అనేపదం ఉపయోగించినట్లు కోర్టులో ప్రస్తావన వచ్చింది. అంటే, వదలలేని విధంగా చెప్పడం, వ్యసనకారక కథనం అనుకోవచ్చు.ఒక 20 ఏళ్ల అమ్మాయి కోర్టులో ఇచ్చిన వాంగ్మూలం ఈ కేసును భావోద్వేగభరితంగా మార్చింది. చిన్న వయసులోనే సోషల్ మీడియా వాడకం ప్రారంభమై, తర్వాత కుంగుబాటు, శరీరాకృతి గురించి ఆందోళన, ఆత్మహత్య ఆలోచనాధోరణి లాంటివి ఎదుర్కొన్నట్లు ఆమె తెలిపింది. "ఫోన్ లేకుండా ఉండలేను" అని ఆమె కోర్టులో దీనంగా చెప్పినప్పుడు అందరూ చలించిపోయారని సమాచారం. అయితే మెటా వాదన ప్రకారం, సోషల్ మీడియా వాడకం మరియు మానసిక సమస్యల మధ్య నేరుగా సంబంధం నిరూపించబడలేదని పేర్కొంటోంది. అనేక సానుకూల అనుభవాలు కూడా వినియోగదారులకు లభిస్తున్నాయని కంపెనీ చెబుతోంది.

**టీనేజర్ల మెదడుపై అంతర్గత అధ్యయనాలు**

ఫీచర్ల రూపకల్పనపై ఆరోపణలు ఆకుపచ్చ నేపథ్యంలో చేతిలో పట్టుకున్న ఎరుపు నిషేధ చిహ్నంతో ఇన్‌స్టాగ్రామ్ యాప్ ఐకాన్‌ను క్రాస్ అవుట్ చేసి ప్రదర్శించే స్మార్ట్‌ఫోన్; ఇన్‌స్టాగ్రామ్ ఫీడ్ ఎలిమెంట్స్ పొద్దుతిరుగుడు పువ్వును బహిర్గతం చేసే చిరిగిన స్ట్రిప్ లాగా ఒలిచిపోతాయి, ఇది టీనేజర్లకు దాచిన హాని లేదా వ్యసన ప్రమాదాలను సూచిస్తుంది. .

**మెటా ట్రయల్ బయటపెట్టిన దాచిన నిజాలు.. జాగ్రత్త!**

2020లో రూపొందించిన "టీన్ ఫండమెంటల్స్" అనే అంతర్గత స్లైడ్‌షోలో కౌమార దశలో మెదడు అభివృద్ధి, రివార్డ్ సిస్టమ్, భావోద్వేగాల ప్రభావం వంటి అంశాలు చర్చించినట్లు కోర్టులో వెల్లడించారు. కౌమారదశలో మెదడు పూర్తిగా పరిపక్వం చెందకపోవడం, భావోద్వేగాలు మరియు ఆనందోద్రేకాలకు అతిగా స్పందించడం వంటి విషయాలు ఇందులో ఉన్నాయని వాదిస్తున్నారు. "ఇన్‌సేటియబుల్ అపిటైట్ ఫర్ నావెల్టీ " వంటి పదాలు ఉపయోగించి, అంటే 'కొత్తదనంపై అంతులేని ఆపేక్ష' 13 నుండి 19ఏళ్ల మధ్య వయసు పిల్లలను బలంగా ఆకర్షిస్తుందని రికార్డులు సూచించాయని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ అవగాహన ఆధారంగానే ఇన్‌ఫినిట్ స్క్రోల్, ఆటోప్లే, వేగంగా మారే కంటెంట్ డిస్కవరీ ఫీచర్లు రూపొందించారని ఆరోపిస్తున్నారు. 2017లోనే టీనేజర్లను 'అత్యధిక ప్రాధాన్యతావర్గం'గా పేర్కొన్న ఈమెయిళ్లు, 2018లో "టీనేజర్లను బలంగా ఆకర్షిస్తే దీర్ఘకాలం మనతోనే ఉంటారు" అనే వ్యాఖ్యలతో ఉన్న పత్రాలు కూడా విచారణలో ప్రస్తావనకు వచ్చాయి.

**మెటా మాత్రం ఈ ఆరోపణలను ఖండిస్తూ,** యాప్ వినియోగాన్ని సౌకర్యవంతం చేయడమే లక్ష్యమని చెబుతోంది. టీనేజర్ల అకౌంట్లకు డిఫాల్ట్ ప్రైవసీ సెట్టింగ్స్, పేరెంటల్ కంట్రోల్ టూల్స్, సున్నిత కంటెంట్ నియంత్రణలు ఇప్పటికే అమలు చేశామని తెలిపింది.నిజానికి మెటాపై ఈ ఆరోపణలు ఎప్పటి నుండో ఉన్నాయి. పిల్లల్లో సోషల్మీడియా వాడకం ఒక వ్యసనంలా మారిందని సామాజిక శాస్త్రవేత్తలు తరచూ ఆందోళన వ్యక్తం చేస్తూనేఉన్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని దేశాలు 16ఏళ్ల లోపు పిల్లలకు సోషల్మీడియా వాడకం నిషేధించాయి. ముఖ్యంగా ఇన్స్టాగ్రామ్కు విపరీతమైన ఆదరణ ఉండటం, అది కూడా టీనేజర్లే ఎక్కువగా ఉండటం చాలా సాంకేతిక, మానసిక విశ్లేషణా సంస్థలు గమనించాయి. ఈ సోషల్ మీడియా ప్లాట్ఫారమ్ వల్ల, జుకర్‌బర్గ్ వాదించినట్లు ఎటువంటి ప్రయోజనాలు లేకపోగా, పిల్లలు తమ కుటుంబానికి, స్నేహితులకు, సమాజానికి క్రమంగా దూరమవుతున్నారని పిటిషనర్లు వాదించారు.



**ఇదొక 'బిగ్ టెక్ టోబాకో మూమెంట్'..**

ఈ కేసును కొందరు నిపుణులు "బిగ్ టెక్‌కు టోబాకో మూమెంట్"గా అభివర్ణిస్తున్నారు. గతంలో పొగాకు కంపెనీలు సిగరెట్లు హానికరమని తెలిసినా, ఆ విషయాన్ని పూర్తిగా వెల్లడించలేదన్న విమర్శలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. అంతర్గత పరిశోధనా ఫలితాలు బహిర్గతం కాకపోతే, పొగాకు కంపెనీలలా తప్పించుకోవచ్చని ఒక మెటా ఉద్యోగి వ్యాఖ్యానించినట్లు కోర్టులో ప్రస్తావన వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్ హెడ్ ఆడమ్ మోస్సేరి అధిక వినియోగం సమస్యాత్మకమై ఉండొచ్చని అంగీకరించినప్పటికీ, దాన్ని స్పష్టమైన వ్యసనంగా వర్గీకరించడం సరికాదని వాదించారు.జుకర్‌బర్గ్ కోర్టులో "మేము వినియోగదారులకు విలువైన సంబంధాలను, సమాజాలను అందిస్తున్నాం" అని వాదించే ప్రయత్నం చేసారు. అయితే ఈ విచారణ ఫలితం అమెరికాలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా నియంత్రణా విధానాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

**కీలక మలుపు దిశగా టెక్ రంగం**

ఈ కేసు కేవలం ఒక కంపెనీపై ఆరోపణలకే పరిమితం కాదు. ఆల్గారిథమ్ డిజైన్, డిజిటల్ ఉత్పత్తులపై బాధ్యత, పిల్లల రక్షణ చట్టాలు వంటి అంశాలపై పెద్ద చర్చకు ఇది మార్గదర్శిగా మారే అవకాశం ఉంది. ఇలాంటి వందలాది కేసులు అమెరికాలో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, లాస్ఏంజెల్స్ కోర్టు తీర్పు కీలకంగా మారనుంది.

తల్లిదండ్రులు పిల్లల ఫోన్ వినియోగంపై అప్రమత్తంగా ఉండడం, డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి పెట్టడం మరింత అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. మెటాకు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఇన్‌స్టాగ్రామ్ టీనేజర్ల భద్రతను బలోపేతం చేసే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. సినిమాల్లో అమలు చేసే పీజీ-13 రేటింగ్ మార్గదర్శకాలను ఆధారంగా చేసుకొని టీనేజ్ యూజర్లకు అందుబాటులో ఉండే కంటెంట్‌పై పరిమితులు విధించనుంది. 18 ఏళ్లలోపు ఉన్న యూజర్లను ఆటోమేటిక్‌గా 13+ సెట్టింగ్‌లో ఉంచుతున్నట్లు ఇన్‌స్టాగ్రామ్ ప్రకటించింది. ఈ సెట్టింగ్‌ను తల్లిదండ్రుల అనుమతి లేకుండా టీనేజ్ యూజర్లు మార్చుకోలేరని తెలిపింది.సినిమాలు, షోలు అనుసరించే పీజీ-13 రేటింగ్ మార్గదర్శకాల తరహాలో ఈ మార్పులు ఉంటాయని ఇన్‌స్టా తన న్యూస్‌రూమ్ పోస్ట్‌లో తెలిపింది. ఇందులో అతి హింసాత్మక సన్నివేశాలు, అశ్లీల కంటెంట్, డ్రగ్స్ వాడకం, అసభ్య పదజాలం వంటి అంశాలను నియంత్రిం చనుంది. గతేడాది నుంచి టీన్ అకౌంట్లపై తీసుకొస్తున్న భద్రతా చర్యల్లో ఇది అత్యంత ప్రధానమైన అప్‌డేట్ అని పేర్కొంది. దీని ద్వారా ఇప్పటికే ఉన్న ఆటోమేటిక్ ప్రొటెక్షన్‌లను బలోపేతం చేస్తూ, మరింత కఠినమైన ఫిల్టరింగ్ విధానాన్ని ప్రవేశపెడుతుందని ఇన్‌స్టా తెలిపింది. తప్పు వయసు సమాచారంతో పెద్దవారిలా నటించే టీనేజర్లను గుర్తించడానికి.. ఇన్‌స్టాగ్రామ్ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత 'వయసు అంచనా టెక్నాలజీ'ని వినియోగిస్తోంది. అన్ని నియంత్రణలున్నప్పటికీ కొన్నిసార్లు అనుచితమైన కంటెంట్ కనిపించొచ్చని.. దీన్ని అధిగమించడానికి వీలైనంత త్వరగా తమ ఆల్గరిథమ్‌ను అభివృద్ధి చేస్తామని కంపెనీ తెలిపింది. టీనేజర్లకు సురక్షితమైన, వయసుకు తగిన కంటెంట్ అందిస్తూ.. తల్లిదండ్రులకు మరింత నియంత్రణ ఇచ్చే దిశగా తీసుకున్న ఈ నిర్ణయం కీలకమైందని కంపెనీ తెలిపింది.

**రాయిటర్స్ నివేదికల ప్రకారం..**

కాలిఫోర్నియా కోర్టులో మెటా ఇచ్చిన సమా చారంలో ఓ షాకింగ్ అంశం బయటపడింది. 13 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసున్న టీనేజర్లలో ఐదుగురిలో ఒకరు ఇన్‌స్టాగ్రామ్ లో అశ్లీల చిత్రాలను చూస్తున్నారని చెప్పింది. ఇది యాదృచ్ఛికంగా జరుగుతున్నదా, లేక అల్గోరిథమ్ వల్లనా అనే అంశంపై ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అంతే కాదు.. కొత్త యూజర్లను పెంచుకోవాలంటే టీనేజర్లపైనే ఎక్కువ దృష్టి పెట్టాలని మెటా అంతర్గత పరిశోధకులు కంపెనీకి మరో ముఖ్యమైన సూచన ఇచ్చారట. ఎందుకంటే ఇంట్లో ఏ స్మార్ట్‌ఫోన్‌లో ఏ యాప్ ఉండాలి అన్న నిర్ణయాన్ని చాలాసార్లు టీనేజర్స్ ప్రభావితం చేస్తారట. అంటే ఒక టీనేజర్‌ను ఆకట్టుకుంటే.. అతడి కుటుంబం మొత్తం మన యాప్స్ వాడే అవకాశం ఉందని మెటా పరిశోధకులు అంచనా వేశారట. ఈ నిర్ణయం అత్యధిక శాతం వర్కౌట్ అయ్యింది.ఇదే సమయంలో మరో ఆందోళనకర విషయం కూడా బయటపడుతోంది. ఈ ప్లాట్‌ఫార్మ్‌లు టీనేజర్ల మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని పలుమార్లు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా అమెరికాలో మెటాపై నడుస్తున్న కేసుల్లో కంపెనీ మైనర్ల మనస్తత్వాన్ని ఉపయోగించుకుని వారిని ఎక్కువసేపు యాప్‌లలో ఉండేలా చేసే విధంగా ఫీచర్లు రూపొందించిందని ఆరోపణలు వస్తున్నాయి. అడిక్షన్‌లా మారేలా నోటిఫికేషన్లు, రీల్స్, సజెషన్లు డిజైన్ చేస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఇప్పటికే.. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగిస్తున్న ఇన్‌స్టాగ్రామ్ వంటి యాప్‌లు మెటాకు చెందినవే. ఇవి పెద్దలతో పాటు టీనేజర్స్ కమ్యూనికేషన్ విధానాన్ని పూర్తిగా మార్చేశాయి. అందుకే ఈ అంశంపై వచ్చిన ప్రతి కొత్త సమాచారం టెక్ ప్రపంచానికే కాదు.. తల్లిదండ్రులు, టీచర్లు, పాలసీ మేకర్లకూ కీలకంగా మారుతోంది. అందుకే మీ పిల్లలను ఓ కంట గమనిస్తూ ఉండటం మంచిది. వారు ఎలాంటి యాప్స్ వాడుతున్నారు? ఎంత సమయం వరకు ఫోన్ యూజ్ చేస్తున్నారనే అంశాన్ని గమనిస్తూ వారికి భయం పెట్టాల్సిన బాధ్యత పేరెంట్స్‌దే. లేకపోతే చేయి జారే ప్రమాదం పుష్కలంగా ఉంది.

**సమస్యను పరిష్కరించడానికి ఇన్‌స్టాగ్రామ్ ఫీచర్లు**

చేతిలో ఫోను, ఇంట్లో టీవీ, ఆడటానికి గ్యాడ్జెట్లు.. ఫలితం.. సోషల్ మీడియా వ్యసనం. చిన్నారుల నుంచి పెద్ద వారి వరకు ఇది పాకేసింది. ముఖ్యంగా పిల్లలు ఇన్‌స్టాగ్రామ్‌లాంటి యాప్‌లకు అడిక్ట్ అయిపోతుండటంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టీనేజర్లు ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో గంటల కొద్దీ సమయాన్ని వృథా చేస్తున్నారు. ఇది వారి చదువుల మీద, ఆరోగ్యం మీద ప్రతికూల ప్రభావం చూపుతోంది. ఈ సమస్యను పరిష్కరించడానికి ఇన్‌స్టాగ్రామ్ కొన్ని అద్భుతమైన ఫీచర్లను అందుబాటులోకి తెచ్చింది. తల్లిదండ్రులు ఈ 4 టూల్స్‌ను ఉపయోగించి పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను మానిటర్ చేయొచ్చు. చాలా మంది పిల్లలు తమ సోషల్ మీడియా వాడకంపై తల్లిదండ్రులు చేసే వ్యాఖ్యలను తమ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగంగా భావిస్తారు. ఇలాంటి గొడవలు లేకుండా, పిల్లల ప్రైవసీని గౌరవిస్తూనే వారిని డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉంచడానికి ఇన్‌స్టాగ్రామ్ కింది 4 ఫీచర్లను ప్రవేశపెట్టింది.

**1. నైట్ నడ్జ్ :** అర్ధరాత్రి వరకు నిద్రపోకుండా రీల్స్ చూసే టీనేజర్ల కోసం ఇన్‌స్టాగ్రామ్ ఈ ఫీచర్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. రాత్రి పూట ఎక్కువ సమయం ఇన్‌స్టాగ్రామ్‌లో గడుపుతుంటే, ప్రతి 10 నిమి షాలకు ఒకసారి సమయానికి నిద్రపోవడం ముఖ్యం హెచ్చరిక సందేశం స్క్రీన్‌పై వస్తుంది. ఇది వారిని స్మార్ట్‌ఫోన్ పక్కన పడేసేలా చేస్తుంది.

**2. టేక్ ఏ బ్రేక్ :** పిల్లలు రీల్స్ స్క్రోల్ చేస్తున్నప్పుడు సమయం ఎలా గడిచిపోతుందో తెలియదు. టేక్ ఏ బ్రేక్ ఫీచర్ ద్వారా ఒక నిర్దిష్ట సమయాన్ని(ఉదాహరణకు 5, 10, 20 లేదా 30 నిమిషాలు) సెట్ చేసుకోవచ్చు. నిర్ణీత సమయం ముగియగానే, ఇన్‌స్టాగ్రామ్ స్క్రీన్‌పై ఒక రిమైండర్ సందేశం కనిపిస్తుంది. ఇది వినియోగదారులను కాసేపు విరామం తీసుకోమని గుర్తు చేస్తుంది. తద్వారా కంటిన్యూగా సోషల్ మీడియాలో గడపకుండా వారిని అడ్డుకోవచ్చు.

**3. క్వైట్ మోడ్ :** బడి సమయాల్లో లేదా హోమ్‌వర్క్ చేసుకునే సమయంలో నోటిఫికేషన్లు పిల్లల దృష్టిని మళ్లిస్తుంటాయి. దీనికి పరిష్కారమే క్వైట్ మోడ్. ఈ ఫీచర్ ఆన్ చేస్తే 12 గంటల వరకు ఎటువంటి నోటిఫికేషన్లు రావు. ఎవరైనా మెసేజ్ పంపితే, వారు క్వైట్ మోడ్‌లో ఉన్నారని ఆటోమేటిక్‌గా రిప్లై వెళ్తుంది. ఇది పిల్లలు ఏకాగ్రతతో చదువుకోవడానికి, రాత్రిపూట ప్రశాంతంగా నిద్రపోయేలా చేస్తుంది

**4. పేరెంటల్ సూపర్‌విజన్ :** ఇది తల్లిదండ్రులకు అత్యంత ఉపయోగకరమైన ఫీచర్. దీని ద్వారా పిల్లల ఇన్ స్టా అకౌంట్‌ను తల్లిదండ్రుల ఖాతాకు లింక్ చేయవచ్చు. పిల్లలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత సమయం గడుపుతున్నారు? ఎవరిని ఫాలో అవుతున్నారు? ఎవరైనా వారిని ఫాలో చేస్తున్నారా? వంటి వివరాలను పర్యవేక్షించవచ్చు. అయితే, పిల్లలు ఎవరితో చాట్ చేస్తున్నారో ఆ సందేశాలను మీరు చదవ లేరు, కానీ వారు ఎవరితో మాట్లాడుతున్నారనే విషయాన్ని తెలుసుకోవచ్చు. టెక్నాలజీ వల్ల కలిగే అనర్థాలను అడ్డుకోవడానికి ఈ ఫీచర్లు ఎంతగానో ఉపయోగపడతాయి.

**సత్యగోపాల్, హైదరాబాద్**



## మానసిక ఆరోగ్య సమస్యలకు కారణం?



పరిశోధన ప్రకారం, టీనేజర్లు సోషల్ మీడియాను ఎక్కువగా ఉపయోగించడం వల్ల టీనేజర్ల డిప్రెషన్ పెరగడం మరియు జీవిత సంతృప్తి తగ్గడం అనేవి ముడిపడి ఉన్నాయి. టీనేజర్లు సోషల్ మీడియాను తరచుగా ఉపయోగించడం వల్ల వారికి ఎలా అనిపి స్తుందో దానికి స్పష్టమైన సంబంధం ఉంది. 13 ఏళ్ల పిల్లలపై మరి యు బీయింగ్ 13 అని పిలువబడే సోషల్ మీడియాతో వారి సంబంధంపై నిర్వహించిన సిఎన్ఎన్ అధ్యయనంలో, రోజుకు 50 నుండి 100 సార్లు సోషల్ మీడియాను తనిఖీ చేసిన పాల్గొనేవారు రోజుకు కొన్ని సార్లు మాత్రమే తనిఖీ చేసిన వారి కంటే 37 శాతం ఎక్కువ బాధలో ఉన్నారని కనుగొన్నారు. రోజుకు 100 కంటే ఎక్కువ సార్లు తనిఖీ చేసిన వారు సగటున 47 శాతం ఎక్కువ బాధలో ఉన్నారు. కానీ సోషల్ మీడియా నిరాశ, ఆందోళన మరియు ఇతర మానసిక ఆరోగ్య సమస్యలకు ఉత్ప్రేరకంగా ఉందా? లేదా, టీనేజర్ల సోషల్ మీడియా వ్యసనం మానసిక ఆరోగ్య రుగ్మత యొక్క లక్షణమా? ఇది రెండు విధాలుగానూ ఉండవచ్చని నిపుణులు అంగీకరిస్తున్నారు. సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు టీనేజర్లు నిరాశకు, ఆందోళనకు లేదా సామాజిక భయాలకు లోనవడానికి అనేక కారణాలు ఉండవచ్చు. అదనంగా, మానసిక ఆరోగ్య సమస్య ఉన్న టీనేజర్లను సోషల్ మీడియా ఎందుకు ఆకర్షిస్తోంది అనేదానికి అనేక కారణాలు ఉన్నాయి అని క్రిస్టిన్ చెప్పారు. చాలా మంది టీనేజర్లు భావోద్వేగాలను నియంత్రించడంలో మరియు వ్యక్తీకరించడంలో ఇబ్బంది పడుతుంటారు మరియు తోటివారి ఒత్తిడికి కూడా ఎక్కువగా గురవుతారు. ఇది సోషల్ మీడియా ఫలితంగా ఆందోళన లేదా నిరాశను అనుభవించే ప్రమాదం ఉంది లేదా ఇప్పటికే ఉన్న మానసిక ఆరోగ్య సమస్యలు మరింత తీవ్రమవుతాయి.

## టీనేజర్ల సోషల్ మీడియా వ్యసనంపై గణాంకాలు


కామన్ సెన్స్ మీడియా నివేదిక ప్రకారం, టీనేజర్ల సోషల్ మీడియా వినియోగం పెరుగుతోందని తాజా టీనేజర్ల సోషల్ మీడియా గణాం కాలు సూచిస్తున్నాయి. కానీ వారు దాని నుండి తక్కువ ఆనం దాన్ని పొందుతున్నారు. వ్యసనం వారి స్క్రోలింగ్ ప్రవర్తనలలో పాత్ర పోషి స్తుంది. కొత్త నివేదిక నుండి కొన్ని తాజా గణాంకాలు ఇక్కడ ఉన్నాయి:

84 శాతం టీనేజర్లు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు మరియు 62 శాతం టీనేజర్లు ప్రతిరోజూ దీనిని ఉపయోగిస్తున్నారు.

సగటున, టీనేజర్లు రోజుకు 1 గంట 27 నిమిషాలు సోషల్ మీడియా ను స్క్రోల్ చేస్తున్నారు, ఇది 2019 నుండి 17 నిమిషాల పెరుగుదల.

టీనేజర్లలో మూడింట ఒకవంతు మంది మాత్రమే సోషల్ మీడియాను చాలా ఆస్వాదిస్తున్నారని చెబుతున్నారు, ఇది 2019లో 40 శాతం నుండి తగ్గింది.

టీనేజర్లలో 42 శాతం మంది టీనేజర్లు సోషల్ మీడియాను ఆస్వాదిస్తున్నారని చెబుతున్నారు, టీనేజర్లలో 27 శాతం మందితో పోలిస్తే. అబ్బాయిల కంటే అమ్మాయిలు ప్రతిరోజూ సోషల్ మీడియాను ఉపయోగించే అవకాశం



ఎక్కువగా ఉంది (68 శాతం వెసర్స్. 57 శాతం).

ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ మరియు స్నాప్‌చాట్ టీనేజర్లకు అత్యంత ప్రజాదరణ పొందిన సోషల్ మీడియా సైట్‌లు.

2019 మరియు 2021 మధ్య ట్వీన్లలో సోషల్ మీడియా వినియోగం 7 శాతం పాయింట్లు పెరిగి 31 నుండి 38 శాతానికి చేరుకుంది.

# ఫైనల్‌లో భారత్

## న్యూజిలాండ్‌తో సై

- వాంఖడేలో పరుగుల వరద పారించిన టీమిండియా
- ఇంగ్లాండ్ బౌలర్లను ఊచకోత కోసిన సంజు శాంసన్
- నిర్ణీత 20 ఓవర్లలో 253 పరుగులు చేసిన భారత్
- మెరుపు ఇన్నింగ్స్ ఆడిన ఇషాన్ కిషన్, శివమ్ దూబే
- ఇంగ్లాండ్ ముందు 254 పరుగుల భారీ లక్ష్యం



ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో సెమీఫైనల్ పోరులో టీమిండియా బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ జట్టు నిర్ణయం బెడిసికొట్టేలా భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి ఏకంగా 253 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. దీంతో ఇంగ్లండ్ ముందు 254 పరుగుల కఠినమైన లక్ష్యం నిలిచింది.ముఖ్యంగా వికెట్ కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోశాడు. ఆరంభం నుంచి దూకుడుగా ఆడిన శాంసన్.. కేవలం 42 బంతుల్లోనే 8 ఫోర్లు, 7 భారీ సిక్సర్లతో 89 పరుగులు చేసి ఇన్నింగ్స్కు వెన్నెముకగా నిలిచాడు. అంతకుముందు ఓపెనర్ అభిషేక్ శర్మ (9) త్వరగా పెవిలియన్ చేరినా, ఇషాన్ కిషన్ (39: 18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి శాంసన్ స్కోరు బోర్డును రాకెట్ వేగంతో ముందుకు తీసుకెళ్లాడు. వీరిద్దరూ రెండో వికెట్కు ఏకంగా 97 పరుగులు జోడించి ఇంగ్లాండ్ బౌలర్లను ఒత్తిడిలోకి నెట్టారు.

ఆ తర్వాత వచ్చిన మిడిలార్డర్ బ్యాటర్లు కూడా తగ్గేదేలే అన్నట్లు బ్యాటింగ్ చేశారు. శివమ్ దూబే 25 బంతుల్లో 4 సిక్సర్లతో 43 పరుగులు చేయగా, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 11 పరుగులకే వెనుదిరిగాడు. ఇక ఇన్నింగ్స్ చివర్లో హార్దిక్ పాండ్యా, యువ సంచలనం తిలక్ వర్మ విధ్వంసం సృష్టించారు. హార్దిక్ 12 బంతుల్లో 27 పరుగులు చేయగా, తిలక్ వర్మ కేవలం 7 బంతుల్లోనే 3 భారీ సిక్సర్లతో 21 పరుగులు పిండుకున్నాడు. భారత బ్యాటర్ల ధాటికి పవర్ ప్లేలోనే జట్టు స్కోరు 67కు చేరగా, చివరి ఓవర్లలోనూ పరుగుల మోత మోగింది.

ఇంగ్లండ్ బౌలర్లలో ఎవరూ భారత బ్యాటర్ల జోరును అడ్డుకోలేకపోయారు. స్టార్ బౌలర్ జోఫ్రా ఆర్చర్ తన 4 ఓవర్లలో ఏకంగా 61 పరుగులు సమర్పించుకుని భారీగా నిరాశపరిచాడు. విల్ జాక్స్, ఆదిల్ రషీద్ చెరో రెండు వికెట్లు తీసినప్పటికీ పరుగుల ప్రవాహాన్ని ఏమాత్రం అడ్డుకోలేకపోయారు. వాంఖడే పిచ్ బ్యాటింగ్ కు అనుకూలిస్తుండటంతో, ఇప్పుడు టీ20 ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టాలంటే ఇంగ్లండ్ ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది. భారత బౌలర్లు అర్ష్దీప్, బుమ్రా ఈ స్కోరును ఎలా కాపాడుకుంటారో వేచి చూడాలి.










# అర్జున్ టెండూల్కర్ -సానియా పెళ్లి



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్ మార్చి 5న సానియా చాంధోక్ను వివాహం చేసుకున్నారు, ఈ వేడుకకు అనేక మంది ప్రముఖులు హాజరయ్యారు. దక్షిణ ముంబైలో జరిగిన ఈ వేడుకలో క్రీడలు, వ్యాపార మరియు వినోద రంగాలకు చెందిన పలువురు తారలు వివాహానికి హాజరయ్యారు.దక్షిణ ముంబైలోని ఒక ప్రైవేట్ వేదికలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ జంట పెద్ద రోజును జరుపుకోవడానికి అతని కుటుంబ సభ్యులు, సన్నిహితులు మరియు రంగాలలోని ప్రసిద్ధ ముఖాలు సమావేశమయ్యారు. ప్రత్యేక సందర్భం చుట్టూ నిరంతరం ఉత్సాహాన్ని పెంచిన వారాల వేడుకల తర్వాత ఈ వివాహం జరిగింది. గత సంవత్సరం ఆగస్టు 25న ఈ జంట తమ నిశ్చితార్థాన్ని ప్రకటించారు.వివాహానికి హాజరు కావడానికి భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోని తన భార్య సాక్షితో కలిసి వేదిక వద్దకు వచ్చారు. భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కూడా తన భార్య నటాషా జైన్తో కలిసి ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భారత క్రికెట్ జట్టుకు చెందిన చాలా మంది ప్రముఖులు అర్జున్ టెండూల్కర్ వివాహానికి హాజరయ్యారు. లెజెండరీ ఓపెనర్ సునీల్ గవాస్కర్ తన భార్య మార్షల్ గవాస్కర్తో కలిసి అక్కడ ఉన్నారు. ఈ వేడుకకు భారత మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్, మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే, భారత మాజీ కోచ్ రవిశాస్త్రి కూడా హాజరయ్యారు. ప్రపంచ కప్ విజేత ఆల్ రౌండర్ యువరాజ్ సింగ్ తన భార్య హేజెల్ కీచ్ తో కలిసి వచ్చారు, భారత మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ కూడా ఈ వేడుకకు హాజరయ్యారు.




సానియా చందోక్ ఎవరు?

సానియా తక్కువ ప్రజా ప్రొఫైల్ను ఉంచడానికి ఇష్టపడతారు మరియు ముంబైలోని అత్యంత ప్రముఖ వ్యాపార కుటుంబాలలో ఒకటి. ఆమె ముంబైలోని ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘై మనవరాలు. ఘై కుటుంబానికి ఆతిథ్య మరియు ఆహార పరిశ్రమలలో బలమైన స్థానం ఉంది. ఇంటర్ కాంటినెంటల్ హోటల్ మరియు ప్రముఖ ఐస్ క్రీం బ్రాండ్ బ్రూక్లిన్ క్రీమరీని కలిగి ఉన్న ఘై కుటుంబం కొన్ని ముఖ్యమైన ప్రస్తావనలు.భారత ప్రభుత్వ రికార్డుల ప్రకారం (కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ), ఆమె ముంబైలోని మిస్టర్ పావ్స్ పెట్ స్పా ఁ స్టోర్ ప్రాలో భాగస్వామి మరియు డైరెక్టర్. కంపెనీ ఇన్స్టాగ్రామ్ పోస్ట్ ఆమె కంపెనీ వ్యవస్థాపకురాలిని కూడా సూచిస్తుంది. ఆమె లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుండి చదివి పట్టభద్రురాలైంది. ఆమె 2024 చివరిలో వరల్డ్వైడ్ వెటర్నరీ సర్వీస్ నుండి వెటర్నరీ టెక్నీషియన్ డిప్లొమాను కూడా పొందింది.

## జమ్మూకాశ్మీర్‌కు

# తొలి రంజీ ట్రోఫీ టైటిల్

జమ్మూ కాశ్మీర్ క్రికెట్ జట్టు తన తొలి రంజీ ట్రోఫీ టైటిల్ను గెలుచుకుని చరిత్ర సృష్టించిన తర్వాత భారత క్రికెట్ నియంత్రణ బోర్డు (బిసిసిఐ) వారిని అభినందించింది, ఈ విజయాన్ని ఈ ప్రాంతంలో క్రికెట్కు ఒక మైలురాయి క్షణంగా అభివర్ణించింది.ఉలో పోస్ట్ చేసిన పోస్ట్లో, బిసిసిఐ ఈ విజయాన్ని భారత దేశీయ క్రికెట్లో నిర్వచించే అధ్యాయంగా ప్రశంసించింది. "రంజీ ట్రోఫీలో జమ్మూ ఁ కాశ్మీర్ చారిత్రాత్మక విజయం ఈ ప్రాంతంలో క్రికెట్కు గర్వకారణమైన మైలురాయిగా మిగిలిపోతుంది" అని బిసిసిఐ రాసింది.బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న కాలంలో జమ్మూ మరియు కాశ్మీర్లో క్రికెట్ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తించడానికి మరియు ఈ క్షణాన్ని జరుపుకోవడానికి జయ్ షాను కలవాలని ఆటగాళ్ళు కోరిక వ్యక్తం చేశారని బిసిసిఐ వెల్లడించింది."వారి చిరస్మరణీయ విజయం తర్వాత, ఆటగాళ్లు ఐసిసి ఛైర్ జై షాను కలవాలని మరియు ఈ ప్రత్యేక క్షణాన్ని ఆయనతో పంచుకోవాలని హృదయపూర్వక కోరికను వ్యక్తం చేశారు, బిసిసిఐ కార్యదర్శిగా ఉన్న కాలంలో జమ్మూ ఁ కాశ్మీర్లో క్రికెట్ను బలోపేతం చేయడంలో ఆయన నాయకత్వం పోషించిన పాత్రను గుర్తిస్తున్నారు" అని అది పేర్కొంది."జట్టును కలవడానికి సమయం కేటాయించినందుకు మరియు ఈ చారిత్రాత్మక విజయాన్ని జరుపుకుంటున్న ఆటగాళ్లతో తన ప్రోత్సాహకరమైన మాటలను పంచుకున్నందుకు షాకు మేము హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము" అని జాతీయ క్రికెట్ బోర్డు జోడించింది.కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ మైదానంలో జరిగిన రంజీ ట్రోఫీ ఫైనల్లో జమ్మూ కాశ్మీర్ కర్ణాటకపై అన్ని విభాగాల్లో విజయం సాధించిన తర్వాత ఈ విజయం లభించింది.జమ్మూ కాశ్మీర్ కీలకమైన మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించడం ద్వారా టైటిల్ను కైవసం చేసుకుంది, చివరికి డ్రాగా ముగిసిన ఫైనల్లో ఇది నిర్ణయాత్మకంగా మారింది. ఐదవ రోజు మ్యాచ్ ముగిసింది, రెండు జట్లు ఆటను ముగించడానికి అంగీకరించడంతో, సందర్శకులు తమ రెండవ ఇన్నింగ్స్లో నాలుగు వికెట్లకు 324 పరుగులు చేశారు, సందర్శకులకు ఛాంపియన్షిప్ను ఖరారు చేశారు. ఈ విజయం జమ్మూ కాశ్మీర్ జట్టు భారతదేశ ప్రధాన దేశీయ క్రికెట్ ట్రోఫీని ఎత్తివేసిన మొదటిసారి, టోర్నమెంట్లో అద్భుతమైన పరుగులను సాధించింది.చారిత్రాత్మక విజయం తర్వాత, షా జట్టును అభినందించారు మరియు ఈ విజయం వెనుక ఉన్న సమిష్టి కృషిని ప్రశంసించారు. "భారతదేశంలోని జమ్మూ ఁ కాశ్మీర్ జట్టు ధైర్యం మరియు పట్టుదల యొక్క అద్భుతమైన కథను రాసినందుకు అభినందనలు" అని షా రాశారు. "ఆటగాళు ు తమకు లభించే ప్రశంసలకు పూర్తిగా అర్హులైనప్పటికీ, ఈ మైలురాయి విజయాన్ని రూపొందించడానికి తెరవెనుక కృషి చేసిన జమ్మూ ఁ కాశ్మీర్ నుండి కోచింగ్ సిబ్బంది, నిర్వహణ మరియు నిర్వాహకుల సహకారాన్ని కూడా గుర్తుంచుకోవాలి."ఈ విజయం ఈ ప్రాంతం నుండి భవిష్యత్ తరాలకు క్రీడను కొనసాగించడానికి ప్రేరణనిస్తుందని ఆయన అన్నారు. "ఈ విజయం ఈ ప్రాంతంలోని ప్రస్తుత తరం హృదయాల్లో విశ్వాసాన్ని రగిలిస్తుందని మరియు తదుపరి తరం బ్యాట్ లేదా బంతిని తీయడానికి ప్రేరేపించగలదని నేను ఖచ్చితంగా అనుకుంటున్నాను" అని షా అన్నారు."మా క్రీడ ప్రపంచవ్యాప్తంగా అని ఆయన అన్నారు.



సూర్య www.suryaa.com


# సినిమా

## పవర్ స్టార్ తుఫాన్
# ఉస్తాద్ భగత్ సింగ్



థియేటర్లో పవర్ స్టార్ తుఫాన్ కాస్త ముందుగానే రాబోతోంది. సినీ ప్రియులంతా అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా అనుకున్న దానికంటే ముందుగానే ప్రేక్షకులను అలరించడానికి వచ్చేస్తోంది. ఈ చిత్రాన్ని మార్చి 19వ తేదీన విడుదల చేయనున్నట్లు తాజాగా చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. వరుసగా వచ్చే లాంగ్ వీకెండ్లు, దాదాపు రెండు వారాల పాటు ఉండే సెలవుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్, కల్ట్ కెప్టెన్ హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న మరో భారీ ఎంటర్‌టైనర్ ఇది. గతంలో గబ్బర్ సింగ్‌తో వీరు బాక్సాఫీస్ వద్ద చరిత్ర సృష్టించారు. ఆ మ్యాజిక్‌ను తిరిగి సృష్టించడానికి, అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరిచిపోలేని థియేటర్ అనుభవాన్ని అందించడానికి ఈ ద్వయం సిద్ధమవుతోంది. ఉస్తాద్ భగత్ సింగ్ నేపథ్య సంగీతం బాధ్యతలను ఎస్. తమన్ కు అప్పగించారు. దేవి శ్రీ ప్రసాద్ అందించిన పాటలు ప్రేక్షకులను డ్యాన్స్ చేయిస్తే, తమన్ తన నేపథ్య సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్ళనున్నారు. ఎలాంటి ఆలస్యం లేకుండా పనులు సజావుగా సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. పరస్పర చర్చల అనంతరం సినిమా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ మార్పు చేయడం జరిగింది. గబ్బర్ సింగ్ తరువాత పవన్ కళ్యాణ్, హరీశ్ శంకర్ కలయికలో వస్తున్న సినిమా కావడంతో 'ఉస్తాద్ భగత్ సింగ్'పై అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఈ సినిమా నుంచి విడుదలైన ప్రతి కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభించింది. ప్రచార చిత్రాలు సంచలనంగా మారి, అన్ని సామాజిక మాధ్యమాల్లో ట్రెండ్ అవుతూ భారీ బజ్ సృష్టించాయి. 'దేఖ్ లేంగే సాలా', 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి. బ్లాక్‌బస్టర్ కలయికలో వస్తున్న ఈ సినిమా అనుభవాన్ని సంగీత ద్వయం దేవి శ్రీ ప్రసాద్, ఎస్. తమన్ మరోస్థాయికి తీసుకొని వెళ్తున్నారు. ఉస్తాద్ భగత్ సింగ్ కేవలం సినిమా మాత్రమే కాదు, ఇది అభిమానులకు ఒక గొప్ప వేడుకగా, జీవితాంతం గుర్తుండిపోయే జ్ఞాపకంగా నిలవబోతోంది.

## ఏప్రిల్ 3న 'కార్మేని సెల్వం'



పాత్‌వే ప్రొడక్షన్స్ బ్యానర్‌పై అరుణ్ రంగరాజులు నిర్మాతగా రామ్ చక్రి దర్శకత్వంలో తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రం 'కార్మేని సెల్వం'. విలక్షణ నటులు సముద్రఖని ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో గౌతమ్ వాసుదేవ్ మీనన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. లక్ష్మీ ప్రియా, అభినయ, కార్తిక్ కుమార్, బడవ గోపీ, కోతండం, కరణ్ చక్రవర్తి, శంకర నారాయణ్ వి, హరిత పరాకోడ్ ఇతర పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న తెలుగు, తమిళ భాషల్లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ చేయనున్నట్టు గురువారం ప్రకటించారు. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ పీవీఆర్ ఐనాక్స్ పిక్చర్స్ ఈ చిత్రానికి అధికారిక థియేట్రికల్ డిస్ట్రిబ్యూషన్ పార్ట్‌నర్‌గా చేరింది. దేశవ్యాప్తంగా పీవీఆర్ సంస్థ తమ విస్తరణను మరింత బలపరుచుకుంటున్న నేపథ్యంలో 'కార్మేని సెల్వం' సినిమాను భారీ స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆధునిక కాలానికి అనుసంధానమైన ఈ కథ ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో మంచి ఆసక్తిని రేకెత్తించింది.

## శరవణన్ లీడర్ టీజర్




లెజెండ్ శరవణన్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా లీడర్. ఈ చిత్రాన్ని లెజెండ్ శరవణ స్టోర్స్ ప్రొడక్షన్స్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తోంది. దర్శకుడు ఆర్ ఎస్ దురై సెంథిల్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో పాయల్ రాజ్ పుత్ హీరోయిన్ గా నటిస్తోంది. లీడర్ సినిమా ఏప్రిల్ లో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. లీడర్ మూవీ టీజర్ ఎలా ఉందో చూస్తే – నా కూతురితో పాటే నేనుండాలి, దాని కోసం ఈ ప్రపంచాన్ని ఎదిరించమన్నా ఎదిరించి గెలుస్తాను అనే పవర్ ఫుల్ డైలాగ్ తో టీజర్ ప్రారంభమవుతుంది. తన కుటుంబం కోసం చేసిన పోరాటంలో హీరో ఖైదీగా మారడం, జైలులో కూతురినే గుర్తు తెచ్చుకుంటూ బాధపడటం టీజర్ లో చూపించారు. హీరో భార్య క్యారెక్టర్ లో పాయల్ రాజ్ పుత్ నటిస్తోంది. ఈ అందమైన కుటుంబంలో ఎవరు తమ స్వార్థం కోసం చిచ్చు పెట్టారు అనేది టీజర్ లో ఆసక్తి కలిగిస్తోంది. తన కుటుంబానికి జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకునే శక్తివేల్ అనే క్యారెక్టర్ లో హీరో శరవణన్ ఇంటెన్స్ పర్ ఫార్మెన్స్ కనబర్చారు. ఆయన చేసిన భారీ యాక్షన్ సీక్వెన్సులు టీజర్ కు ఆకర్షణగా నిలుస్తున్నాయి. మాస్, యాక్షన్, సస్పెన్స్, థ్రిల్లర్ ఎలిమెంట్స్ తో లీడర్ సినిమా ప్రేక్షకుల్ని ఎంగేజ్ చేయబోతున్నట్లు టీజర్ తో తెలుస్తోంది.

## వృషకర్మ నా కెరీర్లో
# 100% బెస్ట్ మూవీ అవుతుంది



యువ సామ్రాట్ నాగ చైతన్య, విరూపాక్ష ఫేం కార్తీక్ దండుతో కలిసి నెవర్ బిఫోర్ మిథికల్ థ్రిల్లర్ వృషకర్మతో డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ చిత్రాన్ని ఎస్‌విసిసి, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. బాపినీడు సమర్పిస్తున్నారు. బిహైండ్ ది సీన్ వీడియోలు, ఫస్ట్ లుక్ తో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. ఈ రోజు, మేకర్స్ సినిమా ఫస్ట్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. గ్లింప్స్ ఒక భయానకమైన సన్నివేశంతో ప్రారంభమైయింది. ఒక దుష్ట శక్తి ప్రభావంలో ఉన్న వ్యక్తి ఒక చిత్రాన్ని గీయడం, ఒక్కసారిగా అతని లోపల నుంచి ఒక భయంకరమైన శక్తి గబ్బిలం రూపంలో బయటకు వచ్చి మరో వ్యక్తి తలలోకి దూసుకెళ్లి అతన్ని చంపేయడం వెన్నులో వణుకుపుట్టించేలా వుంది. అతీంద్రియ శక్తులు మేల్కొన్నప్పుడు, సృష్టి ధర్మం తప్పినప్పుడు, విధి ఒక వృషకర్మని ఎంచుకుంటుంది అనే వాయిస్ కథపై మరింత ఆసక్తిని పెంచింది. వృషకర్మ దుష్టశక్తిని ఎదుర్కొనేందుకు ముందుకు అడుగు వేస్తూ గ్లింప్స్ పూర్తి కావడం అదిరిపోయింది. ఈ గ్లింప్స్ భారీ స్కేల్, అద్భుతమైన విజువల్స్, గ్రిప్పింగ్ ప్రెజెంటేషన్‌తో ఆకట్టుకుంటోంది. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఒక భారీ సినిమాటిక్ యూని వర్స్‌ను నిర్మించాలనే మేకర్స్ విజన్ స్పష్టంగా కనిపిస్తోంది. నాగ చైతన్య రగ్గడ్, ఇంటెన్స్ అవతార్‌లో తన కెరీర్‌లోనే అత్యంత పవర్‌ఫుల్ ట్రాన్స్‌ఫర్మేషన్లలో కనిపించారు. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, రా, ఫియర్స్ లుక్ గ్లింప్స్‌కు ప్రత్యే కంగా నిలుస్తోంది. దుష్ట శక్తులకు ఎదురొడ్డి నిలిచే యోధుడిలా ఆయన పాత్ర కనిపిస్తోంది.

## డాల్బీ ఫార్మాట్‌లలో బైకర్



చార్మింగ్ స్టార్ శర్వా అడ్రెనలిన్ ఫిల్డ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బైకర్, భారతదేశంలోనే మొదటి మోటో క్రాస్ స్పెక్టాకిల్‌గా రూపొందుతోంది. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్నియువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. మేకర్స్ ఇప్పుడు మరో ఆసక్తికర అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రం డాల్బీ సినిమా, ఎపిక్, 4డిక్స్, సిసిఎక్స్ వంటి ప్రీమియం ఫార్మాట్లలో కూడా విడుదల కానుంది. దీంతో ప్రేక్షకులకు మరింత ఇమర్సివ్ థియేట్రికల్ అనుభూతి అందించనుంది. హార్ట్-పౌండింగ్ రేసింగ్ సన్నివేశాలు, భావోద్వేగాలతో కూడిన కథతో ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. పోస్ట్ ప్రొడక్షన్ దశలో విజువల్స్, సౌండ్ డిజైన్, హై-ఆక్టేన్ యాక్షన్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ప్రతి బైక్ రోర్, ప్రతి ఎమోషనల్ సన్నివేశం థియేటర్‌లో మరింత ప్రభావం చూపేలా రూపొందించారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ టీజర్లు సినిమాపై భారీ బజ్‌ను క్రియేట్ చేశాయి. ప్రీ-రిలీజ్ బిజినెస్ కూడా బలంగా ఉంది.

# విరోష్ వెడ్డింగ్ వైబ్స్











## 26న విడుదల కాబోతోన్న
# 'బ్యాండ్ మేళం'



'కోర్ట్' చిత్రంతో మెప్పించిన హర్ష్ రోషన్, శ్రీదేవీ జంట మళ్లీ 'బ్యాండ్ మేళం' అంటూ ఆడియెన్స్ ముందుకు రానుంది. బ్లాక్ బస్టర్ రచయిత కోన వెంకట్ నిర్మాణ సారథ్యంలో ఈ చిత్రం రూపు దిద్దుకుంది. మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో కోన ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ మీద కావ్య, శ్రావ్య ఈ మూవీని నిర్మించారు. సతీష్ జవ్వాజీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని మార్చి 26న రిలీజ్ చేయబోతోన్నారు.

ఇప్పటి వరకు వదిలిన కంటెంట్ ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసిన సంగతి తెలిసిందే. 'బ్యాండ్ మేళం' టీజర్, ట్రైలర్, మాస్ పెప్పీ సాంగ్ 'తిప్పూకుంటున్నావ్', మంచి మెలోడీ సాంగ్ 'పల్లెలోని సందల్లన్ని మీవే' వంటివి ఆడియెన్స్‌లో సినిమా పట్ల అంచనాల్ని పెంచేసింది. యూత్ ఆడియెన్స్‌లో ఇప్పటికే మంచి బజ్‌ను క్రియేట్ చేసుకున్న ఈ చిత్రం శ్రీరాముడి ఆశీస్సులతో శ్రీరామ నవమి సందర్భంగా రిలీజ్ కాబోతోంది. మార్చి 26న ఈ సినిమాని గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేశారు.




PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044